
RNI No. APTEL / 2009/27888




# స్థానిక



సంపుటి: 3 సంచిక: 8 పేజీలు: 64

## అందరూ చదవాలి



సెప్టెంబర్ 8న అంతర్జాతీయ

# స్థానిక పాలన

సంపుటి: 3 సంచిక: 8
సెప్టెంబర్, 2011

ఎడిటర్
**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
కె. అంబరీష్, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
జి. గంగాధరం
డాక్టర్ సి. కృష్ణ మోహనరావు
ఎమ్.ఎ. కుమార రాజా
ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి
డాక్టర్ లీలా ప్రసాద్
హెచ్. కూర్మారావు
డాక్టర్ కె. లక్ష్మీపతి
ఎమ్. విజయలక్ష్మి
ఎ. సుభాష్‌చంద్ర గౌడ్
డా॥ వి. శివ శంకర ప్రసాద్

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

ప్రచురణ
ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
కీ క్యాప్ స్ఫూర్తితో గ్రామ అభివృద్ధికి నడుంబిగించిన యువత ..... 3
సత్ఫలితాలనిస్తున్న అపార్డ్ కీ-క్యాప్ ..... 5
ఎన్.ఆర్.ఇ.జి.యస్.లో పారదర్శకతకు మరొక ప్రయోగం ..... 8
ఆదర్శ గ్రామం గంగదేవిపల్లి - ఒక పరిశీలన ..... 9
వర్షాకాలంలో కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన ..... 15
వాన వాన వల్లప్ప (గ్రామీణ కథ) ..... 18
గిరిజన ప్రాంత అభివృద్ధిలో గ్రామ సభ నిర్ణయాలే కీలకం ..... 21
ఫ్లారెన్స్ నైటింగేల్ ..... 24
ఫేస్‌బుక్‌లో అపార్డ్ ..... 25
గ్రామీణాభివృద్ధి విజ్ఞాన సర్వస్వం - అపార్డ్ యూ ట్యూబ్ ఛానల్ ..... 26
గార్డెన్ టాయ్‌లెట్ల కథా కమామీషు ..... 27
వినాయకా! నీ మూర్తికే నా మొదటి ప్రణామం ..... 30
మీకోసం - మేము ..... 31
అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సెప్టెంబరు 8 ..... 32
భారత దేశంలో గిరిజనాభివృద్ధి - ఒక పరిచయం ..... 36
బొంపల్లి తండా - గ్రామీణ వన నర్సరీ - ఓ విజయగాథ ..... 39
భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థతో గ్రామంలో రోగాలు మటుమాయం ..... 41
మానవత్వమా, ఏదీ నీ చిరునామా? ..... 43
స్వయం సహాయక సంఘాల బ్యాంకింగ్ అవసరాల కోసం మహిళా ఆర్థిక సంస్థ - మహిళలకు రూ. వెయ్యికోట్ల రుణాలు ..... 45
అదిగోపులి... ఇదిగోతోక... (హాస్య కథ) ..... 46
తిలక్, మాలవ్యాల ప్రశంసలు పొందిన 'కలియుగ భీముడు' ..... 49
మానవ హక్కుల సాధనకు డా॥ అంబేద్కర్ కృషి ..... 51
వ్యవసాయ పరిశ్రమలతోనే గ్రామీణాభివృద్ధి ..... 56
'గురి' కుదిరింది ..... 57
సంపూర్ణ అక్షరాస్యతను సాధించేది ఎలా? ..... 59
ఇక బ్యాంకు సేవలు గ్రామాల ముంగిట్లోకే!! ..... 63

# సంపాదకీయం..

సెప్టెంబర్, 2011

## అక్షరాస్యతే ఆలంబన

చదువు లేని మనిషి వింత పశువుగా ఎలా ఉంటాడో, చదువున్న మనిషి ఆ సమాజానికే గొప్ప సంపద అవుతాడు. అందుకే, అవిద్య ఉన్న చోట పేదరికం, మూఢనమ్మకాలు, దురాచారాలు, అనారోగ్యం, నేరాలు, అధిక జనాభా తాండవిస్తుంటే, చదువుకున్న ప్రజలున్న చోట జీవన ప్రమాణాలలో మెరుగుదల, నిత్యజీవితంలో శాస్త్ర విజ్ఞానం, ఆరోగ్యభాగ్యం, జనాభా నియంత్రణ వంటివన్నీ సాధ్యమవుతాయి. ఇందుకు దేశంలోనే అత్యధిక అక్షరాస్యత సాధించిన కేరళ, అత్యల్ప అక్షరాస్యతతో ఉన్న బీహార్ రాష్ట్రాలు ప్రత్యక్ష తార్కాణాలుగా నిలుస్తాయి.

దేశాలు, సమాజాలు ముందడుగు వేయాలంటే, అక్షరాస్యత ఎంత అవసరమో తెలియజెప్పడానికే 1965లో యునెస్కో సెప్టెంబర్ 8న ప్రతి ఏటా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. 1966 నుంచి ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో ప్రస్తుతం అక్షరాస్యుల శాతం 84 ఉండగా, ప్రపంచ సగటు కంటే ఎంతో తక్కువగా భారతదేశ అక్షరాస్యత 74% మాత్రమే ఉంది. 1947 నాటికున్న 12% అక్షరాస్యతతో పోలిస్తే, నేటి అక్షరాస్యతాశాతం 6 రెట్లకు పైగా ఉన్నప్పటికీ, ఈ పెరుగుదల నత్తనడకగానే ఉందని చెప్పాలి. ఇదేవేగంతో అక్షరాస్యతా శాతం పెరుగుతున్నట్లయితే, 2060 నాటికి కాని భారతదేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించదని ఒక అధ్యయనం చెప్తోంది.

దీన్ని బట్టి చూస్తే, మన ముందున్న కర్తవ్యం ఎంత బృహత్తరమైనదో, లక్ష్యం ఎంత సుదూరంగా ఉందో తెలుస్తోంది. 2001లో 64.83% ఉన్న అక్షరాస్యత 2011 నాటికి 74.04 శాతానికి చేరుకుంది. అంటే 9.2% పెరిగింది. ఇది అంతకుముందు దశాబ్దం కంటే తక్కువే. అయితే, ఒక ఆశాజనక పరిణామం ఏమిటంటే, పురుషుల అక్షరాస్యతా శాతం కంటే మహిళల అక్షరాస్యత శాతం ఎక్కువగా పెరగటం. పురుషుల అక్షరాస్యత కేవలం 6.9 శాతం పెరిగి 75.26% నుంచి 82.14 శాతానికి చేరుకుంటే, మహిళల అక్షరాస్యత 11.8% పెరిగి 53.67% నుంచి 65.46 శాతానికి చేరుకుంది. అయినప్పటికీ... ఇప్పటికీ - మన దేశంలో ఇంకా 35 శాతం మంది మహిళలు నిరక్షరాస్యులున్నారంటే విచారం కలగక మానదు. పురుషుల్లో నిరక్షరాస్యుల శాతం కేవలం 18 మాత్రమే ఉంది. 2011-12 నాటికల్లా స్త్రీ, పురుషుల అక్షరాస్యత శాతాల్లో వ్యత్యాసాన్ని 10 శాతానికి తగ్గించాలని ప్రణాళికా సంఘం లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ, అదింకా 17% వరకూ ఉంది.

ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, అక్షరాస్యతా శాతం 67.7 మాత్రమే ఉంది. 2001లో 60.47% ఉన్న అక్షరాస్యత కేవలం 7% మాత్రమే పెరిగింది. పురుషుల అక్షరాస్యత 75.6% కాగా, మహిళల అక్షరాస్యత 59.7% మాత్రమే. అంటే, మన రాష్ట్రంలోని మొత్తం మహిళల్లో 40 శాతం మందికి ఇంకా కనీస స్థాయిలో చదవటం, రాయటం కూడా రాదు.

మన రాష్ట్రంలో అక్షరాస్యత జాతీయస్థాయి సగటు కంటే చాలా తక్కువగా ఉంది. జాతీయ సగటు కంటే అధిక అక్షరాస్యత సాధించిన రాష్ట్రాలు చాలానే ఉన్నాయి. కేరళ (93.91%), లక్ష్యద్వీప్ (92.28%), అండమాన్ & నికోబార్ (86.3%), చండీగఢ్ (86.4%), డామన్ & డయ్యు (87.1%), ఢిల్లీ (86.3%), గోవా (87.4%), త్రిపుర (87.8%), మిజోరం (91.6%), తమిళనాడు (83.3%), హిమాచల్‌ప్రదేశ్ (83.8%), నాగాలాండ్ (80.1%), సిక్కిమ్ (82.2%), పుదుచ్చేరి (86.5%), గుజరాత్ (79.3%), మహారాష్ట్ర (82.9%), మణిపూర్ (79.8%), ఉత్తరాఖండ్ (79.6%), పశ్చిమబెంగాల్ (77.1%), పంజాబ్ (76.7%), హర్యానా (76.6%), కర్ణాటక (75.6%), మేఘాలయ (75.5%) వంటి రాష్ట్రాలు అక్షరాస్యతను పెంచుకోవటంలో బాగా ముందంజలో ఉన్నాయి.

అక్షరాస్యతను పెంచటంలో స్థానిక స్థాయిలో తీసుకునే చొరవ, చేపట్టే కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తాయని ఆయా రాష్ట్రాల్లో జరిపిన అధ్యయనాలలో రుజువైంది. ఈ విషయంలో పంచాయితీలు, స్థానిక పరిపాలనా సంస్థలు శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ, అనేక పథకాలు చేపడుతున్నాయి. ఆ పథకాలను, నిధులను సద్వినియోగ పరచుకునేలా స్థానిక సంస్థలు తగిన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. సాక్షరభారత్ కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చెయ్యాలి.

ప్రతి పల్లెలో అందుబాటులో పాఠశాల ఉండేలా చూడటం, వాటిలో తగిన సదుపాయాలు కల్పించటం, ఇంటింటికీ వెళ్లి ప్రతి బిడ్డను బడిలో చేర్పించేలా ప్రోత్సహించటం, చదువుకోవటం వల్ల కలిగే ప్రయోజనాల గురించి గ్రామ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టటం, పాఠశాలలు, కళాశాలలు దగ్గరగా లేనప్పుడు ఉచితంగా రవాణా సదుపాయాలు కల్పించటం వంటి అనేక చర్యలను స్థానిక నాయకులు చొరవతో, నిబద్ధతతో చేపట్టినప్పుడు సంపూర్ణ అక్షరాస్యత మనకూ అందుతుంది. ఆలంబన అవుతుంది. లక్ష్యం సుదూరంగానే ఉన్నప్పటికీ, అడుగులు చకచకా పడాలి. గమ్యాన్ని చేరుకోవాలి.

( కె. చంద్రమౌళి )

# కీ క్యాప్ స్ఫూర్తితో గ్రామ అభివృద్ధికి నడుంబిగించిన యువత



అపార్డులో మూడు రోజుల శిక్షణ ఆ గ్రామంలోని యువత ఆలోచనా దృక్పథాన్నే మార్చివేసింది. గ్రామ అభివృద్ధిపై యువతకు ఉన్న కోటి ఆశలకు ఊపిరిలూదింది. చేయి చేయి కలిపి యువత ముందుకు కదిలితే అసాధ్యమన్నది ఏదీ లేదని నిరూపిస్తున్నారు మహబూబ్ నగర్ జిల్లా, ఆమన్‌గల్ మండలంలోని మంగలిపల్లి గ్రామం యువత. తరతరాలుగా తమ గ్రామాన్ని పట్టి పీడిస్తున్న ఫ్లోరోసిస్ వ్యాధికి చరమగీతం పాడాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకొన్న గ్రామ యువత, తమ గ్రామంలో నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించుకొని రక్షిత మంచినీటి సదుపాయాన్ని గ్రామస్థులకు కల్పించారు.

## వార్తల్లో 'అపార్డ్'

గ్రామస్తులు ఇప్పుడు ఈ నీటినే అమృతంలా భావిస్తూ అపర భగీరథుల్లా గ్రామ యువత చేసిన ప్రయత్నాన్ని వేనోళ్ళ కొనియాడుతున్నారు. వివరాల్లోకి వెళితే... గ్రామీణాభివృద్ధికి స్వచ్ఛందంగా సేవ చేయటానికి ముందుకు వచ్చిన యువతకు ప్రత్యేక శిక్షణను అందచేస్తోందన్న విషయాన్ని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకురాలు శ్రీమతి లీలా లక్ష్మారెడ్డి ద్వారా తెలుసుకొన్న మంగలిపల్లి యువత అపార్డు కమీషనరుని కలిసి తాముకూడా ఈ శిక్షణ పొందుదామనుకుంటున్నామనే అభిలాషను వ్యక్తం చేసారు. మంగలిపల్లి గ్రామ పంచాయితీ కీ - క్యాప్ ప్రయోగం క్రింద ఎంపిక చేయబడని గ్రామం కానప్పటికీ అపార్డు కమీషనరు వీరిలో ఏడుగురు యువకులకు శిక్షణలో ప్రవేశం కల్పించారు.



గ్రామీణాభివృద్ధిపై వివిధ కోణాలను స్పృశిస్తూ అపార్డు రూపొందించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం తమను ఎంతో ప్రభావితం చేసిందని యువజన నాయకుడు మురళి అంటున్నారు. శిక్షణా కార్యక్రమంలో ప్రదర్శించిన గంగదేవిపల్లి, హాజీపల్లి, పాండురంగాపూర్, చీదేడ్ ఉత్తమ గ్రామ పంచాయితీలపై రూపొందించిన లఘు చిత్రాలు తమనెంతో ఆకట్టుకున్నాయని, ఈ గ్రామాల వలెనే తమ గ్రామాలను కూడా అభివృద్ధి పథంలోకి తీసుకొని రావాలనే కాంక్షతో గ్రామంలో ఉన్న 150 మంది యువకులను సమీకరించి ఒకే యువజన సంఘంగా సంఘటితం చేసామని మురళి అన్నారు.

గ్రామ అభివృద్ధిని వేగవంతం చేయటానికి గతంలో తమ యువజన

సంఘం ద్వారా మద్య నిషేధానికి కృషిచేసినప్పటికీ గ్రామస్తుల సహకారం కొరవవడంతో, ప్రయత్నాన్ని మధ్యలోనే వదిలివేసామని చెప్పి, అపార్డులో శిక్షణ పొందిన తరువాత ప్రజాభాగస్వామ్యాన్ని ఎలా సాధించాలనే మెలుకువలు తెలుసుకున్నామని, ఇప్పుడు తప్పక విజయం సాధించగలమనే విశ్వాసాన్ని వ్యక్తంచేస్తున్నాడు మురళి.

'కీ క్యాప్' గ్రామం కానప్పటటివకీ అపార్డు నుండి పొందిన స్ఫూర్తితో ఏకలవ్యుని శిష్యరికంలా మంగలిపల్లి యువత తమ గ్రామంలో సమస్యలు గుర్తించి, ఒక్కొక్క సమస్యని పరిష్కరించటానికి నడుంబిగించారు. తొలుత గ్రామంలోని మంచినీటిలో ఉన్న ఫ్లోరైడ్ సమస్యను పారద్రోలి గ్రామస్తులకు సురక్షిత త్రాగు నీరు సరఫరా చేయటానికి శ్రీమతి లీలా లక్ష్మారెడ్డి ద్వారా స్మాట్ అక్వా మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రరెడ్డిని కలిసి తమ సమస్యను వివరించటంతో తమ కంపెనీ తరపున వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను ఉచితంగా నెలకొల్పటానికి ముందుకు వచ్చారు. అనతి కాలంలోనే గ్రామంలో అనువైన ప్రదేశాన్ని యువకులు గుర్తించటం, నిర్మాణానికి అవసరమైన చిన్న చిన్న మొత్తాలను గ్రామస్తుల నుండి సేకరించటంతో 'స్మాట్ అక్వా' వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసుకొంది.

నిర్మించిన ప్లాంట్‌ను తమ స్ఫూర్తి ప్రదాత అయిన అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి ద్వారా ప్రారంభించుకున్న గ్రామ యువత గ్రామ అభివృద్ధి పట్ల తమ నిబద్ధతను మరొక్కసారి నొక్కి చెప్పారు. తేది : 6-8-2011న మంగలిపల్లిలో ప్లాంట్‌ను ప్రారంభించిన అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, జీవనాధారమైన సురక్షిత త్రాగునీటిని అందించటానికి యువత చూపిన స్ఫూర్తి ఆదర్శనీయమనీ, గ్రామంలో ఉండే యువకులందరూ ఒకే యువజన సంఘంగా ఆవిర్భవించటం ప్రశంసనీయమన్నారు.

త్రాగునీటి కాలుష్యం వల్లనే గ్రామీణ ప్రాంతాలలో 90 శాతం వ్యాధులు సంక్రమిస్తున్నాయని, సురక్షిత త్రాగునీరు అందించటానికి గ్రామ యువత చేసిన ప్రయత్నం గ్రామ అభివృద్ధికి తొలిమెట్టని, ఇంకా వైద్య, ఆరోగ్య, అక్షరాస్యత, పారిశుద్ధ్యం, పౌష్టికాహారం పర్యావరణ పరిరక్షణ తదితర రంగాలపై కూడా యువత దృష్టి సారిస్తే గ్రామం





సమగ్రంగా అభివృద్ధి చెందగలదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 64 సంవత్సరాలు గడిచినప్పటికీ గ్రామాలు ఈ రంగాలలో వెనుకబడి ఉండటం బాధాకరమని, ఇటువంటి పరిస్థితులను మెరుగుపర్చాల్సిన బాధ్యత యువత మీద ఉన్నదని ఆయన అన్నారు.

గ్రామీణాభివృద్ధికి సుమారు 250 పథకాలు అందుబాటులో ఉన్నప్పటికీ వివిధ కారణాల రీత్యా ప్రజలకు చేరువకావటం లేదని అందుకే కీక్యాప్ కార్యక్రమం ద్వారా ప్రయోగాత్మకంగా కొన్ని గ్రామాలలో ప్రజలలో సాధికారతను పెంపొందించే కార్యక్రమం చేపట్టామని ఆయన అన్నారు. మంగలిపల్లి కీ - క్యాప్ గ్రామం కానప్పటికీ, ఇక్కడి యువకులలో ఉన్న తపన అపార్డు బృందాన్ని ఈ గ్రామానికి రప్పించిందని, గ్రామం మరింత అభివృద్ధి పొందాలనే అభిలాషను వ్యక్తంచేసారు.

ఇదే కార్యక్రమంలో మరొక అతిథిగా పాల్గొన్న సమాచార హక్కు మాజీ కమీషనర్ శ్రీ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ, వ్యక్తి సంస్కారంతోనే సమాజ సంస్కారం జరుగుతుందని, యువత ముందుగా తమను తాము బాధ్యతగల వ్యక్తులుగా తీర్చి దిద్దుకోవాలని పిలుపునిచ్చారు. పాశ్చాత్య ధోరణుల వల్ల యువత పెడదారి పట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఎవరికి వారే జాగరూకతతో మెలగుతూ సమాజవికాసానికి కృషిచేయాలన్నారు. గ్రామఅభివృద్ధికి మంగలిపల్లి యువకులు చూపుతున్న శ్రద్ధపట్ల హర్షం వ్యక్తంచేసారు. ఏమార్పుని అయితే నువ్వు ఆశిస్తున్నావో ముందు నువ్వే ఆ మార్పువి కావాలి అన్న గాంధీజీ పలుకులను స్ఫూర్తిగా తీసుకొని గ్రామాన్ని మరింత అభివృద్ధి పరచాలన్నారు. దేశభక్తి ఆవశ్యకతను వివరిస్తూ వందేమాతరం రవీంద్ర చేసిన ప్రసంగం యువతను ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో స్మాట్ అక్వా ఎం.డి రవీంద్ర రెడ్డి, గ్రామ సర్పంచ్ సురేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ జంగయ్య, ఎం.పి.టి.సి. జంగయ్య, అపార్డు ఫ్యాకల్టీ సభ్యులు ప్రొ. సూర్యనారాయణరెడ్డి, సుభాష్‌చంద్రగౌడ్, కూర్మారావు, డా.వి.ఎస్.ఎస్. ప్రసాద్,శ్రీమతి లీలా లక్ష్మారెడ్డి, శ్రీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ■



# సత్ఫలితాలనిస్తున్న అపార్డ్ కీ-క్యాప్

**ప్రజల సాధికారతే లక్ష్యంగా అపార్డ్ ప్రారంభించిన కీ - క్యాప్ ప్రయోగం రాష్ట్ర వ్యాప్తంగా 78 గ్రామాలలో సత్ఫలితాలను ఇస్తూ గ్రామీణాభివృద్ధి వేగవంతం కావటానికి దోహదపడుతోందని అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. అన్నారు. 1-8-2011న రాష్ట్రంలోని 22 జిల్లాలో ఎంపిక చేయబడిన 78 గ్రామ పంచాయితీల సర్పంచ్, భారత్ నిర్మాణ్ వాలంటీర్లతో అపార్డ్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అపార్డ్ కమీషనరు చంద్రమౌళి మాట్లాడుతూ, కీ - క్యాప్ ప్రయోగం క్రింద అపార్డులో శిక్షణ పొందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్లు శిక్షణలో చెప్పిన విషయాలను మనసా, వాచా, కర్మణా పాటిస్తూ గ్రామాల్లో మార్పుకి కృషి చేయుటం ఒక ఆహ్వానించదగ్గ పరిణామం అని అన్నారు.**

సామాజిక వికాస కార్యక్రమాల్లో గ్రామ నిర్మాణంలో యువత భాగస్వాములు కావటం వల్ల గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా పురోభివృద్ధి సాధిస్తాయని ఆయన అన్నారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లతో నిరంతరం సంబంధ బాంధవ్యాలు నెరపటానికి సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవటానికి ఉన్న అన్ని మార్గాలను అపార్డు అవలంభిస్తోందని అన్నారు. ఇప్పటికే భారత్ నిర్మాణ్ వాలంటీర్ల మొబైల్ ఫోన్‌లకు సంక్షిప్త సందేశాలను పంపటం, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కార్యకలాపాలు ఫేస్ బుక్, యూ - ట్యూబ్‌లలో ఉంచడం, 'స్థానిక పాలన' మాస పత్రికలో ప్రచురించటం వంటివి చేస్తున్నామని అపార్డు కమీషనరు తెలియచేసారు. కె.యు. బ్యాండ్, మన టి.వి ద్వారా మండల పరిషత్తులలో ప్రతీ నెలా శిక్షణా కార్యక్రమాలు కూడా అందచేయటం జరుగుతుందన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న వివిధ జిల్లాల భారత్ నిర్మాణ్ వాలంటీర్లు తాము చేస్తున్న కార్యక్రమాల గూర్చి వివరించారు. జిల్లా వారీగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేస్తున్న స్ఫూర్తి దాయక కార్యక్రమాలు ఇలా ఉన్నాయి.

### కరీంనగర్

రామ చంద్రాపూర్ గ్రామ పంచాయితీలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం, పెరటితోటల పెంపకం, 10 వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించటం, గ్రామంలో పాన్, గుట్కా నిషేధానికి కృషి చేయటంతో పాటు గ్రామంలో ఒక ఓపెన్ లైబ్రరీ ఏర్పాటు చేసుకొని గ్రామాన్ని ఒక విజ్ఞాన వంతమైన గ్రామంగా మార్చటానికి కృషిచేస్తున్నారు. అంతేగాకుండా ఆహార భద్రతలేని కుటుంబాలను గుర్తించి వారికి పి.డి.ఎస్. పథకం ద్వారా అందే బియ్యానికి అదనంగా అవసరమైన బియ్యాన్ని సేకరించి అందచేయటం మరొక విశేషం.

కరీంనగర్, దేశాయ్‌పేట గ్రామంలో మద్యపాన నిషేధం కోసం 15 మంది సభ్యులతో ఒక బృందాన్ని ఏర్పర్చుకొని ప్రజలను జాగృత పర్చటం, గ్రామంలో ఇటీవలి కాలంలో సంభవించిన పెనుగాలులకు మరమ్మత్తులకు గురైన వీధి దీపాలు బాగు చేయటం, గ్రామంలో పచ్చదనం పరిశుభ్రం పెంపొందించే చేపట్టటం వంటివి పనులను చేస్తున్నారు.

### శ్రీకాకుళం

అన్నవరం - గ్రామంలో 23 ఏళ్ళుగా ఆక్రమించబడిన కమ్యూనిటీ హాల్‌ను ఆక్రమణ నుంచి విముక్తం చేసి వినియోగంలోకి

తీసుకొనివచ్చారు. గ్రామంలో సమతను నెలకొల్పే ఉద్దేశ్యంతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు రామమందిరం, ఆంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్టించటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. వారానికి 3 రోజులు స్వచ్ఛందంగా పారిశుద్ధ్య పనులకు హాజరవటం చేస్తున్నారు.

## వరంగల్

గ్రామీణాభివృద్ధికి ఆదర్శంగా భావించబడే గంగదేవి పల్లిలో కూడా ఇంత వరకూ దృష్టిపెట్టని సమస్యలపై బి.ఎస్.వి.లు దృష్టి సారిస్తున్నారు. గుట్కా, పాన్ పరాగ్ వంటివి నిషేధించటానికి ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామంలో వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వకుండా బి.ఎస్.వి.లు శ్రమదానం చేస్తున్నారు.

## తూర్పుగోదావరి జిల్లా

గూగుల్ అంతర్జాతీయ సంస్థచే ఉత్తమ గ్రామ పంచాయితీగా గుర్తించబడ్డ జేగురుపాడు గ్రామ పంచాయితీలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు పారిశుద్ధ్యం పెంపొందించటానికి, గుట్కా నిషేదించటానికి, ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించటానికి పలు కార్యక్రమాలు చేపట్టారు.

తూర్పుగోదావరి జిల్లా రావులపాడు పంచాయితీ - గ్రామంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉండటంతో యువత నడుంబిగించి ప్రొక్లెయిన్ల సహాయంతో చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. చెట్లు నాటే కార్యక్రమం, కచ్చా డ్రైన్‌ల నిర్మాణం, బెల్టు షాపుల మూసివేత, పాన్ పరాగ్, గుట్కా నిషేధం, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, ఇంటింటి సామాజిక ఆర్థిక సర్వే, వంటి పలు కార్యక్రమాలు చేపట్టారు.

## నల్గొండ జిల్లా

అనాజీపూర్ గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం, బెల్టుషాపుల మూసివేత, మద్యపాన నిషేధం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

మంథాపూర్ గ్రామంలో కూడా చెట్లు నాటే కార్యక్రమం, ఇప్పటికే అమలులో ఉన్న మద్యపాన నిషేధాన్ని పకడ్బందిగా అమలు చేయటం.

## ఆదిలాబాద్

మారుమూల వెనుకబడిన ప్రాంతమైనప్పటికీ, బి.ఎస్.వి.లు స్ఫూర్తి దాయకమైన పనులతో తమ గ్రామాలకు గుర్తింపుతెస్తున్నారు. గ్రామంలో బడిమాని వేసిన పిల్లలను బడిలో చేర్పించటం, విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేయడం, తల్లితండ్రులలో పిల్లలను చదివించాలనే అవగాహన పెంపొందించటం వంటి వాటితో పాటు మొక్కల పెంపకం కూడా చేపట్టారు.



## చిత్తూరు (కొట్టాల పంచాయితీ)

అపార్డు శిక్షణ వల్ల తాము ఎంతో స్ఫూర్తిపొందామని కొట్టాల గ్రామ పంచాయితీని ఆదర్శ గ్రామంగా మార్చటానికి ఇప్పటికే 25 కార్యక్రమాలను చేపట్టామని బి.ఎస్.వి. సుధ తెలియచేసారు. వీటిలో ముఖ్యంగా బి.ఎస్.వి.ల స్వంత నిధులు రూ.30,000/-లతో పారిశుధ్య కార్యక్రమం చేపట్టి 60 ట్రాక్టర్ల చెత్తను తొలగించామని, గ్రామంలో బెల్టు షాపులు అన్ని మూసి వేయించటం. సుమారు 1000 మొక్కలు నాటటం, దాతల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రానికి ఆట వస్తువులు, కృషి విజ్ఞాన కేంద్రం సహాయంతో పెరటి తోటల విత్తనాల పంపిణీ, గ్రామానికి బస్ సౌకర్యం పునరుద్ధరించుకోవటం, యం.పి.డి.ఓ. సహకారంతో కుట్టు శిక్షణ, క్రొవ్వొత్తుల తయారీలో శిక్షణకు అర్హులను ఎంపిక చేయటం వంటివి చేపట్టి సఫలీకృతులు కావటం జరిగిందని బి.ఎస్.వి. సుధ తెలియచేసారు. నెడ్‌కాప్ సహకారంతో గ్రామంలో సౌరదీపాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలియచేసారు. 100% పారిశుద్ధ్యం సాధన దిశలో ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలియచేసారు.

చిత్తూరు జిల్లా రొంపిచర్ల పంచాయితీ : గ్రామంలో బీడీ కార్మికులు ఎక్కువగా ఉండటం వల్ల పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉన్నదనీ అందుకే బి.ఎస్.వి.లు శ్రమదానంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియచేసారు. కె.వి.కె. సాయంతో వినికిడి యంత్రాలు పంపిణీ చేసినట్లు తెలియచేసారు.

## ఖమ్మం జిల్లా

మేడేపల్లి గ్రామంలో బి.ఎస్.విలు చొరవ తీసుకొని వైద్య, ఆరోగ్య, శిబిరం నిర్వహించి గుండెజబ్బులు గల 20 మందిని క్రొత్తగా గుర్తించటం జరిగిందని చెప్పారు. వీరిలో 3 చిన్నారులకు మెడిసిటి హాస్పిటల్ సౌజన్యంతో ఆరోగ్యశ్రీ క్రింద శస్త్ర చికిత్స చేయించటం జరిగింది. గ్రామానికి ఆర్.టి.సి. బస్సుని పునరుద్ధరించుకొనే ప్రక్రియలో గ్రామస్థులచే 'వనిత' కార్డులను 200 కొనుగోలు చేయించటం, ప్లాస్టిక్ వినియోగం నిషేధించటం, మొక్కలు నాటటం, వంటి పనులు చేపట్టినట్లు బి.ఎస్.వి. నాగేంద్ర తెలియచేసాడు.

విజయనగరం (ఇద్దనవలస, మన్యపురిపేట) - గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన, ప్లాస్టిక్ బ్యాన్, శతశాతం పాఠశాలలో నమోదు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

## మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ జిల్లాలోని హాజీపల్లి, దూస్‌కల్ గ్రామాలలో, పారిశుద్ధ్య కార్యక్రమాలు, విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ, ప్లాస్టిక్ నిషేధం, మధ్యపాన నిషేధం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

## పశ్చిమగోదావరి

సూరాపురం, పెదతాడేపల్లి గ్రామాలలో - పారిశుద్ధ్య కార్యక్రమాలు, సురక్షిత త్రాగునీరు, మద్యపాన నిషేధం, మొక్కలు నాటే కార్యక్రమం వంటివి చేపట్టారు.

## కడప

పొట్ల దుర్తి గ్రామానికి చెందిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, కీ - క్యాప్ స్ఫూర్తితో గ్రామంలో వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించటం, పారిశుద్ధ్య కార్యక్రమం, స్వయం సహాయక సంఘాల పనితీరు మెరుగుపర్చటం, మధ్యాహ్న భోజన కార్యక్రమం అమలు తీరుని మెరుగుపర్చటం, వంటివి చేపట్టినట్లు తెలియచేసారు.

## నెల్లూరు


మాంబాపూర్ జయపురం గ్రామాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా మార్చటానికి కృషిచేస్తున్నారు. 60 మరుగుదొడ్లు మంజూరు చేయించుకొన్నారు.

## మెదక్

జిన్నారం మండలంలోని మాంచాపూర్ గ్రామంలో ఇప్పటికే 100% కుటుంబ నియంత్రణం, పారిశుద్ధ్యం, విద్యార్థుల నమోదు చేయటం జరిగిందని, క్రొత్తగా ఏర్పడ్డ 13 కుటుంబాల కోసం వ్యక్తిగత మరుగు దొడ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టినట్లు తెలియచేసారు. మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపట్టారు. 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలియచేసారు.

## అనంతపూర్

అనంతపూర్ జిల్లాలోని మెంకట గ్రామం నుండి మాట్లాడిన బి.ఎన్.వి.లు, తమ గ్రామంలో పర్యావరణ పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టినట్లు, మంచినీటి ఓ.హెచ్.యస్.ఆర్. ప్రతీ 15 రోజులకు తప్పనిసరిగా శుభ్రపర్చుతున్నట్లు తెలియచేసారు.



వడ్లు పల్లి గ్రామ పంచాయితీలో గ్రాగునీటి ట్యాంకులను ప్రతీ 15 రోజులకు ఒక్కసారి తప్పనిసరిగా శుభ్రం చేయింటం, పచ్చదనం - పరిశుభ్రం కార్యక్రమాలు చేపట్టటం, రహదారుల కిరువైపులా ఉన్న మొక్కలను తొలగించటం వంటి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో గోడలపై పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను జాగృతపర్చేందుకు గోడ వ్రాతలు కూడా స్వచ్ఛందంగా వ్రాశారు.

## కృష్ణా జిల్లా

ఈడ్పుగల్లు గ్రామంలో సమగ్ర అభివృద్ధి కోసం 7 కమిటీలు ఏర్పాటు చేసుకొన్నట్లు, గ్రామంలో కుటుంబాల ఆర్థిక సామాజిక సర్వే చేపట్టినట్లు తెలియచేసారు.

## ప్రకాశం

కనపర్తి గ్రామంలోని పేద కుటుంబాలు జీవనోపాధి కోసం వలసలు వెళ్ళేవారని, అపార్డ్ కీ - క్యాప్ కార్యక్రమంలో శిక్షణ తరువాత గ్రామంలోని బి.ఎన్.వి.లు అందరూ కూడ పలుక్కొని సర్పంచ్ సహకారం ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. పథకం క్రింద - గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించినట్లు తెలియచేసారు. సర్పంచ్ సహకారం దాతల సహకారంతో 2 నీటి శుద్ధి ప్లాంట్లను గ్రామంలో నెలకొల్పినట్లు తెలియచేసారు. గ్రామంలో మద్యపాన నిషేధాన్ని, ప్లాస్టిక్ నిషేధాన్ని అమలులో తీసుకొని రావటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియచేసారు. అంగన్‌వాడీ సెంటర్ పనితీరులో మెరుగుదల తీసుకొని రావటానికి కృషి చేస్తున్నట్లు తెలియచేసారు.

## గుంటూరు

మేజర్ పంచాయితీ అయినప్పటికీ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని అమలు తీసుకొని రావాటానికి ప్రయత్నిస్తున్నట్లు అమరావతి పంచాయితీ సర్పంచ్ తెలియచేసారు. బి.ఎన్.వి. డేవిడ్ మాట్లాడుతూ, యస్.సి. స్మశాన వాటికను బి.ఎన్.వి. లు శుభ్రపర్చినట్లు తెలియచేసారు. గుంటూరు జిల్లా పల్లపాడు సర్పంచ్ శ్రీ సాంబశివరావు మాట్లాడుతూ **"సర్పంచ్‌గా తాను 10 సంవత్సరాలలో చేయలేని పనిని బి.ఎన్.వి.లు ఒక్క నెలలో చేసి చూపారని అన్నారు."**

## వైజాగ్

చీదేడ్‌లో జరిగిన కీ- క్యాప్ స్ఫూర్తితో పొంగలిపాక గ్రామంలో 9 కమిటీలు ఏర్పాటు చేసినట్లు, గ్రామం అభివృద్ధికి అన్ని వర్గాలతో కల్పి పనిచేస్తున్నట్లు తెలియచేసారు. గర్భిణీ స్త్రీలు, పిల్లల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కలుగచేయటానికి క్విజ్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు తెలియచేసారు. ఆగష్టు 15 నుండి సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలులోకి తీసుకొని రావటానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలియచేసారు.


# ఎన్.ఆర్.ఇ.జియస్. లో పారదర్శకతకు మరొక ప్రయోగం




జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన శ్రామికుల వివరాలు, వారు పనిచేసిన దినాలు, పొందిన వేతనం తదితర వివరాలతో కూడిన సమాచారాన్ని గ్రామ ప్రజలందరికీ తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో గ్రామ పంచాయితీలో బహిరంగ ప్రదేశాలలో గోడలపై వివరాలను పొందుపర్చే ప్రక్రియకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ సన్నాహాలు చేస్తోంది.



ఇందులో భాగంగా రాష్ట్రంలోనే తొలిసారిగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చీదేడ్ గ్రామ పంచాయితీ పరిధిలో 2011-2012 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన పనుల వివరాలు, పనుల నిర్వహణలో హాజరైన శ్రామికుల వివరాలు, వారు ఈ ఆర్థిక సంవత్సరంలో పనిచేసిన మొత్తం దినాలు, ప్రస్తుత మాసంలో పనిచేసిన రోజులు, పొందిన వేతనం తదితర వివరాలను గ్రామంలో వివిధ ప్రదేశాలలో గోడలపై చెరిగిపోని విధంగా ఆయిల్‌పెయింట్‌తో బోర్డులను వ్రాయించారు.




సమాచారం గోడలపై ప్రదర్శించటంతో, పనుల నిర్వహణలో 100% పారదర్శకత రావటమే కాక క్షేత్ర స్థాయిలో జవాబుదారీ తనం పెరగటానికి దోహదపడుతున్నట్లు రంగారెడ్డి డి.డబ్ల్యు.ఎం.ఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ మారుపాక నాగేష్ అంటున్నారు. గోడలపై ఇటువంటి సమాచారాన్ని పొందుపర్చటంవల్ల ఆ సమాచారం సరియైనదీ కానిదీ పోల్చి చూచుకోవటానికి, ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని పనిదినాలు మిగిలి ఉన్నదీ తెలుసుకోవటానికి చాలా సులభంగా ఉందని శ్రామికులు హర్షం వ్యక్తపరుస్తున్నారు. ■



# ఆదర్శగ్రామం గంగదేవిపల్లి
## ఒక పరిశీలన

**గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం**
**గ్రామ స్వరాజ్యానికి నిలువు... ఆదర్శాలకు నెలవు.**
**ఆ అభివృద్ధి పల్లె చూడు... పచ్చనిపల్లె గంగదేవిపల్లి.**
**పల్లె పల్లవించె... ప్రజలే 'ప్రభువులు'....**
**పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలు, ప్రజలే పాలకులకు నిజమైన దేవుళ్లు.**

గ్రామ పంచాయితీ పల్లెల అభివృద్ధికి మూలం. ప్రజలు తమను తాము పాలించుకొనే పద్ధతే గ్రామ స్వరాజ్యం అంటారు. పల్లెల్లో నేడు అనేక అంశాల్లో అభివృద్ధి జరుగవలసి వున్నది.

పంచాయితీ వ్యవస్థ ద్వారా పల్లెల జీవితాన్ని పెంపు చేసుకోవలసిన పరిస్థితి ఇది. రాబోయే తరాలు మనల్ని గుర్తించుకోవాలంటే మనం మంచి పునాదుల్ని వేయాలి.

స్వాతంత్ర్యం వచ్చి అరవయ్యేళ్లు. మనం సాధించిన అభివృద్ధి ఎంత అని ప్రశ్నించుకుంటే... బహుళజాతి పరిశ్రమలు వస్తున్నాయి. ఐటి రంగం విస్తరిస్తోంది. ఉద్యోగావకాశాలూ పెరుగుతున్నాయి. సిటీలు గ్రేటర్లవుతున్నాయి. ప్రగతివైపు పరుగు తీస్తున్న నగరాలు ఈ ప్రశ్నకు జవాబు. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు. మనం ఎదుర్కొంటున్న సమస్యలేంటి అని యోచించుకుంటే... నిరక్షరాస్యత. జీవన ప్రమాణాల తరుగుదల, పేదరికం, ఆకలిచావులు, కునారిల్లిపోతున్న పల్లెలే ఇక్కడ సమాధానం. అభివృద్ధి నగరాల్లో, సవాళ్లు గ్రామాల్లో... ఇదీ తేడా! సవాళ్లను స్వీకరించి ఈ తేడాను తొలగించగలిగితే? ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తలరాతలు సరిదిద్దుకుంటే? సరిగ్గా ఇలాంటి ప్రయత్నమే చేసింది వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి. ఆ ఊరి ప్రజలే గ్రామ ప్రగతిరథ సారథులై ప్రణాళికలు వేసుకున్నారు. పట్టుదలగా వాటిని అమలు చేసుకున్నారు. గ్రామాన్ని స్వర్గధామం చేసుకున్నారు. రచయిత, గ్రామ సందర్శన, పరిశీలన చేసి ప్రజలతో చర్చించి రాసిన నిజాలు, అందరికీ ఆదర్శంగా నిలిచి అభినందనలు అందుకుంటున్నారు.

పాతికేళ్ల క్రితం.... కూన రామయ్య వయసు 46. రోజులాగే ఆరోజు తాగేసి వచ్చాడు. రోజులానే భార్యతో గొడవ. వాగుడు పూర్తయ్యాక నిద్రలోకి జారుకున్నాడు.... శాశ్వతంగా! ఓకుటుంబం అనాథ అయ్యింది. ఇలా నాటుసారాకు బలైన కుటుంబాలు చాలనే ఉన్నాయి ఆ ఊళ్లో.

గోనె బుచ్చమ్మ, వయసు ముప్పై అయిదు. కానీ ఆరోగ్యపరంగా అరవయ్యేళ్ల వృద్ధురాలు.కాస్త దూరం నడిస్తే ఆయాసం. ఏదైన పనిచేసుకుందామంటే కీళ్లనొప్పులు, నాగిరెడ్డి ఆగమ్మ, కొమరయ్య.... ఇలా ఊళ్లో చాలామందిని ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. అందరు

తాగేదీ ఫ్లోరైడ్ నీళ్లే మరి.

ఇలాంటి సమస్యలు ఒకటీ రెండూ కాదు, ఏది చూసిన అంతే! రోడ్లు... ఉన్నాయి, కానీ లేనట్టే, కరెంటు... కలల్లోనే: విద్య.... పునాదులే సమాధులు, చుట్టంచూపుగా పలకరించే ప్రభుత్వాధికారులకు 'అయ్యా మా ఊరిని ఉద్ధరించండీ' అంటూ గ్రామస్థులు ఎన్ని అర్జీలు ఇచ్చుకున్నారో లెక్కలేదు. వాటి అతీగతీ మాత్రం తెలీదు. అప్పుడప్పుడూ వచ్చే రాజకీయ నాయకులని నమ్ముకున్నా అదే పరిస్థితి. గ్రామంలో ఇన్ని సమస్యలకి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమని కొందరూ 'ప్రత్యేక పంచాయతీకాక శివారు గ్రామం కావడావేననని' ఇంకొందరూ వాదులాడుకోవడం, చివరికి 'అంతా మన తలరాత' అని అందరూ సరిపెట్టుకోవడం అలవాటైపోయింది, ఆ తరుణంలో...

### ఓ ఉద్యమం

కూసం రాజమౌళి (ప్రస్తుత సర్పంచ్), అతని స్నేహితులు గోనె చరాలు, చల్లమల్లయ్య, కూసం నారాయణ, పెండ్లి రాజయ్య తదితరులు అప్పట్లో నవయువకులు. వీళ్లకి కాస్తోకూస్తో అక్షరజ్ఞానం ఉంది. ఊరి సమస్యల్ని చూసి వారిలో ఎంత ఆవేదన, ఏదో ఆలోచన. 'తమ ఊరివైపు ఎవ్వరూ వేలెత్తి చూపకూడదు, సరికాదా నలుగురికీ ఆదర్శంగా నిలవాలి. అందుకు తాము ఏం చేయాలి? అసలు ఏమైనా చేయగలమా? ప్రజలను చైతన్యవంతం చేస్తే మార్పు తప్పక సాధ్యం. కానీ చైతన్యం అనేది ప్రజల ఆలోచనల్లోంచి రావాలి. ఓ ఉద్యమంగా మారాలి. ఉప్పెనై ఎగసిపడాలి. అభివృద్ధి తీరాలు చేరవయ్యేది అప్పుడే, కానీ అది సాధ్యమేనా? ఎలా? వారిలో నిరంతరం ఇదే ఆలోచన.

గంగదేవిపల్లిలో రోడ్లులేవు. డాక్టరు లేడు, బడిలేదు, కాని ఏలోటూ లేనిది ఒకటుంది.... అదే మద్యం, ఇంటా బయటా గొడవలకు ఆజ్యం. భార్యాభర్త ఇరుగూ పొరుగూ... సాయంత్రమైతే శత్రువుల వీధులే రణక్షేత్రాలు, తెల్లారితే పంచాయితీలు. 'తాగేసి వచ్చి పిల్లల్నీ నన్నూ చావగొట్టాడంటూ ఓ భార్య, 'నోటికొచ్చినట్టూ వాగుతున్నాడంటూ ఓ పక్కింటాయన, రోజూ ఇదే వరస, మరోపక్క నాటుసారా కాటుకు బలౌతున్న కుటుంబాలు, ఇదంతా చూసిచూసి విసిగిపోయిన రాజమౌళి ఇలా అయితే లాభం లేదు. ఊర్లో మందు దొరక్కుండా చెయ్యాల్సిందే అనుకున్నారు. ఏదైతే అది కానిమ్మని, తనకు తానే సారాపై నిషేధం విధించారు. గ్రామంలో చాలామంది ఈ నిర్ణయానికి మద్దతు పలికారు. కానీ మందుబాబులకి మాత్రం అది మింగుడుపడలేదు. 'కుర్రాళ్లు ఊరిని చెడగొడుతున్నారంటూ ప్రచారం మొదలుపెట్టారు. వీళ్లకి సారా కాంట్రాక్టర్లూ వంతపాడారు... వాళ్ల వ్యాపారాలు సాగాలి కదా! 'దుకాణాలను నాశనం చేయకండి. గ్రామాభివృద్ధికి కావాల్సిన నిధులు మేమిస్తామంటూ కొందరు కాంట్రాక్టర్లు ఆశచూపారు. కానీ వారి ఆటలు సాగలేదు. సారా బాధిత కుటుంబాలు, రాజమౌళితో సహా గ్రామ యువకులు ఒక్కటయ్యారు. నిషేధానికే కట్టుబడ్డారు. అయితే ఊళ్లో




మందు అమ్మకాలు పూర్తిగా ఆగలేదు. ఇలా కాదని, ప్రతీ తాగుబోతు ఇంటికి వెళ్లి ఓపికగా నచ్చజెప్పారు. రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచాయి. తాగొచ్చిన భర్తలకి భోజనం పెట్టని భార్యలు, మత్తులో వాగుతున్న వాడితో మాట్లాడని ఇరుగుపొరుగులు ఊళ్లో పెరిగిపోయారు. చివరికి మందుబాబులు మారక తప్పలేదు. ఊళ్లో మద్యం అమ్మకాలకు అక్కడితో చెల్లు.

### ఇది తొలి అడుగు... అభివృద్ధిపథంవైపు... చేతులు కలిపి....

1994లో మచ్చాపురం గ్రామ పంచాయతీ నుంచి గంగదేవిపల్లి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. 1995లో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సర్పంచ్‌తో సహావార్డు సభ్యులందరూ మహిళలనే ఎన్నుకుని గ్రామస్థులు ప్రత్యేకతను చాటుకున్నారు. ఆ తర్వాత 2001లో జరిగిన ఎన్నికల్లోనూ మహిళలనే ఎన్నుకోవడం విశేషం.

1994లో గంగదేవిపల్లిని పంచాయతీగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. అప్పటికి చాలా ఏళ్లుగా గ్రామాన్ని పీడిస్తోంది తాగునీటి సమస్య. రక్షిత మంచినీటి కోసం ట్యాంకులు అవసరం, నిధుల్లేవు. వస్తాయన్న నమ్మకమూ లేదు. అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరిగితే జరిగేది... కాలయాపనే! ఇలాకాదని ఇతర మార్గాలు యోచించాడు రాజమౌళి. నీళ్ల ట్యాంకులు నిర్మించడానికి లోధీ, బాలవికాస్ అనే స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. అయితే గ్రామస్థుల వంతుగా రూ. 53 వేలు నిధులు సేకరించాలన్నాయి. మూడు నెలలు గడిచాయి. రాజమౌళితో సహా కొంతమంది పెద్దలు చేసిన కృషి ఫలించలేదు. ఒక్కరూపాయీ సమకూరలేదు. 'ఏం చెయ్యాలా' అని ఆలోచనపడ్డారు, చివరిక ఓ దారి కనిపించింది....



ఫలితమే నీటి కమిటీ ఏర్పాటు గ్రామంలోని ఇళ్లను గ్రూపులుగా విడదీశారు. ఒక్కో గ్రూపులో ఐదేసి ఇళ్లుంటాయి. ఆ ఇళ్ల నుంచి సొమ్మును వసూలు చేసే బాధ్యత ఆ గ్రూపు నాయకుడిది. ఈ ప్రయోగం ఫలించింది. నెల రోజుల్లో సొమ్ము వసూలైంది, ట్యాంకు నిర్మాణం పూర్తయ్యాక కుళాయిల ద్వారా మంచినీటిని అందించే ఏర్పాటూ జరిగింది. ఆ తర్వాత ఫ్లోరైడ్ రహిత తాగునీటి కోసం టాటా కంపెనీ సహాయంతో నీటిశుద్ధి ప్రాజెక్టునూ నిర్మించుకున్నారు.

### మరో ముందుడుగు... ప్రగతి వైపు ప్రయాణంలో... 'కమిటీ' కట్టుగా...

గ్రామ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలను గ్రామస్థులే నిర్వహించేందుకు గాను కమిటీల పద్ధతి ఉంది.

గంగదేవిపల్లిని ప్రగతి పట్టాలెక్కించినవి పక్కా ప్రణాళికలే. గ్రామంలో పద్ధెనిమిది అభివృద్ధి కమిటీలున్నాయి. గ్రామాన్ని పద్ధెనిమిది భాగాలు చేశారు. ప్రతీ ఇంటి నుంచి ఎవరో ఒకరు ఏదో ఒక కమిటీలో సభ్యులుగా ఉండాలి. అంటే గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములైనట్టే. ఒక్కో కమిటీలో 11 నుంచి 25 మంది సభ్యులుంటారు. ప్రతీ కమిటీ తన పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను ఎలా అమలు చేయాలో ప్రణాళికలు వేసుకుంటుంది.

**మద్యపాన నిషేధ కమిటీ...** గ్రామంలో తాగుబోతులపై ప్రత్యేక దృష్టి నిలిపి ఉంచుతుంది. పక్క ఊళ్ల నుంచి అక్రమంగా వచ్చే సారాపై ఓ కన్నేయడమూ దీని బాధ్యత, పట్టుబడితే పంచాయతీలో శిక్షలు ఎలాగూ ఉన్నాయి.

**మంచినీటి నిర్వహణ కమిటీ...** ప్రతీ ఇంటికి రక్షిత మంచినీటి పంపిణీని సమీక్షిస్తుంది. కుళాయిల చుట్టూ పరిశుభ్రత పరిశీలన కూడా దీని విధుల్లో భాగమే.

**విద్యా కమిటీ...** పాఠశాలకు సంబంధించిన వ్యవహారాలు చూసుకుంటుంది. భవనాల మరమ్మతులకు అవసరమైతే నిధులనూ ఇదే సమకూర్చుకుంటుంది.

**గంగా డిష్ కమిటీ...** కేబుల్‌కనెక్షన్ కోసం వినియోగదారులు నెలవారీ బిల్లులు చెల్లించాల్సిన పనిలేదు. ఒకేసారి రూ. 2,200 చెల్లిస్తే నిరంతరాయంగా టీవీ ప్రసారాలుంటాయి. ఈ పనులన్నీ డిష్ కమిటీ పరిధిలోనివి.

**ఆరోగ్య కమిటీ...** సీజన్ల వారీగా వచ్చే రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ముందు జాగ్రత్తలు చెప్పడం దీని పని, 'ఇద్దరే ముద్దు ఆపై వద్దు' అంటూ ప్రజల్లో కుటుంబ నియంత్రణను ప్రోత్సహించడమూ ఆ కమిటీ విధుల్లో భాగమే.

**తల్లుల కమిటీ...** ఇది అంగన్‌వాడికి అనుబంధంగా పనిచేస్తుంది. గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితులను తరచూ తెలుసుకుని



అవసరమైన సలహాలివ్వడం దీని పని.

**రికవరీ కమిటీ...** రైతులు వ్యవసాయ రుణాలను బ్యాంకులను సక్రమంగా చెల్లిస్తున్నారో లేదో పర్యవేక్షిస్తుంది. **అక్షరాస్యత కమిటీ...** అందరికీ విద్య లక్ష్యంతో కమిటీ వేశారు. ప్రతీ 10 మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీర్ నియమించారు. ఎనిమిదేళ్ల కృషి ఫలించింది. 2002 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధించింది.

**సంపూర్ణ పారిశుధ్య కమిటీ...** వచ్ఛదనానికి, పరిశుభ్రతకు గంగదేవిపల్లి పెట్టింది పేరు. ప్రతీ ఇంటికి ఒక మరుగుదొడ్డి ఉంటుంది. బహిరంగ ప్రదేశంలో మలవిసర్జన నిషిద్ధం. అలా చేస్తే రూ. 500ల జరిమానా తథ్యం. గ్రామంలో ప్రతీవీధి మలుపున పారిశుధ్యం అవశ్యకతను తెలిపే ఫ్లెక్సీలు కనిపిస్తాయి.

**అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ....** వ్యవసాయం, పశుగ్రాసం, జలమార్గాలు, చిన్నతరహా అటవీ ఉత్పత్తి, మార్కెట్ ఎరువుల అమ్మడం, కంపోస్ట్ తయారు చేయటం.


**ఫుడ్ అడ్వయిజరి (పర్యవేక్షక) కమిటీ....** ప్రజా పంపిణీ సామాజిక ఆస్తులు నిర్వహణ మధ్యాహ్న భోజనం పథకం వృద్ధాప్యపు, వితంతు వికలాంగుల మొదలగు ఫించన్లు.

**లబ్ధిదారుల కమిటీ...** ఉదా: చెరువులు త్రవ్వడం, రోడ్ల మరమ్మత్తు మరియు మంచినీటి సరఫరా మరుగుదొడ్లు స్మశాన వాటికలు, గ్రామ ప్రణాళికలు మొదలగునవి.

**గ్రామాభివృద్ధి కమిటీ...** జరిగే అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలూ దీని పరిధిలోకి వస్తాయి. విధుల విభజన కమిటీలవారీగా ఉంటుంది. సభ్యుల ఎన్నికలు రొటేషన్ పద్ధతిలో జరుగుతాయి. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా అభివృద్ధి పనులకు అవసరమైన వనరులను ఆయా కమిటీలే సమకూర్చుకుంటాయి.

### తేడా వస్తే

2000లో ఈ గ్రామానికి సిమెంట్‌రోడ్లు మంజూరు చేసింది ప్రభుత్వం. అదే సమయంలో ప్రతీ ఇంటికీ ఓ వ్యక్తిగత మరుగుదొడ్డిని మంజూరు చేసింది. 'ఇంకేం అన్ని సదుపాయాలూ సమకూరాయి కదా'




అనుకోవడానికి వీల్లేదండోయ్. అసలు సమస్య ఇక్కడే... ప్రజలు వీటిని సక్రమంగా వినియోగించుకునేవారు కాదు... ముఖ్యంగా వ్యక్తిగత మరుగుదొడ్లను. పిల్లలు మలమూత్ర విసర్జనలు ఇళ్లముందే. పెద్దలైతే ఇంకాస్త అవతల, రోడ్లపై నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి మారలేదు. ఈ సారి ప్రజలందరినీ సమావేశ పరచారు రాజమౌళి. పారిశుద్ధ్యం ఆవశ్యకతను వివరించారు. వీధుల్లో గోడలపై స్లోగన్లు రాయించారు. ర్యాలీలను నిర్వహించారు. సహనంతో నచ్చజెప్పారు. ఆరు నెలలు గడిచేసరికి ప్రజల్లో మార్పు వచ్చింది.... అందరిలో కాదు, కొందరిలో! మిగిలిన వారినీ చైతన్య వరిచే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఈసారి దండోపాయం... ఆరుబయట బహిర్భూమికి వెళితే రూ.500 జరిమానా విధించారు. మెజారిటీ ప్రజల మద్దతుతో బహిరంగ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులనూ పెట్టారు. మొదట్లో ఒకరిద్దరికి జరిమానాలు తప్పలేదు. తర్వాత్తర్వాత అలాంటి కేసు ఒకటీ లేదు.

ఓసారి రాజమౌళియే జరిమానా కట్టాల్సివచ్చింది. వాళ్ల ఇంటి ముందు ఓ మంచినీటి కుళాయి ఉంది. దాని చుట్టూ అపరిశుభ్రంగా తయారైంది. ఆయన అది గమనించుకోలేదు. నీటి నిర్వహణ కమిటీ దాన్ని గమనించి రాజమౌళికి జరిమానా వేసింది. అంతేకాదు, కుళాయి కనెక్షన్నూ రద్దుచేసింది. తప్పు చేసినవారు ఊరి పెద్దలైన శిక్షలు తప్పవు అనడానికి ఇదో ఉదాహరణ. సర్పంచ్, మారో యాభై మంది కలసి ''నీటి పారుదల వ్యవస్థ'' పై అవగాహన పెంచుకోవడానికి ''మహారాష్ట్రలోని రాలేగావ్ సిద్ధి'' గ్రామం వెళ్లొచ్చారు. లోధి సంస్థ చేయూతతో మంచినీటి ట్యాంకులు నిర్మించుకున్న గ్రామస్థులు టాటాకంపెనీ ఆర్థిక సహాయంతో ఫ్లోరైడ్ రహిత నీటి కోసం 1996లో ఓ ప్రత్యేక ప్రాజెక్ట్‌ను రూపొందించుకున్నారు. గ్రామంలో ప్రతీ ఇంటికీ శుద్ధి చేసిన నీటిని అందిస్తోంది ఈ ప్రాజక్ట్. కుళాయి వినియోగదారులకు రూపాయికే 20 లీటర్ల చొప్పున ఫ్లోరైడ్ రహిత రక్షిత మంచినీటిని విక్రయిస్తోంది మంచినీటి నిర్వహణ కమిటీ. పక్క గ్రామాల వారు రెండు రూపాయలు చెల్లించి 20 లీటర్ల క్యానుల్లో నీరు తీసుకెళ్లొచ్చు. చుట్టు పక్కల గ్రామాల నుంచి రోజూ నీటికోసం వచ్చేవాళ్లు చాలామందే ఉంటారు. గంగదేవిపల్లి తాగునీటి ప్రాజెక్టును మరో నాలుగు గ్రామాలు ఆదర్శంగా తీసుకున్నాయి. నీటి విక్రయాల్లో వసూలైన డబ్బును ప్రాజెక్టు నిర్వహణకి వినియోగిస్తున్నారు. మిగిలిన మొత్తాన్ని పంచాయతీ ఖర్చులకు వాడుతారు. ఇతర కమిటీలకు అవసరమైన తాత్కాలిక నిధులనీ ఈ నీటి కమిటీయే ఇస్తుంది. కాబట్టి గ్రామంలోని కమిటీలన్నింటిలో ఇదే కీలకం.

## ఈ క్రమశిక్షణ... ఉజ్వల భవితకు ప్రేరణ... నూరుశాతం

'కలెక్టరు నౌకరీ చేయాల్నా, ఊళ్లేలాల్నా'... ఎనభయ్యో దశకంలో చదువులపై గంగదేవిపల్లి ప్రజల అభిప్రాయాలివి. రాజమౌళి బృందానికి మరో సవాల్. దీన్ని స్వీకరించారు. మొదట్లో అక్షరాస్యత వివరిస్తూ నాటకాలు వేయించారు. సదస్సులు నిర్వహించారు. ఇవి పూర్తయ్యాక రాత్రిబళ్లు తెరిచారు. కానీ హాజరు నిల్! ఏ ఒక్కరూ రాలేదు. పరిష్కారం... మరో కమిటీ. గ్రామంలో ఉన్న ప్రతీ పదిమంది నిరక్షరాస్యుల బాధ్యత ఓ అక్షరాస్యునిది. నయానోభయానో ఆ పదిమందికీ చదువు చెప్పడం వాలంటీరు బాధ్యత, చదువుదాం రమ్మంటే, 'మీకేం పనీపాటా లేదా' అని విసుక్కునే వారు కొందరు. 'దయచేసి మమ్మల్ని వదిలేయి బాబూ' అంటూ కాస్త మర్యాదగా తిరస్కరించేవారు ఇంకొందరు వాలంటీర్లకు అరంభంలో ఎదురైన అనుభవాలివి. రెండేళ్లు గడిచేసరికి వారి కృషి ఫలించింది. గ్రామంలో చదువురాని ప్రతీ ఒక్కరి తోనూ అక్షరాలు దిద్దించగలిగారు వాలంటీర్లు, 2002 నాటికి గంగదేవిపల్లి అక్షరాస్యత... నూరు శాతం! బడి ఈడు పిల్లలందరూ చదువుకోవాల్సిందే. పనుల్లోకి వెళ్లకూడదు. డ్రాపౌట్స్ ఉండకూడదు.. తరవాత కాలంలో గ్రామస్థులంతా ఏర్పాటు చేసుకున్న కొన్ని రూల్సు ఇవి. ఇలాంటివి మరికొన్ని తెలుసుకోవాలంటే గంగదేవిపల్లి వీధుల్లో ఉన్న బోర్డులను చూడాల్సిందే.

తదుపరి ప్రాధాన్యం పచ్చదనం. ప్రతీ ఇంటి ముందూ ఓ మొక్క పెంచడం తప్పనిసరి మొక్క మంచి చెడ్డలు ఆ ఇంటి యాజమానివే. దానికి సంరక్షణ సరిగా లేకపోతే సదరు యాజమాని ఇంటికి మంచి నీళ్ల కట్! 'మొక్కను పసిబిడ్డలా చూసుకుంటూ' నంటూ యాజమాని వాగ్దానం చేసేంతవరకూ ఇంటికి నీటి సరఫరా బంద్. ఇక విద్యుత్ చౌర్యం వంటివాటికి ఆస్కారమే లేదు. ఇంటి పన్ను చెల్లింపుల్లోనూ ఇదే క్రమశిక్షణ. ప్రతీయేడాదీ నవంబర్‌లో వందశాతం వసూళ్లవుతాయి.

## ఈ కట్టుబాట్లు.... ప్రగతిబాటలో మార్గదర్శకాలు

**ఎన్జీవోల చేయూత :** గంగదేవిపల్లి ప్రగతిలో స్వచ్ఛంద సంస్థల పాత్రా చెప్పుకోదగ్గదే, కాజీపేటకు చెందన లోధీ, బాలవికాస్ సంస్థలు గ్రామంలో నీళ్ల ట్యాంకుల నిర్మాణానికి సహాయపడ్డాయి. ట్యాంకుల కోసం గ్రామస్థుల వంతుగా దాదాపు రూ.50వేల కార్పస్ ఫండ్‌ను మొదట్లో కోరినా అభివృద్ధికోసం ప్రజలు పడుతున్న తపనను చూసి ఆమొత్తాన్ని తిరిగి గ్రామస్థులకే ఇచ్చేశాయి ఈ సంస్థలు. ప్రతి

ఇంటిముందూ మొక్కలను ట్రీగార్డులను అందించాయి.



### గ్రామ ప్రత్యేకతలు

- 1994లో గంగదేవిపల్లిని పంచాయతీగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది.
- 1995లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌తో సహవార్డు సభ్యులందరూ "మహిళ"లనే ఎన్నుకుని గ్రామస్థులు ప్రత్యేకతను చాటుకున్నారు.
- ఆ తర్వాత 2001లో జరిగిన ఎన్నికల్లోనూ ''మహిళ''లనే ఎన్నుకోవడం విశేషం.
- 1983 నుంచి గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేదం.
- 1993లో ఓవర్ హెడ్ వాటర్‌ట్యాంక్ ఏర్పడింది.
- 1996 నుంచి వందశాతం ఇంటిపన్నులు వసూలు.
- 1993లో నుంచి కులవివక్షత లేని గ్రామం.
- గ్రామంలోని అన్ని కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు,
- అన్ని కుటుంబాలు చిన్న మొత్తాల పొదపు (స్వయం సహాయక సంఘం) చేశాయి.
- 1999లో కలెక్టర్ ప్రత్యేక అవార్డు అందించారు.
- గ్రామంలో అర్హతగల అన్ని కుటుంబాలు కుటుంబ నియంత్రణ, ఇద్దరు పిల్లలకు పరిమితి.
- 2002 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధించింది.
- బడి ఈడు పిల్లలందరూ పాఠశాలకు.
- జిల్లాలో బాలకార్మికులు లేని తొలి గ్రామం.
- గ్రామస్థులకు ఫ్లొరైడ్ రహిత త్రాగునీటిని అందిస్తున్న జిల్లాలో తొలిగ్రామం.
- కెనడా, బంగ్లాదేశ్‌ల నుంచి స్వచ్ఛంద సంస్థలు వచ్చి గంగదేవిపల్లి గ్రామస్వరాజ్యాన్ని అధ్యయనం చేశాయి.
- తమిళనాడు, పాండిచ్చేరి, రాజస్థాన్ బృందాలూ వచ్చాయి. ఇతర జిల్లాల బృదాలు, ప్రజాప్రతినిధులు శిక్షణ తీసుకున్నారు.
- 2005లో గంగాదేవిపల్లికి వచ్చిన పంచాయతీరాజ్ కమీషనర్ చెల్లప్ప ప్రశంస.




- జిల్లాకు వచ్చే ఐఏఎస్ శిక్షణార్థులంతా ఈ గ్రామం గురించి చదవాల్సిందే. పాలనకు స్ఫూర్తి.
- నెలకు ఒకసారి తప్పని సరిగా పంచాయతి సమావేశం జరుగుతుంది.
- గ్రామసభ సమావేశాలు సంవత్సరంలో రెండుసార్లు తప్పకుండా జరుగుతాయి.

### ఎన్నో అవార్డులు....

- సమిష్టికృషికి ఫలితంగా ఈ గ్రామప్రజలు ఎన్నో అవార్డులనూ సొంతం చేసుకున్నారు. అందులో కొన్ని....
- 2005లో ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డిచే ఉత్తర తెలంగాణలో ఆదర్శగ్రామంగా గుర్తింపు
- 2007లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం చేతుల మీదు "నిర్మల్ గ్రామ పురస్కారం"
- 2007లో "రాజీవ్ జాతీయ ఉత్తమ గ్రామపంచాయితీ అవార్డు"
- లోకసభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కాశ్యప్ నేతృత్వంలోని న్యాయ నిర్ణేతల బృందం ఈ ఎంపిక చేసింది.
- గ్రామీణ భారత అధ్యయనం, పరిశోధన అకాడమీ ఈ అవార్డును అందించింది.
- కేంద్రమంత్రి మణిశంకర్ అయ్యర్ ముఖ్య సలహాదారు.
- నాలుగు సార్లు జిల్లాలో ఉత్తమ గ్రామపంచాయితీ అవార్డు
- సంపూర్ణ బీమా గ్రామంగా ఎల్ఐసి గుర్తింపు ఆంధ్రాబ్యాంకుచే "పట్టాభిగ్రామం"
- నిర్మల్ గ్రామ్ పురస్కార్‌నూ ఈ గ్రామం దక్కించుకుంది. అవార్డును మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఈ ఏడాది మేనెలలో సర్పంచ్‌కు అందించారు.
- జిల్లాలో ఉత్తమ గ్రామపంచాయతీగా నాలుగుసార్లు ఎంపికైంది.
- ఊళ్లోని కుటుంబాలన్నీ చిన్న మొత్తాల మొదుపులో చేరినందుకు 1999లో అప్పటి కలెక్టర్ ప్రత్యేక అవార్డుని అందించారు.


- గంగదేవిపల్లిని దేశంలోనే ఉత్తమ గ్రామపంచాయతీ - 2007గా గుర్తించింది.
- తిరుపతికి చెందిన అగ్రశ్రీ (గ్రామీణ భారత అధ్యయనం & పరిశోధనా అకాడమీ) నుండి ప్రతిభా పురస్కారం.

### లా అండ్ ఆర్డర్

ఊరన్నాక ఏవో చిన్న చిన్న తగాదాలు రాకుండా ఉంటాయా? కానీ ఎలాంటి గొడవలైన గంగదేవిపల్లి పొలిమేరలు మాత్రం దాటవు. పంచాయతీలోనే పరిష్కారమౌతాయి. అదే వాళ్ల కోర్టు గ్రామ పెద్దలు చెప్పిందే తీర్పు. కావాలంటే గీసుకొండ మండలం పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు తీసి చూడండి... ఈ ఊరిపేరే కనిపించదు. పదేళ్లనాటి ఫైళ్ల బూజు దులిపి వెతికినా ప్రయోజనం ఉండదు. మందు సీసాలు... వందనోట్లు... దొంగ ఓట్లు... వెన్నుపోట్లు... ఇవన్నీ లేకుండా ఎన్నికలా? ఊహించలేం కదా. గంగదేవిపల్లిలో ఎన్నికలంటే అర్థం వేరు. 1995 నుంచి ఇప్పటి వరకూ జరిగిన పంచాయతీ ఎన్నికలన్నీ ఏకగ్రీవాలే మహిళా సాధికారత, చట్టసభల్లో రిజర్వేషన్ల బిల్లు లాంటివి వాళ్లకి అపరిచిత పదాలే కావొచ్చు. కానీ ఊరిలో మాత్రం మహిళలు మహరాణులు. 1995 నుంచి పదేళ్లపాటు వార్డు మెంబరు నుంచి సర్పంచ్ వరకూ అందరూ మహిళలే ఊరినేలారు. ఊళ్లో మొత్తం 14 పొదుపు సంఘాలున్నాయి. ప్రతీ ఇంటి నుంచి ఓ మహిళ ఏదో ఒక సంఘంలో సభ్యత్వం తీసుకోవడం తప్పనిసరి. గ్రామాభివృద్ధి కమిటీల్లోనూ వీరి పాత్ర కీలకం. అభిప్రాయాలూ అముల్యాం.

### ఈ దిద్దుబాట్లు... విజయపథ సోపానాలు... ఎంతో ఆనందం...

'ఈ వయసులో చదువేంటని మొదట్లో అనుకున్నాను. కాని నేర్చుకున్నాక తెలిసింది దాని విలువేంటో' అంటాడు పంచాయతీ కార్యాలయంలో దినపత్రిక చదువుతూ ఓ పెద్దాయన. 'ఊరిలో ఏ పని జరగాలన్న కమిటీ సమావేశంలో నిర్ణయించుకుంటాం.' అంటుంది గాదెం కొమురమ్మ. 'అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడం. మేమే సమకూర్చుకుంటాం' అంటారు చిన మల్లారెడ్డి. ఈయన తాగునీటి కమిటీ కార్యదర్శి. ఇప్పుడా గ్రామస్థులను




పలకరిస్తే ఇలాంటి ఆనందాలు ఇంకా ఎన్నో. గంగదేవిపల్లి అభివృద్ధి పరిమళం ఇప్పుడు గ్రామపొలిమేరలు దాటింది. పాండిచ్చేరి తమిళనాడు రాష్ట్రాలకు చెందినవారే కాదు,కెనడా, బంగ్లాదేశ్‌లకు చెందిన స్వచ్ఛంద సంస్థలూ ఈ గ్రామాభివృద్ధిని స్వయంగా చూసి మెచ్చుకున్నాయి. శిక్షణ నిమిత్తం వరంగల్ వచ్చిన ప్రతీ ఐ.ఎ.ఎస్. అధికారికీ ఈ ఊరు ఓ పాఠ్యాంశం. 'దేశంలో ప్రతి జిల్లాలో కనీసం ఇలాంటి గ్రామం ఒకటుండాలి అన్నది 2005లో గంగదేవిపల్లికి వచ్చిన పంచాయతీరాజ్ కమీషనర్ చెల్లప్ప ప్రశంస. 'మేము ఎక్కడ ఏ పని చేపట్టినా ముందు ఈ ఊరినే నమూనాగా తీసుకుంటాన్నామన్నది బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు బాలచరిత స్పందన. ఇప్పుడు చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ గంగదేవిపల్లి ప్రగతి ఓ ఆదర్శ నమునా.

వేయి మైళ్ల ప్రయాణమైన ఒక్క అడుగుతో మొదలౌతుంది. గంగదేవిపల్లి అభివృద్ధి ప్రస్థానమూ అంతే! మద్యనిషేధం.... తొలి అడుగు తాగునీటి సమస్య పరిష్కారం మరో ముందడుగు.

క్రమశిక్షణ... కట్టుబాట్లు.... దిద్దుబాట్లు... ప్రగతి రథచక్రాలు. ప్రజలే సారథులు. అభివృద్ధి ఫలాలకు వారసులు గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తున్న ఇలాంటి పట్టుకొమ్మలు. అందుకోసం కలలగన్న మహాత్మునికే కాదు, మనందరికీ గర్వకారణమే, స్ఫూర్తిదాయకమే!

అందరి విజయం.... పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలు, ప్రజలే పాలకులకు నిజమైన దేవుళ్లు.

"మొదట్లో ప్రజలందరినీ ఒకే తాటిపైకి తేవడం కాస్త కష్టమైంది. అలాగని మేం ప్రయత్నించడం ఆపలేదు. అభివృద్ధి అవశ్యకతను ప్రజల్లో ప్రతీ ఒక్కరికీ తెలియజెప్పే ప్రయత్నం చేశాం. కొన్నాళ్లకి వారిలోనూ చైతన్యం వచ్చింది. ప్రతీ పనికీ స్వచ్ఛందంగా ముందుకు రాసాగారు. కమిటీ సమావేశాల్లో తీసుకున్న ప్రతీ నిర్ణయానికి ఓటింగ్ పెడతాం. మెజారిటీ సభ్యుల అభిప్రాయమే అంతిమ తీర్పు. మిగతావారూ దాన్ని వ్యతిరేకించరు. వివిధ రాజకీయ పార్టీల అభిమానులు మా గ్రామంలో ఉన్నారు. కానీ ఊరి మంచికోసం ఏ పని చేసినా పార్టీలకు అతీతంగా స్పందిస్తారు. ప్రజలందరూ ఏదో ఒక కమిటీలో సభ్యులు. కాబట్టి ఏ పని మొదలుపెట్టినా 'ఇది నాది' అనే బాధ్యతతో పూర్తిచేస్తారు. మా కృషికి గుర్తింపుగా లభించిన అవార్డులు ఎన్నో! ఈ విజయాలన్నీ ఏ ఒక్కరో సాధించినవి కావు. ఒకే మాటపై ఒక్క బాటలో గ్రామస్థులందరూ నడవడం వల్లనే సాధ్యమైంది. అందుకే, ఈ ఘనత గంగదేవిపల్లి గ్రామ ప్రజలందరిదీ! ప్రజలే ప్రభువులు.

**డా॥ కె. చొక్కయ్య,**
**అసోసియేట్‌ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్**

**బొజ్జ సురేష్,**
**రీసెర్చి స్కాలర్**

# వర్షాకాలంలో కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన

**వానలతో పాటే దోమల సంతా మొదలవుతుంది. వ్యాధుల బెడదా విజృంభిస్తుంది. వీటి వల్ల డెంగీ జ్వరాలు, మలేరియా కలుగుతాయి. వాటితో పాటు వర్షాకాలంలో కలిగే మరొక సమస్య జలుబు, జ్వరం, వాంతులు, విరేచనాలు, కామెర్లు**

### 1. జలుబు-జ్వరం

సాధారణంగా జలుబు, దగ్గు వంటివి వైరస్ కారణంగా వచ్చే సమస్యలు ఇవి చాలా వరకు వాటంతట అవే పోతాయి. మందులు తీసుకున్నా, తీసుకోకపోయినా 5-6 రోజుల్లో తగ్గుతాయి. ఈ సమయంలో జలుబు, ముక్కుదిబ్బడ, ఒళ్ళునొప్పులు వంటివి ఎక్కువగా ఉండే ఉపశమన ఔషదాలు వాడవచ్చు. జ్వరం ఎక్కువగా ఉండే తడిబట్టతో ఒంటిని శుభ్రపరచి పారాసెటమాల్ వంటి మాత్రలు వేసుకోవచ్చు. తేలికగా జీర్ణం అయ్యే ఇష్టమైన ఆహారం దేనినైనా తీసుకోవచ్చు. నీరు, ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలి. లక్షణాలు తీవ్రంగా ఉంటే వైద్యుని వెంటనే సంప్రదించాలి.

### 2. టైఫాయిడ్

ప్రధానంగా కలుషిత ఆహారం, నీటి ద్వారా వ్యాపించే సమస్య. ఇది సాల్మనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. ఈ బ్యాక్టీరియా మనుషుల్లోనే నివశిస్తుంది. టైఫాయిడ్ బారిన పడిన వారు, దాన్నుంచి కోలుకుంటున్న వారి రక్తం, ప్రేగుల్లో ఇది ఉంటుంది. మల విసర్జన ద్వారా ఇది బయట పడుతుంది. టైఫాయిడ్ నిర్ధారణ అయితే పూర్తి కోర్సు యాంటీ బయోటిక్ మందులు తప్పకుండా వేసుకోవాలి. మధ్యలో మానేస్తే టైఫాయిడ్ తిరగబెడుతుంది. ఇది ఇతరులకూ వ్యాపించే ప్రమాదమూ ఉంది.

**లక్షణాలు**

విడవకుండా జ్వరం రావటం. సాధారణంగా జ్వరం 103 నుంచి 104 డిగ్రీల వరకు ఉంటుంది. కొద్దిగా వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించటం కడుపునొప్పి, ఒళ్ళు నొప్పులు, నీరసం.

**రాకుండా తీసుకొనవలసిన జాగ్రత్తలు**

1. కలుషితమైన, ఆహారం, నీటికి దూరంగా ఉండటం
2. ఆహారం తీసుకునే ముందు మల విసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం
3. రోడ్ల ప్రక్కన అమ్మే తినుబండారాలు, పానీయాలజోలికి వెళ్ళకపోవడం మంచిది.
4. టైఫాయిడ్ జ్వరం రాకుండా టీకాలు కూడా వేయించుకోవచ్చు.


### 3.కామెర్లు

వాస్తవానికి కామెర్లు అనేది ఒక లక్షణం మాత్రమే. ఇది హెపటైటిస్-సి వంటి ఎన్నో ఇన్ఫెక్షన్లలో కనబడుతుంది. ఈ సీజన్లో విజృంభించే కామెర్లకు ఎక్కువగా హెపటైటిస్-ఏ, హెపటైటిస్-ఇ రకం వైరస్‌లు కారణమవుతాయి.

వర్షాకాలంలో మురుగు నీరు త్రాగునీటితో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఈ రకం కామెర్లు ప్రబలిపోయే ప్రమాదం ఉంది. కళ్ళు, చర్మం పసుపు పచ్చగా మారటం, రక్తంలో బైలురుబిన్ స్థాయి పెరగటం, శరీరంలోని సున్నితమైన చర్మం కూడా పచ్చబడే అవకాశాలుంటాయి. చిన్న పిల్లల్లో తేలిగ్గా తగ్గిపోయే ఈ సమస్య పెద్ద వయస్సు వారిలో నెలల తరబడి వేధించవచ్చు దీన్ని అశ్రద్ధ చెయ్యటానికి లేదు.

**లక్షణాలు**

1. హెపటైటిస్ - ఏ,ఇ రకం వైరస్‌ల వల్ల కలిగే కామెర్లలో ప్రధానంగా



ఆకలి మందగిస్తుంది. మొదటి 2,3 రోజుల్లో కేవలం వాంతులు, కొద్దిగా జ్వరం, గొంతునొప్పి, ఒళ్ళంతా నొప్పి వంటివి ఉంటాయి. 4,5 రోజుల్లో మూత్రం పచ్చగా మారుతుంది. క్రమంగా చర్మం, కంట్లో తెల్లభాగం గోళ్ళు, నాలుక పసుపుపచ్చగా అవటం కొన్ని సందర్భాలలో మలం తెల్లగా నల్లగా రంగుమారొచ్చు

2. కడుపునొప్పి, చికాకు, బలహీనత వంటివి కనిపిస్తాయి.

3. కామెర్లు ముదిరితే వాంతిలో రక్తం పడటం, కడుపులో ద్రవాలు పేరుకుపోవటం వంటి ప్రమాదకర లక్షణాలు కూడా ఉంటాయి.

**రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు**

1. పరిశుభ్రమైన నీటినే త్రాగాలి. సాధ్యమైనంతవరకూ మరగకాచి, వడకట్టి చల్లారిన తర్వాత త్రాగటం మంచిది.

2. సాధ్యమైనంత వరకు ఇంట్లో వండిన పదార్థాలు తీసుకోవాలి.


3. బయట రోడ్ల మీద ఆహారం, పానీయాలు కలుషితమయ్యే ప్రమాదం ఎక్కువ.

4. కూరగాయలు, ఆకుకూరలు బాగాకడిగిన తర్వాతే వంటకు ఉపయోగించాలి. పండ్లను కూడా బాగా కడిగాకే తినాలి.

5. కామెర్ల లక్షణాలు కనబడితే ఆకుపసర్లు, చెట్ల మందులు అని తాత్సారం చేయకుండా అనలు అవి ఏరకం కామెర్లు నిర్ధారించుకోవాలి. తగు జాగ్రత్తలు తీసుకునేందుకు వైద్యులను సంప్రదించాలి.

## 4. నీళ్ళ విరేచనాలు (డయేరియా)

బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవుల ఇన్‌ఫెక్షన్ల మూలంగా నీళ్ళ విరేచనాలు వస్తాయి, రోజుకు 2 లేదా అంతకన్నా ఎక్కువ సార్లు నీళ్ళ విరేచనాలు అవుతుంటే డయేరియాగా భావించవచ్చు. సాధారణంగా ఇది 2 లేదా 3 రోజుల వరకు ఉండిదానంతట అదే తగ్గిపోతుంది. అయితే దీంతో ఒంట్లో నీటిశాతం తగ్గిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి



వాంతులు విరేచనాలతో బాధపడే వారికి ఒంట్లో నీరు తగ్గకుండా చూసుకోవటం ముఖ్యం. లేకపోతే ఒంట్లో లవణాలన్నీ బయటకుపోయి డీ హైడ్రేషన్‌కి దారి తీస్తుంది. ఇలాంటి సందర్భాల్లో కొందరికి సెలైన్ కూడా పెట్టాల్సి వస్తుంది. పరిస్థితి ముదరకుండా ఓ.ఆర్.ఎస్.ను అరగ్లాను నీటిలో కలిపి తీసుకోవాలి. ఎన్ని సార్లు విరేచనాలు అయితే అన్నిసార్లు ఓ.ఆర్.ఎస్ కలిపిన ద్రావణాన్ని తాగటం తప్పనిసరి, మజ్జిగ, కొబ్బరినీళ్ళు సగ్గుబియ్యం, జావ, పప్పునీళ్ళు వంటి వాటిని తరచుగా తీసుకోవాలి.

## 5. డెంగీ

దోమలు, తెచ్చిపెట్టే పెద్ద ముప్పు ఈ డెంగీ జ్వరాలు. విపరీతమైన జనసాంద్రత, పారిశుధ్యలోపం, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోడవం, ఇంటి పరిసరాలలో పరిశుభ్రత లోపించటం, ఇవన్నీ డెంగీ ముప్పు తెచ్చిపెట్టే ఈడిస్ ఈజిప్టి దోమ సంతతి పెరిగేందుకు అనువైన పరిస్థితులే. ఈ దోమ కాటు ద్వారా డెంగీజ్వరకారకమైన ఫ్లావి వైరస్ వ్యాప్తి కారకాలు. ఈ దోమలు ప్రత్యేకంగా పగటిపూట కుడతాయి. ఎక్కువగా కాళ్ళు, చేతులు వంటి భాగాల మీద కుడతాయి. ఇవి స్వచ్ఛమైన నీటిలో పెరుగుతాయి. ఈ దోమ కుట్టిన తర్వాత 2 లేదా 7 రోజుల మధ్యలో డెంగీ లక్షణాలు కనబడవచ్చు.

**లక్షణాలు**

1. అకస్మాత్తుగా వణుకుతో జ్వరం రావటం. 101 నుంచి 104 డిగ్రీల వరకు జ్వరం ఉండొచ్చు.

2. తీవ్రమైన తలనొప్పి, ఒళ్ళు నొప్పులతో పాటు కండరాలు, కీళ్ళనొప్పులు ఎక్కువగా ఉంటాయి.

3. ఒకేసారి వెలుతురు చూడటం కూడా కష్టం కావొచ్చు.

4. బలహీనత, నోరు చేదు, ఆకలి మందగించటం, వాంతులు అవుతాయి.

5. కొంతమందికి ఛాతీ, వీపు మీద చిన్న చిన్న మచ్చలు రావచ్చు.

6. సాధారణంగా జ్వరం వారం పాటు ఉంటుంది. కొన్ని కేసుల్లో ఇంకా ఎక్కువ ఉండవచ్చు. కొంతమందిలో మొదటి 2 రోజులు జ్వరం వచ్చి పూర్తిగా తగ్గి మళ్ళీ వచ్చే అవకాశం ఉంది. రెండోసారి వచ్చినప్పుడు ఇది తీవ్రరూపం దాల్చే అవకాశం ఎక్కువ.

7. డెంగీ తీవ్రరూపమైన రక్తంలో ప్లేట్‌లెట్ కణాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. శరీరం మీద రక్తపు మచ్చలు రావొచ్చు. కొంత మందిలో ముక్కు, పళ్ళచిగుళ్ళ నుంచి రక్తంకారొచ్చు. రక్తపువాంతులు, నల్లని విరేచనాలు కూడా అవొచ్చు.

8. రోగి నాడి కొట్టుకోవటంతో రక్తపోటు తగ్గిపోతుంది.




ఒళ్ళుచల్లబడటం, బాగా చెమట పట్టటం, అస్థిమితం, ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్ళే ప్రమాదం ఉంది.

**రాకుండా ఉండాలంటే**

1. పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు పెరగకుండా చూసుకోవాలి.
2. ముఖ్యంగా పగటిపూట దోమల బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలి.
3. పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. పొడవు చేతుల చొక్కాలు, ప్యాంట్లు వేయటం మంచిది. క్లాసు రూముల్లో, ప్రయాణాల్లో దోమలు కుట్టకుండా చూసుకోవాలి.


## 6. మలేరియా

ఒకప్పుడు మలేరియా అంటే తీవ్రమైన చలితో, ఎక్కువగా సాయంత్రం పూట వచ్చే జ్వరమని భావించేవారు. కానీ క్రమేపి ఈ జ్వరం లక్షణాల్లో తేడాలు వస్తున్నాయి. ఇది ప్లాస్మోడియం జాతి సూక్ష్మక్రిముల మూలంగా వస్తుంది. ఈ సూక్ష్మక్రిమి ఎనాఫిలస్ దోమకాటు ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. ఈ సూక్ష్మక్రిములలో 4 రకాలున్నాయి.


ఇందులో ప్లాస్మోడియం ఫాల్సిఫారమ్ చాలా ప్రమాదకరమైనది

**లక్షణాలు**

1. తొలిదశలో తలనొప్పి, నీరసం, కండరాల నొప్పి, కడుపులో అసౌకర్యం వంటివి కనిపిస్తాయి.
2. రోజు విడిచి రోజు జ్వరం వస్తుంది.
3. చలితో వణకటం, దుప్పట్లు కప్పితే కొంతసేపటికే చెమటలతో తడిసిపోయి ఒళ్ళంతా చల్లబడటం జరుగుతుంది.
4. అనీమియా.
5. కొందరిలో ప్లీహం కాస్త పెద్దగా అవటం ఉంటుంది.
6. సెరెబ్రల్ మలేరియా ప్రాణాంతకమైనది. ఇందులో నాడీ వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతుంది.
7. కొన్నిసార్లు మూత్రపిండాల వైఫల్యం కూడా కనబడుతుంది.







**రాకుండా ఉండాలంటే**

1. చేతులు కాళ్ళు పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి.
2. దోమల బారిన పడకుండా దోమతెరలు, రిపెలెంట్లు, కాయిల్స్, క్రీములు, లోషన్లు వంటి వాటితో దోమకాటు బారిన పడకుండా చూసుకోవాలి.
3. కిటికీలకు తప్పకుండా మెష్‌లు అమర్చుకోవాలి.
4. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తపడాలి.
5. ఖాళీ పాత్రలు, వాడకుండా ఉన్న ఎయిర్‌కూలర్ల వంటి వాటిల్లో నీరు లేకుండా చూసుకోవాలి.
6. ఖాళీ డ్రమ్ముల వంటి వాటిని బోర్లించాలి. టెంకాయ చిప్పలు, పాతటైర్ల వంటి వాటిని దూరంగా పారేయాలి.
7. మలేరియా ప్రబలిన ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తే వైద్యుడిని సంప్రదించి తగిన మందులు వేసుకోవాలి. ఇలాంటి చోట్లకు గర్భిణులు వెళ్ళకపోవటం మంచిది.

పైన చెప్పిన విషయాల మీద ప్రత్యేక శ్రద్ధ వహించి తగు జాగ్రత్తలు తీసుకొని వైద్యున్ని వెంటనే సంప్రదించటం ఎంతైనా అవసరం. ఇలాంటి ఆరోగ్య సమస్యలను ప్రక్కవారితో సంప్రదించి వారికి కూడా అవగాహన కల్పించటంలో మన వంతు కృషి చేయాలి

**డా॥ ఆసం నిర్మలా దేవి**
ఫ్యాకల్టీ, పర్యావరణ, విపత్తు నిర్వహణ విభాగం

# వానా వానా వల్లప్ప

సి.వి.ఎన్.ప్రసాద్

**ఆటో దిగుతోన్న కొడుకునీ, కోడల్నీ, మనవడ్నీ, మనవరాల్నీ చూసి పరమానంద పడిపోయారు రాఘవయ్య.**

**"రండి . . . రండి . . . ప్రయాణం బాగా సాగిందా?" అంటూ గబగబా అరుగు దిగివెళ్ళి వారి బ్యాగులు అందుకున్నారు.**

**వాటిని ఇంట్లో పెడుతూ, "ఎక్కడున్నావే? అబ్బాయీ, కోడలూ వచ్చారు. కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళతే . . . " అంటూ కేకపెట్టారు.**

**"ఇదిగో వచ్చె, వచ్చె. . . " రెండు చెంబుల నీళ్ళతో గబగబా వచ్చింది కామాక్షమ్మ.**

**"ఎలాగున్నావురా నాయనా . . . బాగా చిక్కేవు..." కొడుకు వంక ఆప్యాయంగా చూస్తూ అంది.**

**కొడుకు చిన్నగా నవ్వేడు. కోడలు మూతి ముడిచింది.**

"అలా మొక్కలకాడి కెళ్ళి కాళ్ళు కడుక్కోండ్రా..."

వాళ్ళు కాళ్ళ మీద నీళ్ళు పోసుకున్నారో లేదో మరుక్షణం ఆ నీటిని ఆత్రంగా పీల్చేసింది భూమి. తడి తగిలి మొక్కలు పులకరించాయి.

మనవడ్నీ, మనవరాల్నీ సందిట్లోకి తీసుకుంటూ "ఏం చదువుతున్నార్రా భడవలూ?" అడిగారు రాఘవయ్య.

"నేను ఫిఫ్త్ క్లాస్, చెల్లి థర్డ్ క్లాస్" అన్నాడు మనవడు రఘు గొప్పగా ఫీలవుతూ.

"థర్డ్ పాస్. ఫోర్త్‌లో కెళ్తున్నాను గ్రాండ్ ఫా" అంది మనవరాలు వినూష.

"ఆ ముక్కలేవో తెలుగులో చెబితే నాకర్థమవుతుంది కదుట్రా"

"వాళ్ళది ఇంగ్లీషు మీడియం. వాళ్ళ స్కూల్లో తెలుగు ముక్క మాట్లాడితే ఎండలో నిలబెడతారు?" గొప్పగా చెప్పిందామె.

కోడలి మాటలకు వింతగా చూశారు రాఘవయ్య.

"మన భాషలో మాట్లాడితే తప్పు ఎలా అవ్వుద్దిరా అబ్బాయ్. కాలిలో ముల్లు గుచ్చుకుంటే 'అమ్మా' అంటాం గాని ఇంగ్లీషులో ఏదో అనం కదా!"

"ఈ జనరేషన్ వాళ్ళు మమ్మీ అంటార్లే గాని మీ ఒంట్లో ఎలా వుంటోంది నాన్నా. రోడ్లు మరీ అంత దారుణంగా వున్నాయేంటి. ఆటోలో నాలుగు కిలో మీటర్లు వచ్చేసరికి ఒళ్ళు హూనం అయిపోయింది..."

"మాటలు కోటలు దాటిస్తారు గాని వల్లెటూళ్ళనెవరు పట్టించుకుంటార్రా! స్నానం చేద్దువుగా నుండు . . .ఇదిగో నిన్నేనే. ఆ కావిడిబద్ద అందుకో . . ."

కావిడి బద్ద, రెండు బిందెలూ తెచ్చివ్వగా కావిడిని భుజాన వేసుకున్నారు రాఘవయ్య.

"ఇంట్లో నీళ్ళు లేవా?" నొచ్చుకుంటూ అడిగాడు కొడుకు నాగేశం.

"ఇంకా కాలవలు వదల్లేదురా. గోదావర్లోనూ నీళ్ళు లేవు. మాపెద్ద ఇబ్బందిగా వుందనుకో. చెరువులోని బురద నీరే కాసుకుని తాగుతున్నాం. ఊళ్ళోని ఒకట్రెండు నూతుల్లో నీళ్ళు బాగానే వూరుతున్నాయి. వాటితోనే ఊరు బతుకుతోంది . . . "

మాట్లాడుతూనే మెట్లు దిగి వడివడిగా వెళ్ళారు. మరి పది నిమిషాలకి నీటి బిందెల్తో వచ్చారు రాఘవయ్య.

"గ్రాడ్‌ఫా ! బుల్లి తువ్వాయి బావుందా?" క్రిందటేడాది వచ్చినప్పుడు



పుట్టిన గేదె దూడని గుర్తు చేసుకుంటూ అడిగాడు రఘు.

"చూద్దురుగాని రండి. . . "

తాత వెంట పిల్లలిద్దరూ పశువుల కొట్టంలోకెళ్లారు.

ఎద్దుల జత, రెండు గేదెలు, ఒక దూడ వున్నాయి. అన్నీ బక్కచిక్కి డొక్కలెగరేస్తూ జాలిగా చూస్తున్నాయి.

మోరెత్తి జాలిగా చూస్తోంటే "అలా చూస్తున్నాయేంటి గ్రాండ్‌ఫా" అంది వినూష.

"ఆకలి చూపుల్రా. ఎక్కడా పేరుకి పచ్చగడ్డి లేదనుకో. ఎండుగడ్డి ఎంత తింటే మాత్రం కడుపు నిండుద్దీ" వాటి వీపు నిమురుతూ బాధగా అన్నారు రాఘవయ్య.

**కన్సొలేషన్ బహుమతి పొందిన గ్రామీణ కథ**

"తువ్వాయి బాగా పెద్దదయ్యింది గ్రాండ్‌ఫా" అన్నాడు రఘు.

"దాని వయస్సుకి ఇంకా ఎదగాల్రా. సరైన తిండిలేక . . ."



Sthanka_BW Sept.indd 23 02/09/11 3:19 PM

"మంచి ఫుడ్ పెట్టొచ్చుగా"

"పెట్టడానికి వుంటే కదా. చుట్టుప్రక్కల ఎక్కడైనా పచ్చగడ్డి వుందేమో చూడు. రోళ్ళు పగిలే ఎండలకి మాడిపోయాయి. ఏమైందో ఏవో ఎన్నడూ లేనంతగా ఎండలు కాసేస్తున్నాయి. చెట్లు చూడు ఎలా తలలు వేలాడేశాయో. ఒక పువ్వూ లేదు, ఒక పిందె లేదు..."

"ఇదంతా గ్లోబల్ వార్మింగ్ ఎఫెక్ట్ గ్రాండ్‌ఫా. ఓజోన్ లేయర్ పాడయ్యింది. అందుకే ఈ మార్పులన్నీనంట. మా టీచర్ చెప్పింది".

రఘు మాటలు అర్థం కాకపోయినా తలాడించారు. "వీరబ్రహ్మంగారు ఎప్పుడో చెప్పేర్రా. కాలాలు మారిపోతాయట. వానాకాలంలో ఎండలు, ఎండాకాలంలో వానలు. ఈసారేవయ్యిందో గాని ఎండలే ఎండలు. ఆకాశంలో నల్లమబ్బే కదల్లేదు..."

ఆశగా ఆకాశం వంక చూసి చూసి నిట్టూర్చాడు రాఘవయ్య.

"ట్రీస్ కట్ చెయ్యడం ఎయిర్ పొల్యూషన్ వల్లే రెయిన్ రావట్లేదు గ్రాండ్ ఫా. నా బుక్కులో వుంది".

వినూష మాటలకి "నీకేం తెలీదు వూరుకో. నేను చెప్పిందే కరెక్టు గ్రాండ్ ఫా" అన్నాడు రఘు.

వాళ్ళిద్దరూ గొడవ పడుతోంటే విడిపించి నచ్చజెప్పేరు.

అంతా కలిసి భోంచేస్తొంటే, "అయితే నీటికి కరువొచ్చిందన్నమాట" అన్నాడు నాగేశం.

"అసలిక్కడేమున్నాయనీ మట్టీమశానం తప్ప!" మొఖం చిట్లిస్తూ పెడసరిగా అందతడి భార్య.

"అలా మాట్లాడతావేంటి గంగా. లోకానికి అన్నం పెడుతున్నవి పల్లెటూళ్ళే కదా. కాలం ఎప్పుడూ ఒక్క తీరుగా వుండదు. నవ్విన నాపచేనే పండుద్ది. రేపటికేమవ్వుద్దో ఎవరికి తెలుసు. అవునూ - గోదావరి నీళ్ళు కూడా హైదరాబాదు తీసుకెళ్ళిపోతారంటగా?!"

అత్తగారి మాటల్లో 'మా నోటి కాడి అన్నం లాగేసుకుంటారా' అన్న భావం కన్పించి "నాకు తెలీదు" అందామె మొఖం ఎర్రగా చేసుకుని.

"ఊరు ఎవరో శపించినట్టు అయిపోయిందిరా అబ్బాయ్. వానల్లేపోయేసరికి తాగునీటికి, సాగునీటికి అన్నిటికీ కటకటగానే వుందనుకో. పక్షులూ, పశువులూ మాడిపోతున్నాయ్. ఆకుమడి ఎండిపోతోంది..."

రాఘవయ్య స్వరం గాద్గదికమయ్యింది.

"కాలం కాని కాలం అయిపోయింది. ఏ చెట్టుకీ చిగురూ లేదు, పూతా లేదు...!" కళ్ళొత్తుకుంది తల్లి.

"నీళ్ళు లేకపోతే అబ్బో చాలా కష్టం" రెండ్రోజులు కుళాయి రాకపోతే తాము పడ్డ అవస్థలు గుర్తు చేసుకుంటూ అన్నాడు నాగేశం.

"పంచభూతాలు చల్లగా చూస్తేనే జీవులన్నీ సుఖంగా వుంటాయిరా. ఏది కన్నెర్ర జేసినా ప్రళయమే!"

రాఘవయ్య మాటలకి, "భూతాలంటే దెయ్యాలా డాడీ" అడిగాడు రఘు.

"ఛా ఛా కాదురా. భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం. ఈ అయిదింటినీ పంచభూతాలంటారు. ప్రకృతి వీటి మీదే ఆధారపడి వుంది. వీటిలో ఏది ఎక్కువైనా ముప్పే. ఏది తక్కువైనా ముప్పే".

"అందుకే సేవ్ ట్రీ, సేవ్ వరల్డ్ అన్నారు కదా డాడీ" అంది వినూష.

"ఏవంటోందిరా"

"వృక్షో రక్షతి రక్షితః అంటోంది ..."

రాఘవయ్య ముఖం వికసించింది. "మా తల్లే" అంటూ మనవరాలి తల నిమిరారు.

రఘుకి ఉక్రోషం వచ్చేసింది. "వినూ అలా చెప్పలేదు గ్రాండ్ ఫా. డాడీయే కల్పించి చెప్పేరు" అన్నాడు.

"పోనీ నువ్వు నాకు అర్థమయ్యేలా చెబుదువు గాన్లే. ముందు అన్నం తిను"

భోజనాలయ్యాక పెరట్లో అరు బయట నులక మంచాలేసుకుని కూర్చున్నారు.

తాత ఒళ్ళో తలపెట్టుకొని చెరో ప్రక్కనా పడుకున్నారు రఘు, వినూష.

"చుక్కలు లెక్కపెడితే నిజంగా సురుడు కాయలొస్తాయా?" వినూష అడిగింది.

"ఛా. ఏం రావు. మా మిస్ చెప్పింది. మూన్లో ముసలమ్మ రాట్నం వడుకుతుందని చెప్పేవుగా గ్రాండ్ ఫా. అదంతా ఫాల్స్ అంట . . ."

"నాకు తెల్సింది చెప్పేను. మీరు చదివిన పాఠాలేంటో నాకు చెప్పండి తెలుసుకుంటాను..."

"మూన్లో పెద్ద పెద్ద లోయలున్నాయిట..."

"అక్కడ నీళ్ళున్నాయా?"

"నీళ్ళా? మరేమో . . . ఏమో మరి..."

"అక్కడ చెట్టూ చేమా వున్నాయా?"

"వూహూ లేవు"

"అయితే నీళ్ళుండవురా. నీళ్ళుంటే ప్రాణం వుంటుంది. ప్రాణం వుంటే చెట్టు వుంటుంది. చెట్టు వుంటే పశువు వుంటుంది. దానితో బాటు మనిషీ వుంటాడు..."

తాత వంక అబ్బురంగా చూశారు పిల్లలు. రాకుమారుల కథలు చెప్పించుకుని వింటూ నిద్రపోయారు.

* * * * *

"గుళ్ళో వరుణయాగం చేస్తున్నార్రా. రారాదూ?" మర్నాడు కొడుకుని అడిగారు రాఘవయ్య.

"నేను రాలేను గాని పిల్లల్ని తీసుకెళ్ళు నాన్నా. చూస్తారు..."

రాఘవయ్య వెంట ఉత్సాహంగా కబుర్లు చెబుతూ వెళ్ళారు రఘు, వినూషా.

గుడి ప్రాంగణంలో హోమగుండం ఏర్పాటు చేసి, వేద పండితులు మంత్రాలు చదువుతూ యాగం చేస్తున్నారు. ఊరంతా తరలి వచ్చింది. భక్తిశ్రద్ధలతో చూస్తూ కూర్చున్నారు రైతులూ, కూలీలూ, చేతిపని వారూ. వర్షం కురిస్తేనే వారికి భుక్తి లభించేది.

హోమగుండంలోంచి పొగలు పైపైకి ప్రాకుతోంటే ఆశావహంగా చూస్తున్నారు రాఘవయ్య.

"ఇలా చేస్తే రెయిన్ వస్తుందా గ్రాండ్ ఫా"

అవునంటూ తలాడించారాయన. "ఆ పొగలు పైపైకి వెళ్ళి మేఘాలని కదిలిస్తాయి. చల్లబరుస్తాయి. వర్షం కురుస్తుంది..."

"నేన్నమ్మను"

"ఎయిర్ పొల్యూషన్‌కి మనకి దగ్గులూ తుమ్ములూ వస్తాయిగా. అలాగే ఇదన్నమాట. కదా గ్రాండ్ ఫా?" ఆరిందాలా అంది వినూష.

"నీకేం తెలీదు ఫో..."



Sthanka_BW Sept.indd 24 02/09/11 3:19 PM

మనవరాలు బుంగమూతి పెట్టింది. ముచ్చటగా అన్పించి బుగ్గ గిల్లుతూ, "నువ్వు గడుగ్గాయివేనే" అన్నారాయన.

"నాది క్లాస్ ఫస్ట్ ర్యాంక్. చెల్లికి థర్డో, ఫోర్తో వస్తుంది" తనే తెలివైన వాడ్నని చెబుతూ అన్నాడు రఘు.

అలాగా, బాగా చదువుకోండి. మీరెన్నో ఎన్నో కొత్తవి కనుక్కోవాలి. మీ వల్లనే ఊళ్ళు మళ్ళీ పచ్చదనంతో కళకళలాడాలి. నీరు గాలి పంటా పుష్కలంగా దొరకాలి. కూడుకీ, గుడ్డకీ లోటులేని కాలం రావాలి . . ." గొణుక్కున్నట్టుగా అన్నారు.

* * * * *

**ఆ** మరుసటి రోజున నీటి బిందెల్లో కప్పల్ని వేసి ఊరంతా డప్పుల్తో ఊరేగించారు.

"షెట్. మరీ ఇంత మూర్ఖత్వమా. కప్పల్ని ఊరేగిస్తే వర్షాలొస్తాయా?" అన్నాడది చూస్తూ నాగేశం.

"అందుకే పల్లెటూరి వాళ్ళని గేలిచేస్తూంటారంతా" హేళనగా నవ్వింది గంగ.

"కప్ప బెకబెకలు వాన రాకడకి సూచనరా. ఆశ పీక మహా లావు కదా. ఏదో రకంగా చుక్క రాలితే చాలని మా తాపత్రయం. గొంతెండిపోయిన వాడి పరిస్థితి ఇలాగే వుంటాదిరా అబ్బాయ్..."

"పట్నపోళ్ళు మీకేం తెలుస్తాయి మా కష్టాలు. నీళ్ళూ, పాలూ అన్నీ మీ ఇళ్ళకే నడిచొస్తాయాయె!" స్వగతంలా అంది కామాక్షమ్మ చిన్నగా నిట్టూరుస్తూ.

"అలా కళ్ళల్లో నిప్పులు పోసుకోకపోతే మీరూ పట్నం రావచ్చుగా! అనబోయి, నిజంగా వచ్చేస్తారేమోనని భయపడి మ్రింగేసింది గంగ.

చిత్రంగా ఆ సాయంత్రానికి వాతావరణంలో మార్పు వచ్చింది.

ఆకాశంలో నల్లని మేఘాలు పరుగులు తీయసాగాయి.

''ఒరే రఘూ, వినూషా రండ్రా... ఆకాశం కరుణిస్తోంది చూడండి...'' వీధిలోకెళ్ళి చిన్నపిల్లాడిలా అరిచారు రాఘవయ్య.

పిల్లలంతా పరుగున వెళ్ళారు. కామాక్షమ్మ గబగబా పెరట్లోకెళ్ళి ఆకాశం వంక చూస్తూ దణ్ణాలు పెట్టసాగింది.

అరుగుమీంచి తొంగిచూసి ''గాలి చల్లగా వుంది. వర్షం రావచ్చు'' అన్నాడు నాగేశం.

"రావచ్చు కాదురా వస్తుంది . . . అదిగో ఉదయిస్తోన్న చంద్రుడి చుట్టూ గుడి కట్టింది చూడు . . . ఇవిగో ఈ దిక్కున మెరుపులు మెరుస్తున్నాయి . . ." ఆనందోద్వేగాలతో వూగిపోతున్నారు రాఘవయ్య.

చిటపటమంటూ చినుకులు మొదలయ్యాయి.

ఊళ్ళోని అందరు ఇళ్ళ నుంచీ జనం వీధుల్లోకొచ్చి ఉత్సాహంగా చిందులెయ్యసాగారు.

పిల్లల సంబరం సరే సరి. ఒకటే గంతులు!

"రెయిన్ రెయిన్ గో ఎవే రెయిన్ రెయిన్ గో ఎవే . . " చిందులేస్తూ గొంతెత్తిపాడారు రఘూ, వినూషా.

రాఘవయ్యకేదో అనుమానమొచ్చి ''వీళ్ళు ఇంగ్లీషులో ఏమంటున్నార్రా" అని కొడుకుని అడిగారు.

అతడు ఎంబ్రాస్సింగా ఫీలవుతూ ''వాళ్ళకి స్కూల్లో నేర్పే రైము ... వానా వానా వెళ్ళిపో అని . . ." అన్నాడు.

అతడి మాటలు పూర్తి కాకుండానే విసవిసా వెళ్ళి పిల్లల చెంపలు చెళ్ళుమన్పించారు. వారి రెక్కలు పట్టుకుని ఇంట్లోకి తీసుకొచ్చి "ఇంకెప్పుడూ ఆ పాట పాడొద్దు. పాడితే ఏం చేస్తానో నాకే తెలీదు" అంటూ తీవ్రస్వరంతో హెచ్చరించారు.

తాత ఉగ్ర రూపానికి బెదరి పరుగున వెళ్ళి తల్లిని చుట్టేశారు పిల్లలు.

"అయ్యో అయ్యో - పసిపిల్లలని చూడకుండా వాళ్ళ చెంపలు వాయగొడతారా. . . మీకు చేతులెలా వచ్చాయి?" కయ్‌మంది గంగ.

"నేను కొట్టింది వాళ్ళని కాదు. అవి నేర్పిన వాళ్ళని. అవి పాడుతున్నా తప్పని చెప్పని మిమ్మల్ని. వానని వరుణ దేవుడంటూ పూజించే సంస్కృతి మనది. గుర్తుంచుకోండి . .."

"పిల్లలేదో పాడితే అది నిజమై పోతుందన్నట్టు కోప్పడతావేంటి నాన్నా . . ." మొఖం వికారంగా పెట్టుకుని వాళ్ళని సముదాయిస్తూ అన్నాడు నాగేశం.

"బాలవాక్కు బ్రహ్మ వాక్కు అన్నార్రా. వాళ్ళలా అనకూడదు. అననివ్వకూడదు" అంటూ వర్షంలోకెళ్ళి ప్రాణధారలో నిలువునా తడిసి ముద్దవుతూ పొంగిపోసాగారు రాఘవయ్య. భగవత్ సాక్షాత్కారమైనట్టుగా వుందాయనకి.

"విన్నారా మీ పల్లెటూరి బగ్గిరాయి మాటలు? మా ఊరు మా వాళ్ళు అనింకోసారి అనండి చెబుతా . . . " భర్త వంక తీవ్రంగా చూస్తూ చెప్పి పిల్లల్ని తీసుకుని విసురుగా గదిలోకెళ్ళిపోయింది గంగ.

చేష్టలు దక్కి చూస్తుండిపోయింది కామాక్షమ్మ.

బయట వర్షం పెద్దదైంది. రోడ్డు మీద నీళ్ళు కాల్వలు కట్టసాగాయి.

మరుసటి రోజు ఉదయమే అటక మీంచి నాగలి బయటికి తీసి కర్రూ అదీ సరి చూసుకోసాగారు రాఘవయ్య.

రాత్రి మూడు దిక్కుల వర్షం కురిసింది. పొలాల్లో నీళ్ళు నిలిచాయి. రైతులకి పండగొచ్చినట్టుగా వుంది. ప్రకృతిలో చైతన్యం పొంగి పొర్లుతోంది.

* * * * *

**బ్యా**గులు సర్దుకువొచ్చారు నాగేశం, గంగా.

"మేం వెళ్తున్నాం నాన్నా . . . " మెల్లగా అన్నాడు.

''నాల్రోజులుంటావన్నావుగా'' తన పనిలోంచి చూపులు మళ్ళించకుండా అన్నారు.

"ఆఫీసులో అర్జంటు పనుందని ఫోన్ వచ్చింది. మీరైనా ఇక్కడ ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ ఇబ్బంది పడటం ఎందుకు నాన్నా. మాతో వుందురుగాని సిటీకొచ్చేయండి . . . "

"ఈ ఇంటినీ ఈ ఊర్నీ వదిలి రాలేంరా. మా కట్టెలు ఈ మట్టిలో కలవాల్సిందే"

"వాళ్ళ చాదస్తం వాళ్లది. అలాగే వుండనీండి. వాళ్ళకి ఈ ఇల్లే వైకుంఠం. ఈ ఊరే కైలాసం!" గంగ అంది పెడరసంగా.

"బాగా చెప్పేవు తల్లీ. మాకిదే కాశీ. ఇదే మక్కా. ఇదే జెరూసలేం. ఎందుకో తెలుసా తల్లీ? ఈ నేలలో ప్రాణశక్తి వుంది. ఈ నీటిలో చైతన్యం వుంది. ఈ గాలిలో ఊపిరుంది. ఈ చెట్టూచేమల్లో జీవం వుంది. ఈ పల్లెల్లో మానవ మనుగడకి అవసరమైన విత్తు వుంది . . ."

రఘు, వినూషలకి కొంతే అర్థమైంది. అయినా ఎంతో అర్థమైనట్లు తప్పట్లు కొట్టారు.

రాఘవయ్య కళ్లల్లో ఆశాలతలు గబగబా పాకి పుష్పించాయ్. ◆



Sthanka_BW Sept.indd 25 02/09/11 3:19 PM

# గిరిజన ప్రాంత అభివృద్ధిలో గ్రామసభ నిర్ణయాలే కీలకం

## ఆంధ్రప్రదేశ్ పీసా నియమావళి

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల 'షెడ్యూల్డు ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్ పంచాయితీల విస్తరణ (పీసా) నియమావళి' జారీ చేయడంతో పీసా చట్టం అమలుకు రాష్ట్రంలో మార్గం సుగమమైంది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ద్వారా స్థానిక సంస్థలకు అధికారాలు కట్టబెట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం వేసిన మరో ముందడుగుగా ఈ చర్యను అభివర్ణించవచ్చు.**

ఈ చర్య ద్వారా దేశంలో పీసా చట్టాన్ని అమలు చేస్తూ నియమాలు విడుదల చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి దక్కించుకుంది. తద్వారా షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన ప్రజలకు గ్రామసభ, ఇతర పంచాయితీరాజ్ సంస్థల ద్వారా అత్యంత కీలకమైన అధికారాలు లభించాయి.

ఇక వీటిని అవగాహన చేసుకొని చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలకు మేలుకలిగే రీతిలో సమర్థవంతంగా వినియోగించుకోవల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై, స్వచ్ఛంద సంస్థలపై ఎంతైనా వుంది. అధికార యంత్రాంగం కూడా తదనుగుణంగా సహకరించాల్సిన అవసరం వుంది.

### నేపథ్యం


భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చిన '40 వ అధికరణ' ద్వారా స్థానిక సంస్థల్ని ఏర్పరచి, వాటిని స్వయం పరిపాలనా సంస్థలుగా మనుగడ సాగించడానికి అవసరమైన అధికారాలు కట్టబెట్టాలని సూచించారు. 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీరాజ్ సంస్థలకు ఇలాంటి అధికారాలు సంక్రమించాయి.

కానీ తదనుగుణంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994 గిరిజన ప్రాంతాలకు వర్తించదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. పర్యవసానంగా ప్రత్యేక చట్టం ఏర్పాటుకై శ్రీ బి.యస్. భూరియా అధ్యక్షతన కమిటీ నియమించబడింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీ రాజ్ సంస్థలకు సంక్రమించి అధికారాలను షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింపచేస్తూ 'పీసా చటం 1996' అమలులోకి వచ్చింది.

ఈ చట్టాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టాన్ని సవరిస్తూ 'ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్' (సవరణ) చట్టానికి వీలుగా షెడ్యూల్డు ప్రాంతాలకు ఆధ్రప్రదేశ్ పంచాయితీల విస్తరీకరణ (పీసా) నిబంధనావళి, 2011 (ఏ.పి.పి.ఇ.యస్.ఏ రూల్స్ - 2011)ను జి.వో.నెం. 66 ద్వారా 24-03-2011 న ప్రభుత్వం జారీ చేసింది..

### పీసా చట్టం ఆవశ్యకత

భారతదేశంలో గిరిజనులు (ఆదివాసీలు) అనాదిగా కాలం నుంచి జీవిస్తున్నారు. వీరు ప్రధాన జనజీవన స్రవంతికి దూరంగా, ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తుంటారు. గిరిజనుల అచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు, కట్టుబాట్లు ప్రత్యేకంగా వుంటాయి. అటవీ ప్రాంతంలో జీవించే గిరిజనులకు అడవులతో అవినాభావ సంబంధం వుంది. వారి జీవనోపాధికై ప్రధానంగా అడవిపైనే ఆధారపడతారు. చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, చిన్నతరహా ఖనిజాలు, చిన్న నీట వనరులు గిరిజనుల జీవితంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నాయి.




గిరిజనులు తమ అమాయకత్వం వలన అనాదికాలంగా దోపిడీకి గురవుతునే ఉన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు గిరిజనులకు అధిక వడ్డీకి రుణాలిచ్చి వారి నిస్సహాయతను ఆధారం చేసుకొని చట్టవిరుద్ధంగా వారి భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అభివృద్ధి ప్రాజెక్టులు నెలకొల్పినపుడు భూసేకరణ సమయంలోనూ, నిర్వాసితులకు పునరావాసం కల్పించే సమయంలోనూ తమ అభిప్రాయలను తెలపడానికి సరైన వేదిక లేకపోవడం వలన గిరిజనులు విపరీతంగా నష్టపోతున్నారు. అడవిపైనే ఆధారపడే గిరిజనులు చిన్నతరహా అటవీ ఉత్పత్తుల సేకరణ, అమ్మకం విషయంలోనూ, తమకు యాజమాన్య హక్కులు లేకపోవడం వలనా ఆర్థికంగా నష్టపోతున్నారు.



Sthanka_BW Sept.indd 29 02/09/11 3:19 PM

అటవీ ప్రాంతంలో లభించే చిన్న తరహా ఖనిజ వనరుల పైన గిరిజన సమాజానికి ప్రత్యేక హక్కులున్నాయి. అటవీప్రాంతంలోని చిన్న తరహా నీటి వనరులను కూడా గిరిజన సమాజాల సామూహికంగా వారి అవసరాలకు వినియోగించుకోవడం జరుగుతుంది. ఈ విషయాల న్నింటిని దృష్టిలో ఉంచుకొని పీసా చట్టంలో గ్రామసభకు విస్తృతమైన అధికారాలు ఇవ్వడం జరిగింది.




### పీసాచట్టం ప్రాధాన్యత

'పీసా చట్టం 1996' మొత్తం 'గ్రామసభ' నిర్వచనం, గ్రామసభకు కట్టబెట్టిన అధికారాలపై ఆధారపడి వుంది. సాధారణంగా 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పడిన పంచాయితీ రాజ్ చట్టాల్లో గ్రామసభ అంటే మొత్తం గ్రామపంచాయితీకి సంబంధించిన ఓటర్లతో కూడిన సభగా వుంటుంది. ఒక్కో గ్రామపంచాయితీలో సాధారణంగా ఒకటికి మించి రెవెన్యూ గ్రామాలు, శివారు గ్రామాలు, ఆవాస ప్రాంతాలు వీటన్నిటికి సంబంధించి ఒకే గ్రామసభ గ్రామపంచాయితీ కేంద్రంలో జరుగుతుంది.

పీసా చట్టం మాత్రం షెడ్యూల్డ్ ప్రాంతాల భౌగోళిక నేపథ్యాన్ని, గిరిజనుల ప్రత్యేక జీవన విధానాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ సభకు ప్రత్యేక నిర్వచనం ఇచ్చింది.

### గ్రామం-నిర్వచనం

పీసాచట్టం ప్రకారం గ్రామం అంటే షెడ్యూల్డు ప్రాంతాల్లోని ఆచార, సాంప్రదాయాలను పాటిస్తున్న సమాజం నివసించే ఆవాస ప్రాంతం (హ్యాబిటేషన్) లేదా ఆవాస ప్రాంతాల సముదాయం లేదా శివారు ప్రాంతం (హామ్లెట్) లను గ్రామం అనవచ్చు. ఈ విధంగా గుర్తింపబడిన ప్రతి గ్రామానికీ ఒక గ్రామసభ జరుపుకునే చట్టబద్ధత వుంది.

### గ్రామసభ అధికారాలు

★ గ్రామసభ అంటే గ్రామంలోని ప్రజల ఆచార, సాంప్రదాయాలను, వారి సాంస్కృతిక విలక్షణతను, సామాజిక వనరులను కాపాడటానికి, సంరక్షించటానికి వారి ఆచారాలను అనుసరించి వివాదాలను పరిష్కరించటానికి సమర్థత కలిగి వుంటుంది.

★ *ప్రణాళికలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల ఆమోదం :* సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రణాళికలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులు అన్నీ కూడా అమలు చేయడానికి ముందస్తుగా గ్రామసభ అనుమతి పొందాల్సి వుంటుంది.

★ *లబ్ధిదారుల ఎంపిక :* పేదరిక నిర్మూలన, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో లబ్ధిదారుల గుర్తింపు ఎంపికకు గ్రామసభ బాధ్యత వహించాల్సి వుంటుంది.

★ నిధుల వినియోగ ధృవీకరణ పత్రం (యు.సి)

పైన వివరించిన విధంగా అమలవుతున్న ప్రణాళికలు కార్యక్రమాలు, ప్రాజెక్టుల పరిమాణాలు గ్రామస్థాయిలో ఖర్చు చేసిన నిధులకు వినియోగ ధృవీకరణ పత్రాలు గ్రామ సభ ద్వారా పొందాల్సి వుంటుంది.

★ *స్వయం పరిపాలన సంస్థగా గ్రామ సభకు అధికారాలు :* షెడ్యూల్డు ప్రాంత పంచాయితీలకు స్వయంపరిపాలన సంస్థలుగా వ్యవహరించడానికి కావల్సిన అధికారాలు కట్టబెట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రింద సూచించిన అధికారాలను సరైన స్థాయిలో వున్న పంచాయితీ, గ్రామసభకు కట్టబెట్టాలి.

★ మత్తు పదార్థాల వినియోగంపై నిషేధం లేదా మత్తుపదార్థాల అమ్మకం, వినియోగంపై నియంత్రణ లేదా క్రమబద్ధీకరణ చేయటానికి అధికారం.

★ చిన్నతరహా అటవీ ఉత్పత్తులపై యాజమాన్య హక్కులు

★ షెడ్యూల్డు ప్రాంతాల్లో భూమి అన్యాక్రాంతం కాకుండా చూపే అధికారం, చట్టవిరుద్ధంగా అన్యాక్రాంతం అయిన భూములను తిరిగి స్వాధీన పర్చడానికి అధికారం.

★ గ్రామీణ మార్కెట్లు (సంత)ల నిర్వహణకు అధికారం.

★ గిరిజన ప్రజలకు రుణం ఇస్తున్న సంస్థలు, వ్యక్తులపై నియంత్రణ అధికారం.

★ స్థానిక ప్రణాళికలు, వాటికి కావల్సిన వనరులపై నియంత్రణ అధికారం.

పైన సూచించిన అధికారాలు కాకుండా ఇంకా ఈ క్రింద సూచించిన అధికారాలను గ్రామసభకు లేదా సరైన స్థాయిలో ఉన్న పంచాయితీకి (జిల్లా, మండల లేదా గ్రామస్థాయి పంచాయితీ) కట్టబెట్టాలి.

*గ్రామసభకు లేదా సరిపోయిన స్థాయిలో వున్న పంచాయితీకి కట్టబెట్టాల్సిన అధికారాలు :*

★ **అభివృద్ధి ప్రాజెక్టుల అమలు-భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం :** షెడ్యూల్డు ప్రాంతాల్లో ఏదేని అభివృద్ధి ప్రాజెక్టు అమలు చేయుడానికి భూమిని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చిన లేదా అట్టి ప్రాజెక్టు వలన నిర్వాసితులైన వారికి పునరావాసం కల్పించాల్సి వచ్చినా ముందుగా గ్రామసభ లేదా సరైన స్థాయిలోని పంచాయితీని తప్పనిసరిగా సంప్రదించాలి.



Sthanka_BW Sept.indd 30 02/09/11 3:19 PM

★ **చిన్న తరహా నీటి వనరుల నిర్వహణ, ప్రణాళికలు :** షెడ్యూల్డు ప్రాంతంలోని చిన్న తరహా నీటి వనరులు నిర్వహణ, ప్రణాళికలకు సంబంధించిన బాధ్యత సరైన స్థాయిలోని పంచాయితీకి కట్టబెట్టాలి.

★ **చిన్న తరహా ఖనిజాల త్రవ్వకానికి గనుల లీజు :** షెడ్యూల్డు ప్రాంతాల్లో చిన్నతరహా ఖనిజాల తవ్వకానికై గనులకు లైసెన్సులు లేదా లీజు ఇవ్వడానికి, గ్రామసభ లేదా సరైన స్థాయిలోని పంచాయితీ సిఫార్సులు తప్పని సరిగా తీసుకోవాలి.

★ **తక్కువ ధరకు చిన్నతరహా ఖనిజాల వినియోగానికి వేలం పాట :** తక్కువధరకు చిన్నతరహా ఖనిజాల వినియోగానికి వేలంపాట నిర్వహించే ముందు గ్రామ సభ లేదా సరైన స్థాయిలోని పంచాయితీ సిఫారసు తప్పనిసరిగా తీసుకోవాలి.

## షెడ్యూల్డ్ ప్రాంతాలలో గ్రామాలను ప్రకటించడం

పీసా చట్టం ప్రకారం గ్రామసభ జరుపుకోవడానికి అనువుగా పీసా చట్టం నిర్వచించిన విధంగా గ్రామాలను గుర్తించి ప్రకటించాల్సిన అవసరం వుంది. ఆంధ్రప్రదేశ్ పీసా నియమాల ప్రకారం ఈ ప్రక్రియ క్రింద సూచించిన ప్రకారం జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డు ప్రాంతాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఖమ్మం, వరంగల్ ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలలో విస్తరించి ఉన్నాయి.

ఈ జిల్లాల్లోని షెడ్యూల్డ్ ప్రాంతాలలో పీసా చట్టంలో నిర్వచించిన విధంగా గ్రామాల జాబితాను రూపొందించవలసినదిగా సంబంధిత జిల్లా కలెక్టర్లను గిరిజన సంక్షేమ శాఖ కమీషనరు కోరుతారు.

అట్టి అభ్యర్థన అందిన తదుపరి జిల్లా కలెక్టరు పి.ఓ, ఐ.టి.డి.ఏ తో సంప్రదించి జనావాసం / శివారు గ్రామం లేదా వాటి గ్రూపులతో ఉన్న గ్రామాలు కలిగిన ఒక ప్రతిపాదనను రూపొందిస్తారు.

ఈ విధంగా రూపొందించిన ప్రతిపాదనలను గిరిజన సంక్షేమ శాఖ కమీషనరుకు సమర్పించాలి. కమీషనరు ఈ ప్రతిపాదనలను సమీక్షించిన మీదట షెడ్యూల్డు ప్రాంతాలలోని గ్రామాలను ప్రకటిస్తారు.




## గ్రామసభ విధి విధానాలు

పై విధంగా ప్రకటించిన ప్రతి గ్రామానికి గ్రామస్థాయిలోని ఓటర్ల జాబితాలో పేర్లు నమోదయిన వారిలో కూడిన గ్రామసభ ఉండాలి.

గ్రామ పంచాయితీకి సర్పంచ్ అధ్యక్షుడుగా ఉంటాడు. ప్రతి గ్రామసభకు ఒక ఉపాధ్యక్షుడిని, కార్యదర్శిని ఎన్నుకోవాలి. ఇందు నిమిత్తం ఐ.టి.డి.ఏ.పి.ఓ, ఈ నియమావళి ప్రకారం మొట్టమొదటి గ్రామసభ నిర్వహించడానికి డిప్యూటీ తాహసీల్దరు హోదాకు తక్కువ కాని ఒక అధికారిని డిప్యూట్ చేయాల్సి ఉంటుంది.

ఈ విధంగా నిర్వహించే సమావేశానికి సంబంధిత పంచాయితీ సర్పంచ్ అధ్యక్షత వహించాలి.

గ్రామసభ సమావేశానికి కోరం గ్రామసభ సభ్యులలో కనీసం 50 శాతం, ఎస్.టి సభ్యులలో 1/3 వ వంతుకంటే తక్కువగా ఉండరాదు.

గ్రామసభ ఉపాధ్యక్షుడిని కార్యదర్శిని గ్రామసభ్యులలో నుండి ఎన్నుకోవాలి. ఉపాధ్యక్షులు, కార్యదర్శి షెడ్యూల్డు తెగకు చెందిన వారై ఉండాలి. పదవీకాలం 5 సంవత్సరాలు. ఉపాధ్యక్షులు, కార్యదర్శి ఎంపిక విధానం చేతులు ఎత్తడం ద్వారా ఉంటుంది.

గ్రామసభ శాసనవరమైన సమావేశాలను ఏడాదిలో కనీసం రెండుసార్లు నిర్వహించాలి.

గ్రామసభ సమావేశాలలో ఆమోదించిన తీర్మానాలను ఒక రిజిస్టరులో నమోదు చేసుకోవాలి. గ్రామసభ కార్యదర్శి / ఉపాధ్యక్షుడు సందర్భాన్ని బట్టి సభ్యుల సంతకం / వేలి ముద్రలను తీసుకోవాలి.

ఈ తీర్మానాలను నాలుగు వారాల లోపు గ్రామసభ కార్యదర్శి ప్రభుత్వ ఏజెన్సీ / సంస్థలకు సంబంధిత శాఖలకు పంపాలి.

పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగబద్ధత వచ్చిన తరువాత, తమ ప్రాంతాలలో స్వీయ పరిపాలన కోసం గత 17 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న గిరిజనుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించబడిన ఆంధ్రప్రదేశ్ పీసా నియమావళి ప్రస్తుతం అమలులోకి రావటంతో గిరిజనులలో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది.

అయితే ఈ నిబంధనలు జారీ కావటం ఒక ఎత్తైతే, ఈ నిబంధనలు అమలు జరిగేలా చూడటం మరొక ఎత్తు. ఇందుకుగాను గిరిజన ప్రాంతంలోని పంచాయితీరాజ్ ప్రజాప్రతినిధులు, ఈ సంస్థలలో పనిచేస్తున్న అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పౌర సమాజం ఈ నిబంధనలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకొని, గిరిజన ప్రాంతాలలోని గ్రామ సభ పటిష్టతకు కృషి చేయాలి.

గ్రామ సభ పటిష్టంగా పనిచేసి, ప్రభుత్వ కార్యక్రమాల రూపకల్పన, అమలులో భాగస్వామ్యం అయిన నాడు గిరిజన గ్రామాలు కూడా ప్రధాన స్రవంతిలోకి వచ్చి అభివృద్ధి వెల్లివిరుస్తుందనటంలో ఏ మాత్రం సందేహం లేదు.

***- ఆర్. స్టీవెన్ నీల్, ఫ్యాకల్టీ, సి.డి.పి.ఎ., అపార్డ్***




Sthanka_BW Sept.indd 31 02/09/11 3:19 PM

# ఫ్లారెన్స్ నైటింగేల్

**నర్సింగ్ వృత్తికే మకుటాయమానమైన ఫ్లారెన్స్ నైటింగేల్ గురించి చెప్పుకోవాల్సి ఎంతో ఉంది. ఆమె దేశవిదేశాలలో పనిచేసే నర్సులందరికీ నిలువెత్తు ఆదర్శమూర్తిగా నిలిచిన వనిత అంటే ఆశ్చర్యం కలుగక మానదు.**

ఫ్లారెన్స్ నైటింగేల్ 1820వ సంవత్సరం మే నెల 12న ఫ్లారెన్స్ పట్టణంలో జన్మించింది. ఆమె ఆ పట్టణంలో పుట్టినందున ఆమె పేరు నైటింగేల్‌కి ముందు 'ఫ్లారెన్స్ నైటింగేల్'గా ప్రసిద్ధి వచ్చింది.

17 సంవత్సరాల వయసులోనే ఆమె తాను సేవారంగానికి అంకితమై పనిచేయాలనే నిర్ణయానికి వచ్చింది. ఆ కారణంగా, తన తల్లిదండ్రులు ఎంత ధనవంతులైనా, ఉన్నత కుటుంబానికి చెందినవారైనా అవన్నీ లెక్కచెయ్యకుండా 'సమాజసేవ' చేయాలన్న ఏకైక లక్ష్యంతో నైటింగేల్ నర్సింగ్ వృత్తిపట్ల ఆసక్తి చూపింది. ముఖ్యంగా మానవసేవ చెయ్యడంలో ఎటువంటి సహాయానికీ నోచుకోని దీనులు, హీనులు, రుజాగ్రస్తులకి (జబ్బు పడ్డవారు) సేవ చేయడం మరింత వాంఛనీయమన్న నిజాన్ని ఆమె చిన్ననాటనే గ్రహించింది.

నైటింగేల్ తల్లి కూతురి దృష్టిని మరల్చడానికి చిన్నతనం నుంచీ ఆమెను పెద్దవాళ్ల పార్టీలకు, ఫంక్షన్లకూ తీసికెళ్తుండేది. డబ్బున్న కుటుంబాల నుంచి ఎన్ని పెండ్లి సంబంధాలు తెచ్చినా నైటింగేల్ వద్దని తెగేసి మరీ చెప్పేది. పైగా తన తండ్రి తాలూకు ఎస్టేట్‌లో పనిచేసే పనివాళ్లకు అనారోగ్యం వస్తే వారికి నైటింగేల్ సేవ చేస్తుండేది.

తన దృఢమైన సంకల్పంతో ఫ్లారెన్స్ నైటింగేల్ ధైర్యంగా జర్మనీలో నర్సింగ్ ట్రైనింగులో చేరింది. అనంతరం పారిస్‌లో విద్యాభ్యాసం గావించింది. 33 సంవత్సరాలు వచ్చేటప్పటికి లండన్‌లో గల ఒక స్త్రీల ఆసుపత్రికి నైటింగేల్ సూపరిటెండెంట్ కాగలిగింది. అతిచిన్న వయసులో అనారోగ్యంతో బాధపడే, జబ్బులతో కలత చెందే, అంగవైకల్యం తాలూకు సమస్యలతో ఛీతిల్లే ఎందరో రోగులకు సహాయపడుతూ తోడూనీడగా ఆమె నిలిచింది.

నైటింగేల్ తన జీవితంలో ఎక్కువ కాలాన్ని మిలిటరీ ఆసుపత్రులలో గల రోగుల సేవ చేసేటందుకే వెచ్చించిన మహోన్నత మహిళ.

రష్యా దేశం మీద 1854లో గ్రేట్ బిటన్, ఫ్రాన్స్ దేశాలు యుద్ధానికి దండెత్తి వెళ్లాయి. ఆ సంకుల సమరంలో ఎందరో వీరజవాన్లు మరణించారు. ఆనాటి బ్రిటిష్ ప్రజలు కూడా సరైన సదుపాయాలు, సరుకులు సైనికులకు ప్రభుత్వం సమకూర్చనందుకు సహించలేని పరిస్థితి ఏర్పడింది. తమ వల్ల ఏ పనీ సానుకూలం కాకపోయినా, అక్కడ యుద్ధ భూమిలో గాయపడ్డ వారికి సేవలు చేయడానికి బ్రిటిష్ సైన్యానికి బాసటగా నర్సులను పంపించాలనే నిర్ణయానికొచ్చారు. అందుకు ఎవరు సరియైన వ్యక్తి అని యోచన చేశారు. అప్పుడు లండన్ ఆసుపత్రిలో పని చేస్తున్న నైటింగేల్ వారి దృష్టిలోకి వచ్చింది. ఆమెకు సహాయకులుగా వారు మరో 38 మంది నర్సులను యుద్ధ శిబిరాలు ఉన్న 'క్రిమియా'కి పంపడం జరిగింది.

క్రిమియాలో శిథిలావస్థలో వున్న బార్‌లు, శుచీశుభ్రం లేని ఎలుకలతో నిండిన కొట్టాల వంటి గదులలో నైటింగేల్ తన బృందంతో పనిచేయాల్సిన అగత్యం ఏర్పడింది. గాయపడిన క్షతగాత్రులను నేల మీదే పడుకోబెట్టవలసిన పరిస్థితి. అక్కడ కనీస అవసరాలైన బెర్తులు, బ్యాండేజ్‌లు, టవళ్లు, కనీసం సబ్బు వంటి ప్రాథమిక వైద్యపరికరాలు కరువయ్యాయి. వీటికితోడు సైనికుల మరణాలకు పోషకాహారలోపం, పారిశుద్ధ్య లోపం కారణాలని నైటింగేల్ గ్రహించగలిగింది.

రాత్రి సమయంలో ఆమె రోగుల పట్ల కన్నతల్లిలా చేతిలో లాంతర్ (దీపం) ఆసరాగా తీసుకుని దాదాపు 6 కిలోమీటర్ల పొడవున్న కారిడార్లలో తిరుగుతూ సైనికులకు తనవంతు సేవ అందించగలిగేది.

ఆమె చేసిన సేవా పరాయణతకు గుర్తుగా ప్రపంచ ప్రజలు మే 12ని 'నర్సుల' దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఆ వృత్తికి ఒక ప్రత్యేకత తీసుకువచ్చిన మహనీయురాలు, మాననీయురాలు నైటింగేల్. నైటింగేల్ 'ఇనిషియేటివ్ ఫర్ గ్లోబల్ హెల్త్' కోసం ఏర్పాటు చేసిన 'నైటింగేల్ డిక్లరేషన్ కాంపెయిన్' ద్వారా ఐక్యరాజ్యసమితిని ప్రభావితం చేసి, రెండు కోరికలు సఫలీకృతం చేసేటందుకు ముమ్మర ప్రయత్నాలు జరిగాయి. నైటింగేల్ 200వ జన్మదినాన్ని పురస్కరించుకుని 2011-2020 మధ్య యుఎన్ ఆరోగ్య ప్రపంచ దశాబ్దిని ప్రకటించడం ఆనందదాయకమైన విషయం.

ఆగస్టు 7, 1857లో ఫ్లారెన్స్ నైటింగేల్ తిరిగి తన స్వస్థలం బ్రిటన్‌కు చేరుకుంది. ఆ దేశపు రాణికి ఉన్నంతపేరు ఒక్క నైటింగేల్‌కే ఉండేది. క్రిమియాలో నైటింగేల్‌కి 'క్రిమియన్' జ్వరం సోకింది. ఆ జ్వరం పుణ్యమా అంటూ ఫారెన్స్ చావు అంచులదాకా వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విధి లేక ఆమె తనకు ఇష్టమైన నర్స్ పనిని తగ్గించుకోక తప్పింది కాదు. నైటింగేల్ 200 దాకా పుస్తకాలు, నివేదికలు, కరపత్రాలు ప్రచురించిన చారిత్రక దాఖలు అగుపిస్తున్నాయి. 1860లో ప్రచురించబడ్డ 'నర్సింగ్' అనే ఆమె కలం నుండి వెలువడ్డ గ్రంథం 'నర్స్' వృత్తిలో బోధించబడే మొదటి పాఠ్య పుస్తకంగా ప్రసిద్ధికెక్కడం ఆనందించాల్సిన విషయం. ఆ గ్రంథం పలు ప్రపంచ భాషలలోకి తర్జుమా కావడం చాలా గొప్ప విషయంగా మనం చెప్పుకోవాల్సి ఉంటుంది.

1895 నాటికి నైటింగేల్ జ్వరతీవ్రత వల్లో, అనారోగ్య పరిస్థితులు అధికం కావడంవల్లో కంటిచూపు పూర్తిగా కోల్పోవలసి వచ్చింది. క్రమేపీ ఆమె శరీరంలో గల వ్యవస్థలన్నీ సహకరించడం మానివేశాయి. నర్సింగ్ వృత్తికి కొత్త జవజీవాల్ని నింపిన నైటింగేల్‌కి నర్సుల అవసరం రానే వచ్చింది. విధివశాత్తూ 15 సంవత్సరాలు తీసుకుని, తీసుకుని లండన్‌లోనే ఆగష్టు 13, 1910లో ఆఖరి శ్వాస విడిచిపెట్టింది. ప్రపంచ ప్రజలు విచార సాగరంలో మునిగిపోయారు. నైటింగేల్ వంటి సేవా ధృక్పథం గలవారు నూటికో కోటికో ఎక్కడో పుడుతూ ఉంటారు.

*- డా॥ మంతెన సూర్యనారాయణరాజు*



Sthanka_BW Sept.indd 28 02/09/11 3:19 PM

# ఫేస్‌బుక్ లో అపార్డ్




**ప్రపంచవ్యాప్తంగా నేడు లక్షలాది మంది తమ అభిప్రాయాలను స్నేహితులతో, బంధువులతో, వ్యాపార భాగస్వాములతో పంచుకోవటానికి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లపై ఆధారపడుతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు, వ్యాపార, వాణిజ్య వర్గాలు కూడా తమ విధానాలను ప్రజలకు / వినియోగదారులకు తెలియచేయటానికి పెట్టుబడిలేని సులభతరమైన మార్గంగా ఈ సోషల్ మీడియా వెబ్‌సైట్లను విరివిగా ఉపయోగిస్తున్నారు.**

సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన **ఫేస్‌బుక్** ఈ సోషల్ నెట్‌వర్క్‌లలో అత్యంత జనాదరణ పొందింది. గ్రామీణాభివృద్ధి రంగంలో గత 54 సంవత్సరాలుగా ప్రజాప్రతినిధులు, అధికారుల సామర్థ్యాలను పెంపొందించి సుస్థిర అభివృద్ధికోసం అవసరమైన శిక్షణను అందచేసే రాష్ట్ర స్థాయి శిక్షణా సంస్థ అపార్డు కూడా తన ఫేస్‌బుక్ అక్కౌంటును ప్రారంభించింది.

అపార్డు నిర్వహించే శిక్షణాకార్యక్రమాలు, ల్యాబ్ - టు - ల్యాండ్, కీ కాప్ లాంటి యాక్షన్ రీసెర్చి కార్యక్రమాల వివరాలు, విస్తరణ శిక్షణకేంద్రాలలో జరిగే కార్యక్రమాలు తదితర వివరాలను ఎప్పటికప్పుడు అపార్డ్ ఫేస్‌బుక్‌లో ఉపలబ్ధం చేయటం వల్ల గ్రామీణాభివృద్ధి రంగంలో ఆసక్తి కల్గిన వారు ఈ సౌకర్యం ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని పొందటమే కాక క్షేత్రస్థాయిలో తాము చేస్తున్న మంచి పనులకు సంబంధించిన సమాచారం, ఫొటోలు, వీడియోలు అపార్డుతో పంచుకోవచ్చు. అపార్డ్ ఫేస్‌బుక్‌ని వీక్షించాలంటే ముందుగా అపార్డు వెబ్‌సైట్ www.apard.gov.in ను సందర్శించి అక్కడ కన్పించే facebook ఐకాన్ ను క్లిక్ చేసినట్లయితే అపార్డ్ ఫేస్‌బుక్‌ని చేరుకోవచ్చు.

అపార్డు నుండి సమాచారాన్ని నిరంతరం పొందాలంటే 1) ఒకవేళ మీకు ఇప్పటికే ఫేస్‌బుక్ అక్కౌంటు ఉన్నట్లయితే ఫేస్‌బుక్ మెయిన్ పేజ్‌లో find friends ఆప్షన్ ఎంచుకొని అపార్డు కోసం వెతికి మీ అభ్యర్థనని అపార్డుకు పంపండి. 2) ప్రస్తుతం మీకు ఫేస్‌బుక్‌లో అక్కౌంటు లేకపోయినట్లయితే మీరు వెంటనే www.facebook.com కి వెళ్ళి ఫేస్‌బుక్‌లో అక్కౌంటుని ప్రారంభించి అపార్డుని మీ స్నేహితునిగా ఎంచుకుంటూ అభ్యర్థన పంపండి. మీ అభ్యర్థనను అపార్డు అంగీకరించిన మరునిమిషం నుండి మీకు ఎప్పటికప్పుడు అపార్డు కార్యక్రమాలు తెలియచేయబడుతూ ఉంటాయి.




# గ్రామీణాభివృద్ధి విజ్ఞాన సర్వస్వం - అపార్డ్ యూ ట్యూబ్ ఛానల్

- వాటర్ షెడ్ అంటే ఏమిటి? వాటర్ షెడ్ అభివృద్ధికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలి?
- పీసా చట్టం ఎందుకు చేసారు?
- మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలేమిటి?
- ప్రకృతి వైపరీత్యాలు అంటే ఏమిటి? ఎలా సంభవిస్తాయి? ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్ట నివారణకు ఏం చర్యలు చేపట్టాలి?
- ఆంధ్ర ప్రదేశ్ ట్రెజరీ నియమావళి ప్రకారం ప్రభుత్వ నిధులు వెచ్చించటానికి ఎటువంటి నిబంధనలు పాటించాలి?
- ఆంధ్రప్రదేశ్ లీవ్ రూల్స్ ఏం చెప్తున్నాయి?
- వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలేమిటి?
- జనన మరణాల నమోదుకు ఎటువంటి పద్ధతి పాటించాలి?
- సమాచార హక్కు చట్టం ఏం చెప్తోంది?
- పంచాయతీరాజ్ సంస్థల వల్ల ప్రజలకు చేకూరే లబ్ధి ఏమిటి?
- మహాత్మాగాంధీ కన్న కలలను సాకారం చేసే దిశగా వినూత్న రీతిలో అభివృద్ధి సాధిస్తున్న పంచాయతీలు ఏమైనా ఉన్నాయా?

గ్రామీణాభివృద్ధి రంగంలో పనిచేసే స్వచ్ఛందసంస్థలు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు, పంచాయతీరాజ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు తరచుగా ఇటువంటి విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలను కొంటారు. అవగాహన పెంపొందించుకోవాలనే ఆసక్తి వారిలో ఉన్నా తత్సంబంధిత సమాచారం వెంటనే లభ్యం కాకపోవటం వల్ల సందేహాలు సందేహాలుగానే మిగిలిపోతుంటాయి. ఇటువంటి సమాచారం మాతృ భాష తెలుగులోకి ఒకే చోట ఇప్పుడు అందుబాటులోకి వచ్చిందంటే నమ్మశక్యంగా లేదు కదా?

గ్రామీణాభివృద్ధికి సంబంధించిన విజ్ఞానాన్ని నలుగురికి అందించాలనే ఉద్దేశ్యంతో హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ (అపార్డ్) గ్రామీణాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై రూపొందించిన సుమారు 400 పైగా లఘు చిత్రాలను యూ ట్యూబ్‌లో అందుబాటులోకి తెచ్చింది. గ్రామీణ ప్రాంతాలలో కూడా నేడు బ్రాడ్ బ్యాండ్ ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చినందున ఒక్క బటన్ క్లిక్‌తో నేరుగా ఇంటినుండే ఈ సమాచారాన్ని పొందటానికి వీలు కలుగుతుంది. అపార్డ్ యూట్యూబ్ ఛానల్‌లోని చిత్రాలను వీక్షించాలంటే ముందుగా అపార్డు వెబ్‌సైట్ www.apard.gov.in ను సందర్శించి అక్కడ కన్పించే ఐకాన్ youtube ను క్లిక్ చేసినట్లయితే అపార్డ్ యూట్యూబ్ ఛానల్‌ను వీక్షించవచ్చు.

ఈ ఛానల్ గ్రామీణాభివృద్ధి రంగంలో పనిచేస్తున్న వ్యక్తులకే కాకుండా, గ్రామీణాభివృద్ధి కోర్సులు చేస్తున్న విద్యార్థులకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. మరెందుకు ఆలస్యం వెంటనే కంప్యూటర్ ఆన్ చేసి అపార్డు వెబ్‌సైట్‌ను సందర్శించండి. ఈ చిత్రాలను వీక్షించండి. మీ అమూల్య అభిప్రాయాలను నమోదు చేయటం మర్చిపోవద్దు సుమా.

# గార్డెన్ టాయిలెట్ల కథా కమామీషు

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెం మండలం, పెద తాడేపల్లి గ్రామం నిర్మల్‌గ్రామ పురస్కారం, శుభ్రం అవార్డులు పొందిన గ్రామం. అక్కడ గార్డెన్ టాయిలెట్లు ప్రత్యేక ఆకర్షణ. ఈ గార్డెన్ టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ, అందుకు సర్పంచ్‌గా శ్రీమతి ఆలపాటి నాగమణి పడిన వ్యయప్రయాసలు అంతా ఇంతా కాదు.




గార్డెన్ టాయిలెట్ల నిర్మాణానికి, శుభ్రం, నిర్మల్ గ్రామపురస్కారాలు పొందటానికి, గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడానికి, అందరికీ సురక్షితమయిన మినరల్ వాటర్‌ను నామమాత్రపు వెలకే సరఫరా చేయడానికి వెనుక పెద్ద కథే ఉంది. అంతకు మించి వారు పడిన వ్యధ ఉంది. తమ గ్రామానికి గుర్తింపు తెచ్చుకోవాలన్న తపన ఉంది. అందరినీ కలుపుకొని పోవడంలో పడిన కష్టనష్టాలు, ఉదారతతో ముందుకు వచ్చి స్నేహహస్తమే కాక ఆర్థిక హస్తాన్ని కూడా అందించి, గ్రామాభివృద్ధిలో పాలు పంచుకొన్న కొందరు వదాన్యుల త్యాగనిరతి ఉంది.

"చదువుకునే రోజులలో చెరువు ప్రక్కన స్నానాలు చేసేవారిని, రోడ్డు ప్రక్కన కాలకృత్యాలు తీర్చుకొనేవారిని, దారిలో నడవడానికి వీలులేని పరిస్థితులని" చిన్నప్పుడు ఆమె ప్రత్యక్షంగా చూసారు. కానీ రాష్ట్రంలోని 22,809 గ్రామాలలో 100కి 99 గ్రామాల పరిస్థితి ఆ రోజే కాదు ఈ రోజు కూడా అలానే ఉంది.

అది 2005-06వ సంవత్సరం శ్రీమతి నాగమణి గారివలెనే వారి అమ్మాయి కూడా ఆ గ్రామంలోనే వాసవీ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతూ ఉండేది. కొంతమంది ఆ గ్రామంలోని ఆడ పిల్లలు, ఇతర గ్రామాలలోని పిల్లలు కూడా ఆ గ్రామంలో చదువుతూ ఉండేవారు. వర్షాకాలం వచ్చిందంటే ఆ రోడ్లులో నడవటమంటే నిప్పులమీద నడచినంత భయంకరం, దుర్భరం, ముక్కులు మూసుకున్నా వాసనను అరికట్టవచ్చేమో కాని, జోళ్ళనుంచి అరికాలికి అంటుకునే అశుద్ధంను విదుల్చుకోవడం కష్టం. ఈ లోపుగా దురదృష్టం ఎదురై , ఏదైనా వాహనం ఆ దారివెంట వచ్చిందంటే, వీరి పట్టు పరికిణీలు, చుడీదారులు, మొత్తం అన్నీ నోటితో చెప్పనంత దుర్భరమైన పరిస్థితికి కారణమయ్యేవి. ఇంక భరించలేక 3 బస్సులలో 100 మంది విద్యార్థినులు సర్పంచ్‌గారి అమ్మాయితోపాటు వచ్చి, సర్పంచిగారితో మీరు ఏంచేస్తారో మాకు తెలియదు. అక్కడ బహిరంగ మలవిసర్జన జరగకుండా ఒక వాచ్‌మ్యాన్‌ని పెట్టి మాన్పిస్తారో, శుభ్రం చేయించి

మేము కాలేజీకి వెళ్ళేలా చేస్తారో మాకు తెలియదు. మా పాకెట్ మనీలోంచి ఒక్కొక్కరూ రూ. 100/- ఇస్తున్నాము. మమ్మల్ని ఈ దౌర్భాగ్యం నుంచి కాపాడండి అని ప్రాధేయపడ్డారు. సమస్య జఠిలమైనది, కాని పరిష్కారం కూడా అంత సులభమైంది కాదు. వారిని బహిరంగ విసర్జన నుంచి మాన్పించడానికి ముందు వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపాలి. లేకపోతే అసలే పల్లెటూరు, రాజకీయాలు ఎక్కువ, నిరక్షరాస్యులైన ప్రజలు నోటికి వచ్చిన అభాండాలు వేయడమో, ఇంటి మీదికి దెబ్బలాటకి రావటమో చేస్తారు. సర్పంచ్‌గారు తీవ్రంగా ఆలోచించి పై విద్యార్థుల విరాళాలకు తోడు మరికొంతమంది ప్రవాసాంధ్రుల నుంచి కూడా కొంత మొత్తాన్ని ప్రోగుచేసారు. వారిలో అత్తింటి వీరవెంకటగంగాధరరావు, గాయత్రి, పశుమర్తి నాగపర్వతం, ఆలపాటి సత్యసాయి, ఆలపాటి సతీష్‌కుమార్ వీరందరి విరాళాలు 50,000లతో గ్రామ పారిశుధ్య కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది.

ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకంతో స్వంతస్థలాలు ఉన్న అందరికీ వారివారి స్థలాలలో మరుగు దొడ్లు నిర్మించడం జరిగింది. కాని వారిచే ఆ మరుగుదొడ్లు వాడుకొనేలా చేయడానికి దరిదాపుగా యుద్ధమే చేసినంత పని అయింది. కాపలాలు పెట్టి, బెదిరించి, భయపెట్టి, ఏమిచేసినా ఒక 30కుటుంబాలవారు ఇంకా బహిరంగ మల విసర్జన మానలేదు. వెంటనే సర్పంచ్‌గారు మండల అభివృద్ధి అధికారిణి కుమారి జె.రేణుకమ్మగారితోను, మండల రెవెన్యూ అధికారి శ్రీ అద్దేపల్లి శేషుబాబు గారి సహాయం తీసుకొని వారికి నెలనెలా ఇచ్చే రేషన్ ఆపు చేయించారు. ఆవిధంగా చేయడంతో వారిలో ఎక్కువ మంది తమ తమ మరుగు దొడ్లను వాడుకోవడం మొదలుపెట్టారు. ఇంకా ఎస్.టి.లకు చెందిన కుటుంబాలవారు ఎదురుతిరిగి, బహిరంగ మలవిసర్జన మానలేదు. అప్పుడు ఎలక్ట్రికల్ డీ.ఇ.ఇ గారితో కల్సి చర్చించి, వారి సహాయం తీసుకొని వారికి ఇవ్వబడిన విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలుపుదల చేసారు. ప్రతి ఇంటిలోను టి.వి. నిరంతరంగా చూసే అలవాటు ఉన్న ఇళ్ళల్లో కరెంటు లేకపోతే ఎంత ఇబ్బందో, మిగిలిన గృహ అవసరాలకు, దీపాలకు, కరెంటు ఎంత ముఖ్యమో, బహిరంగ మలవిసర్జన మానటం కూడా అంతే ముఖ్యమని వారికి అప్పటికి అర్థమై క్రమంగా వారు మరుగుదొడ్లు వాడుకోవడం మొదలు పెట్టారు. ఇంక ఇంటిలో స్థలం లేనివారి కోసం ఏదో చెయ్యాలి? ఏం చెయ్యాలి? అన్నది వేధించే ప్రశ్న. స్థలం కోసం వెతుకులాట ప్రారంభించారు. పంచాయితీ పోరంబోకులు ఎక్కడ ఎక్కడ ఉన్నాయో వారికి దగ్గరగా ఏవి ఉన్నాయో గుర్తించడం ఒకవంతు అయితే, అప్పటికే ఆక్రమణలకు గురైన వాటిని ఖాళీ చేయించడం మరింత బ్రహ్మప్రళయం అయింది. మనకు అవసరమైన స్థలంలో ఆక్రమించుకున్న వారికి వేరే ప్రత్యామ్నాయం చూపించి, ఇవి ఖాళీ చేయించి, అచ్చట నేల చదును చేసి గ్రామంలో 5చోట్ల సుమారు 40 కమ్యూనిటీ సానిటరీ లెట్రిన్ (సి.ఎస్.ఎల్.) లు నిర్మాణం చేపట్టారు. గ్రామపంచాయితీ నిధుల నుంచి 3 చోట్ల, సర్పంచ్ గారు 2 చోట్ల, సర్పంచ్‌గారు - ఉపసర్పంచ్‌గారు కల్సి మొత్తం రూ. 65,000/ - లు ఖర్చుతో 40 సి.ఎస్.ఎల్ ను నిర్మించారు. వాటికి ప్రత్యేకంగా,


తా. గూడెం మండలం పెదతాడేపల్లి పబ్లిక్ టాయిలెట్స్


తా. గూడెం మండలం పెదతాడేపల్లి పబ్లిక్ టాయిలెట్స్ NO:2


తా. గూడెం మండలం పెదతాడేపల్లి పబ్లిక్ టాయిలెట్స్ NO:3


తా. గూడెం మండలం పెదతాడేపల్లి పబ్లిక్ టాయిలెట్స్ NO:5

డైరెక్ట్‌గా నీటిలైను, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసి 24 గంటలు వాటర్ సప్లయి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి సి.ఎస్.ఎల్ దగ్గర ఫ్లడ్ లైట్లు అమర్చారు. సి.ఎస్.ఎల్.ల లోపల బయట టైల్స్ వేయించారు. ప్రతి సి.ఎస్.ఎల్. దగ్గర వాచ్‌మ్యాన్‌ని నియమించారు. ప్రతిరోజు సాయంత్రం ఉపసర్పంచ్‌గారు ఈ అయిదుగురి సహాయంతో ఈ సి.ఎస్.ఎల్.ఎస్ అన్నీ ఫినాయిల్‌తో క్లీన్ చేయించి యాసిడ్‌తో శుభ్రం చేయిస్తారు. ఇంకా ఏమేమో చెయ్యాలనే తపన వీరిని వదలలేదు. సర్పంచ్‌గారు 5 టాయిలెట్స్ వద్ద రూ. 25,000/-ల విరాళాలతో కడియం వెళ్ళి, మంచి మొక్కలు తెచ్చి ఈ సి.ఎస్.ఎల్ ల చుట్టూ చక్కని గార్డెన్ పెంచారు. హైవే రోడ్డుపై ప్రయాణం చేసేవారు రోడ్డు ప్రక్కన మలవిసర్జనకు వెళ్ళకుండా హైవే రోడ్డుపై గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం విరాళం రూ. 1,50,000 తో 6 టాయిలెట్స్, వాటి వద్ద పార్కు, నీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు చేసారు. ఇప్పుడు అక్కడ చూడముచ్చటగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. మన ఇంట్లో మరుగు దొడ్ల వద్ద కూడా అంతా శుభ్రత ఆహ్లాదం లభించవని ఘంటా పదంగా చెప్పవచ్చు. పొరపాటున కూడా బయట మూత్రవిసర్జన కాని, ఉమ్మి వెయ్యటం కాని, చుట్టలు వగైరా కాల్చిపారవేయడం కాని చెయ్యబుద్ధికాదు. అంత ఆనందమయంగా ఉంటాయి ఆ పరిసరాలు.

గ్రామంలో యం. 8.64 సెంట్లు ఉన్న మంచినీటి చెరువు కాలక్రమేణా, అపరిశుభ్రంగా, అనాగరికమైన అలవాట్లకు నిలయంగా, పశువులకు, పందులకు ఆశ్రయంగా మారిన వైనంపై ఆమె దృష్టి పడింది. దీనిని సంస్కరిస్తేనే కాని ఊరు బాగుపడదు అనుకున్నారు. వెంటనే ఏలూరు కాలువ నుంచి గ్రామ పంచాయితీ ఫండ్స్‌తో నీటిని చెరువులోనికి మళ్ళించినారు. 4,50,000/-సర్పంచ్‌గారు స్వంత నిధులు పెట్టి, నాంది ఫౌండేషన్ వారి ద్వారా సురక్షితమైన మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ ప్రారంభించినారు. రూ. 36,00,000/- రూపాయలతో ఆర్.ఓ. ప్లాంట్ అందుబాటులోనికి వచ్చినది.

2,10,000 లీటర్ల సామర్ధ్యంగల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం జరిగింది. పరిశుభ్రమైన నీటిని 20 లీటర్ల టిన్ను-రూ 3/- లు 12లీటర్ల టిన్ రూ. 2/-లు నామమాత్ర ధరలకు అందిస్తున్నారు. అంతేకాక గ్రామస్థులు అందరూ సరియైన పరిమాణంగల కేన్లు కల్గి ఉండటానికి వీలుగా 1100 తెల్లకేన్‌లు యీ క్రింది వారి విరాళంతో ఏర్పాటు చేసారు.

| | | |
|---|---|---|
| 1. | అన్నెమనీడి నాగరాజుగారు | 15,000 |
| 2. | బలుసు లక్ష్మణరావు గారు | 15,000 |
| 3. | అత్తింటి గంగాధరరావు గారు | 15,000 |
| 4. | పశుమర్తి చంద్రశేఖరశ్రీనివాస్‌గారు | 15,000 |
| 5. | చందు ఎమ్.పి.టి.సి. అల్లూరి సుభాష్ చంద్రబోస్ | 25,000 |
| | | 85,000 |

వెరసి 85,000రూపాయలతో 1100 తెల్లని క్యాన్‌లు కొని అందరికీ ఉచితంగా పంపిణీ చేసారు. వాటర్ పార్కు వద్ద కాంపౌండ్, గార్డెన్,



శ్రీ అత్తింటి సోమరాజుగారు రూ. 4000 పరిమి కోటేశ్వరరావు రూ. 3000 /-వాసవీ ఇంజనీరింగ్ కళాశాల 10,000 ఖర్చుతో నిర్మించారు.

75,000/- రూపాయలు సర్పంచ్‌గారు విరాళంగా ఇచ్చి, చెరువులు రెండు ప్రక్కల, మాల ధరించిన స్వాములు, మరియు ఎవరైనా చనిపోతే స్మశానానికి వెళ్ళినవారు చెరువులో దిగి స్నానం చెయ్యవల్సిన అవసరం లేకుండా, షవర్లు నిర్మించి స్నానఘట్టాలను ఏర్పాటు చేసి, అలా వచ్చిన మురుగునీటికి పారుదల సౌకర్యం వేరే చూపించారు.

గ్రామంలో ఎవరింట్లోనైనా ఏదైనా ఫంక్షన్స్ కాని, వేరే అవసరానికి గాని, గృహనిర్మాణానికి కాని నీరు అదనంగా కావలిస్తే పంచాయితీ నీటి పైపుల ద్వారా కాక వాటర్ ట్యాంక్ ద్వారా సర్పంచ్‌గారి ట్రాక్టర్ సహాయంతో గ్రామంలోనివారికి, ప్రక్క గ్రామాలలోనివారికి కూడా నీటిని సరఫరా చేస్తారు.

పరిమి సత్యనారాయణ ప్రసాద్‌గారు 0.12 సెంట్ల స్థలం పశువుల ఆసుపత్రి నిమిత్తం దానం ఇవ్వగా, ఆ స్థలంలో పశువుల ఆసుపత్రి నిర్మించుకొని 19.06.11 న జిల్లా మంత్రివర్యులు శ్రీ వట్టి వసంత కుమార్‌గారిచే ప్రారంభోత్సవం చేయించుకున్నారు.

ఎస్.సి. పేట కమ్యూనిటీ హాలు పునరుద్ధరణకు సర్పంచ్‌గారు రూ. 40,000/-విరాళమిచ్చి పునర్మించి ఇచ్చినారు. హైస్కూలుకు 18,000/- స్వంత విరాళాలతో సర్పంచ్ గారు వాటర్‌పైప్‌లైన్ వేయించి ఇచ్చినారు.

5,000 జనాభా గల ఈ గ్రామంలో 1000 మొక్కలు నాటించి, సంరక్షిస్తున్నారు. అన్ని రకాల పన్నులు 100%వసూలు చేస్తున్నారు. సుమారుగా అందరూ బడిఈడు పిల్లలు బడికి వెళుతున్నారు. బాలకార్మికులులేరు. 94 డ్వాక్రా సంఘాలు సక్రమంగా పని చేస్తున్నాయి. ఆడపిల్లలు కుట్లు, అల్లికలు నేర్చుకొని స్వయంగా అర్ధనవరులై వారికాళ్ళపై వారు నిలబడి, జీవనోపాధులు పొందుతున్నారు.

**డా॥ఎస్.వి.బి.ఎస్.శాస్త్రి, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ ట్రైనింగ్ సెల్,**
**జిల్లాప్రజాపరిషత్, పశ్చిమగోదావరి, ఏలూరు.**

# వినాయకా! నీ మూర్తికే నా మొదటి ప్రణామం



మనం ఏదైనా పనిని ప్రారంభించేముందు ఫలితం గురించి ఆలోచించి ఎంతగా ఆశపడతామో, విఘ్నం గురించి ఆలోచించి అంతకంటే ఎక్కువగానే భయపడతాం. ఆ భయం వల్ల మనం చేసే పనిలో ఏకాగ్రత, నాణ్యత తగ్గి ఫలితంలో కూడా తేడా వస్తుంది. ఇటువంటి ప్రమాదం నుండి దూరం చేసి విఘ్నాల్ని విఘ్నం చేసే దేవతా స్వరూపుడిగా విఘ్నేశ్వరుడు పురాణాల ఆధారంగా పేర్కొనబడ్డాడు. మిగిలిన దేవతలందరిలోని శక్తుల్నీ పుణికిపుచ్చుకోవడం వల్ల, ఎవరిని పూజించినా, పూజించకపోయినా గణపతిని ప్రథమంగా పూజించక పోతే సర్వానర్థాలూ కలుగుతాయని భారతీయుల విశ్వాసం. అందుకే ఒక కవి -

*"భూ నాయకం వాహన నాయకం వా భజన్ ధ్రువం వాహనమేతి*
*తద్విఘ్ననాథం నభజామి, కింతు సహస్రశః తం ప్రణమామినిత్యమ్*

'భూ దేవతల్ని, ధనదేవతల్ని పూజిస్తే భూమి, ధనం లభిస్తాయి. అలాగే విఘ్నాలకు  ఆదిదేవుడైన విఘ్నేశ్వరుణ్ణి పూజిస్తే విఘ్నాలు తొలగుతాయి. అందువల్ల అందరి దేవుళ్ళనూ మాకు అది కావాలి, ఇది కావాలి అని ప్రార్థన చేస్తాం కానీ వినాయకుణ్ణి మాత్రం మాకు విఘ్నాల్ని ఇవ్వవద్దు... ఇవ్వవద్దు... అంటూ వేలాది నమస్కారాలు చేస్తాము' అని చమత్కరించాడు..

వినాయకుని మూర్తి ఎన్నో విషయాలకు, సందేశాలకు ఆలవాల మైంది. వినాయకుని ముఖం గజముఖం. ఆ ముఖం నిర్మలత్వానికి ప్రతీక. ఏనుగు భారీ శరీరం ఉన్నా సాధుజంతువే. ఎంత శక్తి ఉన్నా సాధు ప్రవర్తనతోనే మెలగాలని, ముఖంలో కరుణారస ప్రవాహం తొణికిసలాడాలని దీని అంతర్యం. పెద్దపెద్ద చెవులు ఎక్కువగా వినాల నే విషయాన్ని తెలుపుతున్నాయి.

వినాయకుని చెవులు వేదవ్యాసుడు చెప్పిన పురాణాల్ని వినడం వల్ల ధన్యత్వాన్ని పొందాయి. కాబట్టి పురాణేతిహాసాల సారాన్ని, అందులోని మంచిని వినాలి. తొండం మోక్ష ద్వారం. ఆయన ధరించే నాగులు విజ్ఞానానికి, చైతన్యానికి ప్రతీకలు. వినాయకుడి ఉదారం భక్తులపైన ఆయన చూపే అనుగ్రహానికి చిహ్నం. సిద్ధి బుద్ధి భార్యలు. వారిని విడిచి ఉండడు. అంటే విఘ్నేశ్వరుడి అధీనంలోనే కార్యసిద్ధి, వివేక బుద్ధి ఉన్నాయని. వినాయకుని మందమైన చూపు మందగమనం వంటి వాటివల్ల మనం తీసుకోవలన సందేశమేమంటే, ఒక పనిని చేసేటప్పుడు, బాగా వీక్షించి, తొందరపడకుండా ఆలోచించి అడుగేయడం మంచిది అనే బోధ.

## గణేశ మాలిక



అభీష్ట సిద్ధి దాయకం- పురాణ శాస్త్ర లేఖకం
పురారి జ్యేష్ఠ పుత్రకం-సమస్తలోక రక్షసం
శశాంక వర్ణ శోభితం - విభూతి ఫాల భాసితం
సురేంద్ర ముఖ్య పూజితం - అనాయకం వినాయకం
కృపాకటాక్ష వీక్షణం -స్ఫురన్మణిప్రభూషణం
అవిఘ్న భగ్న కారణం-సురారి కార్య ధ్వంసకం
మహోగ్ర సర్పభూషణం- ఉమాహరే ప్రదక్షిణం
అవిఘ్న మృష్టభోజనం - బిడాల వైరివాహనం
పురాణ భాగ భాజనం - సమస్త లోకశంకరం
స్ఫురద్ఘ సద్విలోచనం - గజాననం జగావనం
మహాబలం గుహాగ్రజం - మహామహం చతుర్భుజం
కరాంబుడు స్థితాంబుజం - గణాధిపం శివాత్మజం
పరేభ వక్ర సుందరం - సితాద్రి వాస మందిరం
ఉమామనోభినందనం - గణేశ్వరం గణేశ్వరం
కృపాకరం శుభంకరం - సితాంబరం మహోదరం
శివాత్మజం సురేశ్వరం - నమో నమో నమో నమః

## ఏకవింశతి పత్రపూజ

వినాయకుని 'ఏకవింశతి' పత్రాలతో పూజించడం వల్ల ఆరోగ్యం, నవరాత్రులు, నిమజ్జనాది కార్యక్రమాల వల్ల సమాజాన్ని ధార్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కలిగేలా చేసి, ఐకమత్యాన్ని నేర్పి మానసిక పరిణామాల్ని కలుగచేయడం, వినాయక వ్రత కథల ద్వారా ఆటంకాలు వచ్చినప్పుడు ఆ సమస్య ఏ విధంగా సాధించాలనే మార్గనిర్దేశం వంటి ఎన్నో ప్రయోజనాలున్నాయి.

అందుకే విఘ్నేశ్వరుడు అందరికీ ఆరాధ్య దైవమయ్యాడు. ఆయనకు అనేక రూపాలలో పూజలందుతున్నాయి. ఎన్ని రూపాలున్నా వినాయకుని మూర్తికే తొలిపూజ. మహాగణపతి, లక్ష్మీగణపతి, వల్లభ గణపతి, నర్తన గణపతి, హేరంబ గణపతి, వీరగణపతి... ఇలా రూపాలు భారత్, చైనా, టిబెట్, శ్రీలంక, జావా, కాంబోడియా, థాయ్‌లాండ్, జపాన్, బర్మా, వియత్నాం దేశాలలో పూజలందుకొనే ఆ సిద్ధివినాయకుడు లోక కళ్యాణానికి కలిగే ఆటంకాల్ని నాశనం చేసి విశ్వజనులకు శాంతి సౌఖ్యాలను ప్రసాదిస్తాడని భావిస్తూ భక్తితో వేడుకొందాం!

*- డా॥ అద్దంకి శ్రీనివాస్*



Sthanka_Septcolo.indd 30 02/09/11 3:20 PM








# మీకోసం - మేము







## ప్రజా మన్నన పొందుతున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవాకార్యక్రమాలు

**శ్రీ క్యాప్ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15 కొటాల గ్రామంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రారంభించిన సేవా కార్యక్రమాలు ప్రజా మన్ననలను పొందుతున్నాయి. ఆగస్టు 15న కొటాల గ్రామ పంచాయితీ పరిధి శివారు గ్రామమైన పాండురంగపల్లెలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు 'మీ కోసం మేము' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.**

ఈ కార్యక్రమం క్రింద గ్రామంలో ఏ మాత్రం ఆసరా లేనటువంటి నిరుపేద వృద్ధులకి మూడుపూట్లా కడుపు నిండా భోజనం పెట్టి వారికి ఆహార భద్రత కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అందచేసే కోటా బియ్యానికి అదనంగా ప్రతీ నెలా 10 కె.జి.ల బియ్యం ఉచితంగా అందచేస్తారు. వృద్ధులకు అవసరం అయిన బియ్యాన్ని గ్రామస్తుల నుండి సేకరించి ప్రతీ నెలా అందచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చంద్రశేఖర్, సరస్వతమ్మ తెలియజేసారు. ఈ సందర్భంగా పాండురంగ పల్లెలోని ఎల్లమ్మ, లక్ష్మమ్మ, మంగమ్మ అనే 3 వృద్ధురాళ్ళకు ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యాన్ని అందచేసారు.

అంతకుముందు ప్రధాన గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కొటాల గ్రామ పంచాయితీలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ ఆటల పోటీలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేణు గోపాల్ నాయుడు అనే బి.ఎన్.వి. 6 మంది హైస్కూల్ స్టూడెంట్లకు ఇంగ్లీషు డిక్షనరీలను బహుకరించారు. అంతేకాకుండా వచ్చే సంవత్సరము నుండి 10 వ తరగతిలో 500 మార్కులకు పైన సాధించిన ప్రతి విద్యార్థికి రూ. 516/-లు నగదు ప్రోత్సాహ బహుమతిని అందచేయగలనని ఆయన తెలియచేశారు.




అంతకు ముందు సర్పంచ్ మదన్ మోహన్‌గారు గ్రామ పంచాయితీ కార్యాలయము, పాఠశాలలో జాతీయ జెండా ఎగురవేసి వందన సమర్పన చేశారు. తదుపరి జరిగిన కార్యక్రమములో అపార్డ్ అందచేసిన చేసిన మైకు సెట్టు, శ్రీ పి. నాగరాజు డి.టి.ఎం. వారు బహుకరించిన కార్పెట్‌లను ఇ.టి.సి. ఫ్యాకల్టీ శ్రీ శోభన్ బాబు ద్వారా బి.ఎన్.వి.లకు అందచేయటం జరిగింది.

అనంతరం, సాంప్రదాయేతర ఇంధన వనరుల ఆవశ్యకత, అందుబాటులో ఉన్న సాధనాలు, వాటి ఉపయోగాల గురించి నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ జగదీశ్వరరెడ్డి, క్లైమేట్ నెట్‌వర్క్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రవితేజలు స్థానిక ప్రజలకు అవగాహన కల్గించారు. సోలార్ వీధి దీపాలు, బల్బులు, కుక్కర్లు, హీటర్స్ వంటి ఉపకరణాలపై ఆసక్తిగల ప్రజలు 50% సబ్సిడీపై పొందటానికి వీలు కలదని వారు తెలియచేసారు. మొత్తం మీద అపార్డ్ 'కీ క్యాప్' కార్యక్రమం బి.ఎన్.వి.లలో స్ఫూర్తిని నింపడంతో గ్రామ అభివృద్ధి వేగవంతం అయ్యింది. కొటాల గ్రామస్తులు కూడా బి.ఎన్.వి.ల సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్, బి.ఎన్.వి.లు. శ్రీ శోభన్‌బాబు, యం.పి.డి.ఓ., డి.టి.యం., జెడ్.పి. ట్రైనింగ్ సెల్ నుండి నాగరాజు, మధుబాబు, పంచాయితీ కార్యదర్శి రఘుపతి గ్రామస్తుల పాల్గొన్నారు.

**పి. నాగరాజు**
**డి.టి.ఎం. జిల్లాపరిషత్ శిక్షణ కేంద్రం, చిత్తూర్ జిల్లా**

1965 సెప్టెంబరు 8వ తేదీన ప్రపంచ దేశాల విద్యా మంత్రులు ఇరాన్ రాజధాని టెహరాన్‌లో యునెస్కో ఆధ్వర్యాన సమమూవేశమై నిరక్షరాస్యత సమస్య గురించి మొట్టమొదటి సారిగా చర్చించి అన్ని దేశాలలోను అక్షరాస్యతకు కృషి చేయాలని తీర్మానించారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం సెప్టెంబరు 8వ తేదీన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అక్షరాస్యతా దినోత్సవాన్ని ఒక ఉత్సవంగా జరుపుకోవడానికి కాక సంపూర్ణ అక్షరాస్యత కొరకు చేయుచున్న కృషిలో మనం సాధించిన ప్రగతిని సమీక్షించుకొని ఈ కార్యక్రమ విజయానికి పునరంకితం కావడానికి ఉద్దేశింపబడినది.




# అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సెప్టెంబరు 8

మానవునికి గల హక్కులలో చదువుకునే హక్కు చాలా ప్రధానమైనదిగా యునెస్కో గుర్తించింది. చదువు జీవన ప్రమాణాలను పెంచుతుందని, సంస్కృతి సంపత్తిని వృద్ధి చేస్తుందని, ముఖ్యంగా దేశంలో ఆర్థిక, సామాజిక రంగాలలో గణనీయమైన మార్పు తెస్తుందని గుర్తించారు.

యునెస్కో అంచనాల ప్రకారం ప్రపంచం మొత్తం మీద 79.6 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉన్నారు. అంటే ప్రపంచ వయోజన జనాభాలో 18 శాతం నిరక్షరాస్యులు. వీరిలో అధిక భాగం 64 శాతం మహిళలు ప్రపంచ నిరక్షరాస్యులలో మూడొంతుల మంది కేవలం 12 దేశాలలో ఉన్నారు. ప్రపంచ నిరక్ష రాస్యులలో 34.6 శాతం ఒక మన దేశంలోనే ఉన్నారు. సంఖ్యాపరంగా తీసుకుంటే 2011 జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో 27.3 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉన్నారు.



సాక్షరభారత్ మిషన్‌లో ప్రసంగిస్తున్న జెడ్పీ చైర్మన్, కలెక్టర్, తదితర అధికారులు





అందువలన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం మన దేశంలో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. స్వతంత్ర్యం వచ్చే నాటికి కేవలం 18.33 శాతం ఉన్న అక్షరాస్యత 2011 నాటికి 74 శాతానికి పెరిగింది. అయినప్పటికీ, అక్షరాస్యతలో అనుకున్న స్థాయిలో పురోగతి సాధించలేకపోయాం. ముఖ్యంగా స్త్రీ పురుష అక్షరాస్యతలలో ఉన్న వ్యత్యాసం 16.68 శాతం ఉంది. అయితే క్రమేపీ స్త్రీ అక్షరాస్యత పెరుగుదల రేటు పురుషుల అక్షరాస్యతా పెరుగుదల రేటు కంటే అధికంగా ఉండడం సంతోషించవలసిన విషయం. అక్షరాస్యత పెరుగుదల రేటు 2001-2011 మధ్యకాలంలో పురుషులలో 7.98 శాతం ఉంటే, స్త్రీలలో 11.84 శాతం ఉంది.

### 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల వారీగా అక్షరాస్యతా శాతాలు (0-6 వయస్సు దాటిన జనాభాలో శాతం)

| క్ర.సం. | ఇండియా | 74.04 | 82.14 | 65.46 |
|---|---|---|---|---|
| 1. | జమ్ము & కాశ్మీర్ | 68.74 | 78.26 | 58.01 |
| 2. | హిమాచల్ ప్రదేశ్ | 83.78 | 90.83 | 76.60 |
| 3. | పంజాబ్ | 76.68 | 81.48 | 71.34 |
| 4. | ఛండీఘడ్ | 86.43 | 90.54 | 81.38 |
| 5. | ఉత్తరాఖండ్ | 79.63 | 88.33 | 70.70 |
| 6. | హర్యానా | 76.64 | 85.38 | 66.77 |
| 7. | ఎన్‌సిటి ఆఫ్ ఢిల్లీ | 86.34 | 91.03 | 80.93 |
| 8. | రాజస్థాన్ | 67.06 | 80.51 | 52.66 |
| 9. | ఉత్తర్ ప్రదేశ్ | 69.72 | 79.24 | 59.26 |
| 10. | బీహార్ | 63.82 | 73.39 | 53.33 |
| 11. | సిక్కిం | 82.20 | 87.29 | 76.43 |
| 12. | అరుణాచల్ ప్రదేశ్ | 66.95 | 73.69 | 59.57 |
| 13. | నాగాలాండ్ | 80.11 | 83.29 | 76.69 |
| 14. | మణిపూర్ | 79.85 | 86.49 | 73.17 |
| 15. | మిజోరాం | 91.58 | 93.72 | 89.40 |
| 16. | త్రిపుర | 87.75 | 92.18 | 83.15 |
| 17. | మేఘాలయ | 75.48 | 77.17 | 73.78 |
| 18. | అస్సాం | 73.18 | 78.81 | 67.27 |
| 19. | వెస్ట్ బెంగాల్ | 77.08 | 82.67 | 71.16 |
| 20. | జార్ఖండ్ | 67.63 | 78.45 | 56.21 |
| 21. | ఒరిస్సా | 73.45 | 82.40 | 64.36 |
| 22. | చత్తీస్‌ఘడ్ | 71.04 | 81.45 | 60.59 |
| 23. | మధ్యప్రదేశ్ | 70.63 | 80.53 | 60.02 |
| 24. | గుజరాత్ | 79.31 | 87.23 | 70.73 |
| 25. | డామన్ & డయ్యూ | 87.07 | 91.48 | 79.59 |
| 26. | డాద్రా & నాగర్ హవేలి | 77.65 | 86.46 | 65.93 |
| 27. | మహరాష్ట్ర | 82.91 | 89.82 | 75.48 |
| 28. | ఆంధ్రప్రదేశ్ | 67.66 | 75.56 | 59.74 |
| 29. | కర్నాటక | 75.60 | 82.85 | 68.13 |
| 30. | గోవా | 87.40 | 92.81 | 81.84 |
| 31. | లక్షద్వీప్ | 92.28 | 96.11 | 88.25 |
| 32. | కేరళ | 93.91 | 96.02 | 91.98 |
| 33. | తమిళ్‌నాడు | 80.33 | 86.81 | 73.86 |
| 34. | పుదిచ్చేరి | 86.55 | 92.12 | 81.22 |
| 35. | అండమాన్ & నికోబార్ దీవులు | 86.27 | 90.11 | 81.84 |

### ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యత

దేశంలో అక్షరాస్యతలో వెనుకబడిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి.2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర అక్షరాస్యత 67.66 శాతం. 2001-2011 మధ్య కాలంలో అక్షరాస్యతా శాతం 60.47 శాతం నుండి 67.66 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదల శాతం జాతీయ పెరుగుదల కంటే తక్కువ. స్త్రీ, పురుషుల అక్షరాస్యతలోను తీవ్ర వ్యత్యాసాలు



ఉన్నాయి. 2011 సంవత్సరంలో పురుషుల అక్షరాస్యత 75.56 శాతం ఉంటే, స్త్రీలలో కేవలం 59.74 శాతం మంది మాత్రమే అక్షరాస్యులు ఉన్నారు. దేశం అంతటా జరిగినట్లే, స్త్రీల అక్షరాస్యత పెరుగుదల రేటు, పురుషుల అక్షరాస్యత పెరుగుదల రేటు కంటే అధికంగా ఉంది.

అదే విధంగా రాష్ట్రాలలో వివిధ జిల్లాల మధ్య అక్షరాస్యత వ్యత్యాసాలు అధికంగా ఉన్నాయి. 80.96 శాతంలో హైదరాబాద్ అక్షరాస్యతలో ముందు స్థానంలో ఉండగా 56.06 శాతంలో మహబూబ్‌నగర్ ఆఖరి స్థానంలో ఉంది.

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా వారీగా అక్షరాస్యత శాతాలు ఈ విధంగా ఉన్నాయి.

| జిల్లాలు | అక్షరాస్యత | | |
|---|---|---|---|
| | మొత్తం | పురుషులు | మహిళలు |
| అదిలాబాద్ | 61.55 | 71.22 | 51.99 |
| నిజామాబాద్ | 62.25 | 72.66 | 52.33 |
| కరీంనగర్ | 64.87 | 74.72 | 55.18 |
| మెదక్ | 62.53 | 72.50 | 52.49 |
| హైదరాబాద్ | 80.96 | 83.35 | 78.42 |
| రంగారెడ్డి | 78.05 | 84.00 | 71.82 |
| మహబూబ్‌నగర్ | 56.06 | 66.27 | 45.65 |
| నల్గొండ | 65.05 | 74.93 | 55.05 |
| వరంగల్ | 66.16 | 75.91 | 56.45 |
| ఖమ్మం | 65.46 | 73.20 | 57.85 |
| శ్రీకాకుళం | 62.30 | 72.25 | 52.56 |
| విజయనగరం | 59.49 | 69.04 | 50.16 |
| విశాఖపట్టణం | 67.70 | 75.47 | 60.00 |
| తూర్పుగోదావరి | 71.35 | 74.91 | 67.82 |
| పశ్చిమగోదావరి | 74.32 | 77.63 | 71.05 |
| కృష్ణా | 74.37 | 79.13 | 69.62 |
| గుంటూరు | 67.99 | 75.40 | 60.64 |
| ప్రకాశం | 63.53 | 73.53 | 53.40 |
| నెల్లూరు | 69.15 | 75.93 | 62.30 |
| వైఎస్ఆర్ జిల్లా | 67.88 | 78.41 | 57.26 |
| కర్నూలు | 61.13 | 71.36 | 50.81 |
| అనంతపురం | 64.28 | 74.09 | 54.31 |
| చిత్తూరు | 72.36 | 81.15 | 63.65 |
| ఆంధ్రప్రదేశ్ మొత్తం | 67.66 | 75.56 | 56.74 |



## సాక్షర భారత్

దేశంలో అక్షరాస్యత పెంచడానికి సాక్షర భారత్ పథకాన్ని మన ప్రధాని అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం 8 సెప్టెంబర్, 2009న ప్రారంభించారు. వయోజన విద్యను ముఖ్యంగా మహిళల అక్షరాస్యతను మరింత ప్రోత్సహించి బలోపేతం చెయ్యడం దీని లక్ష్యం. నియత విద్యావకాశాన్ని పొందే అవకాశం కోల్పోయి అందుకు తగిన వయస్సు దాటిపోయి అక్షరాస్యత, ప్రాథమిక విద్య (నియత విద్యకు సమాన స్థాయి కలిగిన), వృత్తివిద్యా నైపుణ్యాలు, శారీరక మానసికాభివృద్ధి, ప్రయోగాత్మక కళలు, నిత్యజీవితంలో ఉపయోగపడే శాస్త్ర విజ్ఞానం, క్రీడలు మొదలైనవి ఏవైనా అభ్యసించాలనుకునే వయోజనులకు తగిన విద్యావకాశాలను విస్తరింపజేయడమే దీని ప్రధాన ఉద్దేశ్యం.

### సాక్షర భారత్ ఉద్దేశ్యాలు

- అక్షరాస్యత, సంఖ్యాపరిజ్ఞానం లేని వయోజనులకు ప్రయోజన అక్షరాస్యత అందించింది.
- నూతన అక్షరాస్యులు ప్రాథమిక అక్షరాస్యత స్థాయినిదాటి చదువు కొనసాగించి, నియత విద్యకు సమానాంతర విద్యను పొందడానికి అవకాశం కలించడం.
- నూతన అక్షరాస్యులు వారి సంపాదన, జీవనస్థితిగతులు మెరుగుపరుచుకోవడానికిగాను వారికి అవసరమైన వృత్తి నైపుణ్యాల కార్యక్రమాలు అందించడం.
- వయోజనులకు నూతన అక్షరాస్యులకు, ఇతర లబ్ధిదారులకు నిరంతరం విద్యా కార్యక్రమాలు అందజేయడం, తద్వారా అభ్యసన సమాజానికి తోడ్పడడం.

### సాక్షర భారత్ లక్ష్యాలు

15 సంవత్సరాలకు పైబడిన 7 కోట్ల మంది వయోజనులకు ప్రయోజన అక్షరాస్యత అందించడం ప్రధాన లక్ష్యం. వీరిలో 6 కోట్ల మంది మహిళలు కాగా 1 కోటి మంది పురుషులు. అక్షరాస్యతా స్థాయిలో దిగువన గల రాష్ట్రలలోని ఎస్.సి., ఎస్.టి., బలహీన వర్గాలు, గ్రామీణ ప్రాంతాల యువత ఈ పథకంలోని ఇతర లబ్ధిదారులు.

### నిర్దిష్ట విధానాల ద్వారా లక్ష్య సాధన

సాక్షర భారత్ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి ఆయా వర్గాలకు గాను నిర్దిష్ట విధానాలను రూపొందించు కుంది. ఇవి మహిళలు, ఎస్.సి., ఎస్.టి., ముస్లింలు మొదలైన వారికి వేరు వేరుగా ఉన్నాయి. సాక్షర భారత్‌లో మహిళలు ప్రధాన లబ్ధిదారులు. కనుక ఈ కార్యక్రమం ప్రతి అంశంలోను అంటే వాచకాల తయారీ, బోధన, నియంత్రణ, మూల్యాంకన నుండి విధానాల రూపకల్పన, యాజమాన్యం మొదలైన అన్ని అంశాలలోను మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. మహిళాకార్యకర్తలను, బోధకులను ఎక్కువగా ఈ కార్యక్రమంలో తీసుకోవడం జరుగుతుంది.

షెడ్యూల్డ్ కులాలు, జాతులు, అల్పసంఖ్యాక వర్గాలకు అక్షరాస్యతా స్థాయి పెంచేందుకు వారి వారి సాంఘిక ఆర్థిక పరిస్థితులను గణనలోకి తీసుకుంటారు. వీరికోసం ప్రత్యేక విధానాలు రూపొందించారు.

గ్రామీణ యువజనులకుగాను వారి వాస్తవ జీవిత అవసరాలకు అనుగుణంగా, ఉద్యోగార్హతలు, సర్టిఫికెట్లు అందించే కార్యక్రమాలు రూపొందిస్తారు. వారికి అనువుగా ఉండే శిక్షణ శిబిరాల నిర్వహణ అమలు చేస్తారు.

వివిధ ప్రాంతాలలోని అక్షరాస్యతల తేడాలను తగ్గించడం కూడా సాక్షర భారత్ లక్ష్యమే. దీనికి అనుగుణంగా అక్షరాస్యతా స్థాయి 50% అంతకన్నా తక్కువ గల జిల్లాలకు సాక్షర భారత్ కార్యక్రమం పరిమితం చేస్తారు.

అలాగే అత్యధిక నిరక్షరాస్యులు గ్రామీణ ప్రాంతం వారు కనుక గ్రామీణ ప్రాంతాలకు సాక్షర భారత్ అమలులో ముందుగా ప్రాధాన్యత



ఇస్తారు.

**సాక్షర భారత్ కొత్త విధానాలు**

- సాక్షర భారత్ కార్యక్రమాలను ప్రధానంగా పంచాయితీరాజ్ సంస్థల ద్వారా అమలు జరుపుతున్నారు.
- సాక్షర భారత్ కార్యక్రమంలో అక్షరాస్యత, ప్రాథమిక విద్య, నిరంతర విద్యా కార్యక్రమాలను ఒకదాని తరువాత ఒకటి కాకుండా, వాటిని ఏకకాలంలో నిర్వహిస్తారు.

**సాక్షర భారత్ ప్రధాన కార్యక్రమాలు**

సాక్షర భారత్ ద్వారా ప్రధానంగా నాలుగు విధాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. అవి:

- ప్రయోజన అక్షరాస్యతా కార్యక్రమాలు
- ప్రాథమిక విద్య / సమతుల్య కార్యక్రమాలు
- వృత్తి / ఉపాధి నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలు
- నిరంతర విద్యా కార్యక్రమాలు

## కార్యక్రమ నిర్వహణకు సంస్థాగత ఏర్పాట్లు

**1. వయోజన విద్యాకేంద్రం**

సాక్షర భారత్ కార్యక్రమాల నిర్వహణకు గ్రామ పంచాయితీ స్థాయిలో ఏర్పాటు చేసినది వయోజన విద్యా కేంద్రం (ఏ.ఇ.సి/ ఎల్.ఎస్.కె). దీనిని 5 వేల జనాభా కలిగిన ప్రతిగ్రామ పంచాయితీకి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రంలో సాక్షర భారత్ కార్యక్రమాలైన ప్రాథమిక విద్య (సమతుల్య కార్యక్రమాలు) కార్యక్రమాలు ఉపాధి వృత్తి నైపుణ్యాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహింపపడతాయి.

ఈ వయోజన విద్యాకేంద్రం లైబ్రరీగా, రీడింగ్ రూముగా, చర్చావేదికగా, సాంస్కృతిక కార్యక్రమాలకు, వినోద కార్యక్రమాలకు వేదికగా, సమాచార కేంద్రంగా ఉండి అబ్దిదారుల నిరంతర అవసరాలను కూడా తీరుస్తుంది.

ఈ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన సదుపాయాలన్నిటినీ కల్పిస్తారు. ఇందుకోసం ఇద్దరు పూర్తిస్థాయిలో పనిచేసే గ్రామ కోఆర్డినేటర్లు / ప్రేరక్‌ను నియమిస్తారు.






**2. అక్షరాస్యతా కేంద్రాలు**

ఇవి గ్రామస్థాయిలో నిరక్షరాస్య వయోజనులకు అక్షరాస్యత బోధనకుగాను ఏర్పాటు చేసిన కేంద్రాలు. వీటిలో ప్రతి పది అభ్యాసకులకు ఒక్కరు చొప్పున స్వచ్ఛంధ కార్యకర్తలు అక్షరాస్యతా బోధన చేస్తారు.

**రాష్ట్రంలో సాక్షర భారత్ అమలు**

రాష్ట్రంలో 18 జిల్లాలలో సాక్షర భారత్ అమలు జరుగుతుంది. మహిళా అక్షరాస్యత 50 శాతం కన్నా తక్కువ ఉండి నిరంతరం విద్యా కార్యక్రమం అమలు జరుగుతున్న జిల్లాల్లో ఈ కార్యక్రమం సెప్టెంబరు 8, 2010 నుండి ప్రారంచడం జరిగింది. అదిలాబాద్ జిల్లాలో అమలు జరుపడానికి ప్రణాళిక రూపొందించారు. మిగిలిన నాలుగు జిల్లాలలో - తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, హైదరాబాద్ మహిళా అక్షరాస్యత 50 శాతం కన్నా ఎక్కువ ఉన్నందున ఈ కార్యక్రమం ప్రారంభించలేదు.

సాక్షర భారత్ మార్గదర్శకాల ప్రకారం జిల్లా, మండల, గ్రామ పంచాయితీ స్థాయిలలో లోక్ శిక్షా సమితులను ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా ఆ కార్యక్రమం అమలు జరుగుచున్న అన్ని జిల్లాలలోను, మండల, గ్రామ కో-ఆర్డినేటర్ల ఎంపిక పూర్తి చేసి వారి సహాయంతో సర్వే నిర్వహించి, వయోజన విద్యా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో సుమారు 13.8 లక్షల మంది నిరక్షరాస్యులు చేరి చదువునేర్చుకుంటున్నారు.

సంపూర్ణ అక్షరాస్యత దేశ ఆర్థిక సామాజిక అభివృద్ధికి కీలకం. అక్షరాస్యత పురోగతిలోని విజయాలను, వైఫల్యాలను అంచనా వేసుకోవడానికి అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ఒక సందర్భం. ఈ సందర్భంలో సంపూర్ణ అక్షరాస్యత దిశలో ముందుకు కొనసాగడానికి కావలసిన విధానాలను రూపొందించుకుని ముందుకు సాగాలని ఆశిద్దాం.

**డా. సి. క్రిష్ణమోహనరావు**
**డిప్యూటీ డైరెక్టర్ (రీసెర్చ్ & ట్రైనింగ్స్), అపార్డ్**

# భారత దేశంలో గిరిజనాభివృద్ధి

## ఒక పరిచయం

**భారతదేశం 32.8 లక్షల చదరపు కి.మీ విస్తీర్ణంతో విభిన్న భౌగోళిక, శీతోష్ణ పరిస్థితులను కలిగి ఉంది. ఇందులో భాగంగా 21% అటవీ ప్రాంతం, భౌగోళికంగా కొండ ప్రాంతాలు విస్తరించి ఉన్నాయి. ఇటువంటి భౌగోళిక పరిస్థితులు మన దేశంలో ఉండటం వలన వివిధ గిరిజన తెగలకు చెందిన జనాభాను కూడా కలిగి ఉంది. 2001 జనాభా లెక్కల ప్రకారం మన జనాభాలో 8.4 కోట్ల గిరిజన జనాభా ఉంది. ఇది దేశ జనాభా లో 8.2% గా పేర్కొనవచ్చు.**

గిరిజనులు అంటే భారత రాజ్యాంగం ప్రకారం 342వ అధికరణంలో పేర్కొన్న తెగలు (ట్రైబ్స్) / తెగల సమూహాలు. 342వ అధికరణ ప్రకారం మన దేశంలో 533 గిరిజన తెగలు ఉన్నాయి. ఇవి మన దేశంలోని అన్ని ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి. ( హర్యానా, పంజాబ్, రాష్ట్రాలు మరియు ఢిల్లీ, చండీగర్, పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలలో గిరజనులు లేరు) అత్యధిగకంగా 62 తెగలు ఒరిస్సా రాష్ట్రంలో ఉన్నాయి.

మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒరిస్సా, గుజరాత్ రాష్ట్రాలలో దేశం జనాభాలో సగభాగం గిరిజన జనాభా ఉంది. 533 గిరిజన తెగలలో 75 తెగలను అత్యంత ఆదిమమైన తెగలుగా గుర్తించడం జరిగింది. వీటిని ఆదిమ గిరిజన తెగలు (పి.టి.జి.) అంటారు. ఈ తెగలు నేటికీ ఆదిమమైన వ్యవసాయ పద్ధతులు (పోడు వ్యావసాయం), వేటాడటం ద్వారా ఆహార సముపార్జన వంటి అలవాట్లతో జీవనం కొనసాగిస్తూ, తక్కువ జనాభాను కలిగి ఉండటం వీరి ప్రత్యేకత.

గ్రామీణ ప్రాంతంలో నివాసం ఉండటం, నిరక్షరాస్యత, ఆర్థిక సాంఘిక వెనుకబాటు తనం, వారి నివాస ప్రాంతాలు అటవీ ప్రాంతంలో ఉంటూ గిరిజనుల జీవనానికి అటవీ ప్రాంతానికి అవినాభావ సంబంధం ఉండటం, మౌళిక సదుపాయాలు లేకపోవటం, ఉన్నా అందరికీ అందుబాటులో లేకపోవటం, మానవాభివృద్ధి సూచికలో ముఖ్య రంగాలైన విద్య, ఆరోగ్యం, ఆదాయం (కొనుగోలు శక్తి) వంటి సూచికలో వెనుకబడి ఉండటం గిరిజన తెగలు సాధారణ లక్షణాలుగా పరిగణించవచ్చును.




అంతే కాకుండా ఈశాన్య భారత దేశంలో గల రాష్ట్రాలలో గల గిరిజనులపై ప్రత్యేక పరిపాలన కొరకు మన రాజ్యాంగంలో 6వ షెడ్యూల్ పొందుపర్చటం జరిగింది. మధ్య భారత దేశంలో గిరిజనులు ఎక్కువగా గల ప్రాంతాల పరిపాలన సౌలభ్యం కొరకు షెడ్యూల్ - 5 రాజ్యాంగంలో పొందుపర్చటం జరిగింది. షెడ్యూల్డ్ - 5 లో 9 రాష్ట్రాలలో గల గిరిజన ప్రాంతాలు ఉన్నాయి. (ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, జార్ఖండ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఒరిస్సా, రాజస్తాన్)

భారత్ రాజ్యాంగంలోని 244(1) ప్రకారం షెడ్యూల్డు ప్రాంతాల్ని నిర్వచించడం జరిగింది. దాని ప్రకారం భారత్ రాష్ట్రపతి, సంబంధిత రాష్ట్ర గవర్నర్ సంప్రదించడం ద్వారా క్రింది లక్షణాలు ఉన్న ప్రాంతాన్ని షెడ్యూల్ ప్రాంతంగా ప్రకటించవచ్చు.



1. అత్యధికంగా గిరిజన జనాభా కలిగి ఉండటం.
2. అనుకూలమైన ప్రాంతంగా విస్తీర్ణంగా ఉండటం.
3. పరిపాలనా సౌలభ్యంగా ఉంటూ ఒక జిల్లా, బ్లాక్, తాలూకాగా ఉండటం.
4. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతంగా ఉండటం (ప్రక్క ప్రాంతాలలో పోల్చినప్పుడు)

ఆంధ్రప్రదేశ్‌లో 35 గిరిజన తెగలు ఉన్నాయి. వీటి జనాభా 2001 జనాభా లెక్కల ప్రకారం 5024104 జనాభాలో 6.59%.

1. అంధ్, సాధు అంధ్
2. బగత
3. భిల్లు
4. చెంచు
5. గదబ, బోడో గదబ, గుటోబ్ గదబ, కల్లాయ్ కదబ, పారంగి గదబ, కతెర గదబ, కాపు కదబ




6. గోండ్, నాయక్‌పోడ్, రాజ్‌గోండ్, కోయితూర్
7. గౌడె
8. కొండ రెడ్లు
9. జతపన్
10. కమ్మర
11. కుట్టునాయకన్
12. కోలమ్, కోల్‌వార్
13. కొండ దొరలు, కుబి
14. కొండ కాపులు
15. కొండ రెడ్లు
16. కోంద్‌లు, కోడి, కోధు, దేసాయ కోంధులు, డొంగ్రియ, కుట్టుయ కోంధులు, టికిరియ కోంధులు, ఎనిటి కోంధులు, కువింగ
17. కొటియ, బెంతో ఒరియా, బార్తిక, దులియ, హోల్వా, సాన్‌రోనా, సిధోపాయకో
18. కోయ, డోలి కోయ, గుట్ట కోయ, కమ్మర కోయ, ముసార కోయ, ఒడ్డి కోయ, పట్టిడి కోయ, రాజ కోయ, రాశ కోయ, లింగధారి కోయ (సాధారణ), కొట్టుకోయ, బీనే కోయ, రాజ్ కోయ
19. కులియ
20. మాలీన్ (ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్ మరియు వరంగల్ జిల్లాల మినహా)
21. మన్న దొర
22. ముఖ దొర, నూక దొర
23. నాయక్‌లు
24. పర్ధాన్
25. పోర్జ, పరంగిపెర్జా
26. రెడ్డి దొరలు
27. రోన, రేన
28. సవరలు, కాపు సవరలు, మాలియ సవరలు, కుట్టో సవరలు
29. సుగాలీస్, లంబాడీ, బంజార
30. తోటి (ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్ మరియు వరంగల్ జిల్లాల్లో)
31. వాల్మికి (విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి మరియు పశ్చిమ గోదావరి జిల్లాలు)
32. యానాది, చెల్లా యానాది, కప్పల యానాది, మంచి యానాది, రెడ్డి యానాది.
33. ఎరుకుల, కొరచ, దబ్బ ఎరకుల, కుంచపురి ఎరుకుల, ఉప్పు ఎరుకుల
34. నక్కల, కురువికరన్
35. ధూలియ, పైకో, పుటియ (విశాఖపట్నం మరియు విజయనగరం జిల్లాలో)

## మన రాష్ట్రంలో గల ఆదిమ గిరిజన తెగలు - విస్తరణ జనాభా వివరాలు

| క్ర. సం. | జిల్లాలు | చెంచు | కొండ రెడ్లు | కొలమ్ | గదబ | పోర్జ | తోటి | కొండలు | సవర | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1. | శ్రీకాకుళం | 222 | 7 | 3 | 1054 | 1048 | - | 2511 | 92165 | 97010 |
| 2. | విజయనగరం | 85 | 8 | 4 | 19502 | 4 | - | 340 | 29005 | 48948 |
| 3. | విశాఖపట్నం | 278 | 632 | 7 | 15133 | 29550 | - | 81755 | 340 | 127695 |
| 4. | తూర్పు గోదావరి | 690 | 67793 | - | 331 | 1800 | - | 303 | 103 | 71020 |
| 5. | పశ్చిమ గోదావరి | 1452 | 6964 | - | 8 | - | - | 31 | 210 | 8665 |
| 6. | ఖమ్మం | 98 | 7252 | 4 | - | 36 | - | 1 | 3 | 7394 |
| 7. | వరంగల్ | 700 | 6 | - | 4 | - | 154 | 21 | - | 885 |
| 8. | ఆదిలాబాద్ | 892 | - | 45437 | 1 | 22 | 1043 | 81 | 13 | 47489 |
| 9. | మహబూబ్‌నగర్ | 8272 | - | - | - | 67 | - | 1 | 15 | 8355 |
| 10. | కృష్ణ | 1575 | 156 | - | 10 | 4 | - | 46 | 122 | 1913 |
| 11. | గుంటూర్ | 9791 | 31 | - | 11 | - | - | 7 | 129 | 9969 |
| 12. | ప్రకాశం | 10413 | 128 | - | - | - | - | 21 | 82 | 10644 |
| 13. | నెల్లూరు | 281 | 23 | - | 1 | - | - | 1 | 25 | 331 |
| 14. | చిత్తూరు | 64 | 43 | - | - | 28 | - | 3 | 62 | 200 |
| 15. | వై.ఎస్.ఆర్. కడప జిల్లా | 588 | - | - | - | - | - | - | - | 588 |
| 16. | అనంతపూర్ | 103 | - | - | 1 | - | - | 4 | 5 | 113 |
| 17. | కర్నూల్ | 7282 | - | - | - | - | - | 13 | 31 | 7326 |
| 18. | రంగారెడ్డి | 2706 | 17 | 24 | - | 60 | - | 72 | 507 | 3386 |
| 19. | హైదరాబాద్ | 40 | 18 | 42 | 2 | 19 | 21 | 17 | 39 | 198 |
| 20. | మెదక్ | 431 | 3 | 10 | 6 | - | 89 | - | 40 | 579 |
| 21. | నిజామాబాద్ | 482 | - | 29 | - | 22 | 281 | 19 | - | 833 |
| 22. | కరీంనగర్ | 1795 | 11 | 111 | - | 5 | 450 | 31 | 68 | 2471 |
| 23. | నల్గొండ | 992 | 4 | - | 14 | 4 | 36 | 46 | 15 | 1111 |
| | మొత్తం | 49232 | 83096 | 45671 | 36078 | 32669 | 2074 | 85324 | 122979 | 457123 |

Source: Census of India, 2001

మన రాష్ట్రంలో ఉన్న గిరిజన తెగలు షెడ్యూల్ ప్రాంతం, మైదాన ప్రాంతంలో కూడా నివాసం ఉంటున్నారు. మన రాష్ట్రంలో గల గిరిజన తెగలలో 8 ఆదిమ గిరిజన తెగలు ఉన్నాయి. అవి:

1. కొలామ్‌లు ( ఆదిలాబాద్ జిల్లా)
2. తోటి ( ఆదిలాబాద్ జిల్లా మరియు వరంగల్ )
3. కొండరెడ్లు ( ఖమ్మం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి)
4. చెంచులు ( నల్లమల అటవీ ప్రాంతం, మహబూబ్‌నగర్, కర్నూల్, ప్రకాశం, నల్గొండ)
5. కొందులు (పాడేరు - విశాఖపట్నం)
6. పోర్జ ( పాడేరు - విశాఖ మన్యం)
7. గదబ (విజయనగరం, శ్రీకాకుళం)
8. కొండ సవర (విజయనగరం, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల 35 గిరిజన తెగలు, అందులో ప్రధానంగా గల 8 ఆదిమ గిరిజన తెగల పరిచయం-వాటి అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను తర్వాత సంచికలో తెలుసుకుందాం.

**ఎ. సుభాష్ చంద్రగౌడ్**
**సీనియర్ ఫ్యాకల్టీ, డిప్యూటీ డైరెక్టర్ (అకౌంట్స్) ఎ.యం.ఆర్. - అపార్డ్**

# బొంపల్లి తండా - గ్రామీణ వన నర్సరీ



## ఓ విజయగాథ

**అదో కుగ్రామం... రంగారెడ్డి జిల్లా దోమ మండలంలో 'బంజారా' లని పిలువబడే గిరిజన తెగకు చెందిన సుమారు 60 నిరుపేద కుటుంబాలున్న ఆ తాండా పేరు బొంపల్లి తాండ! బొంపల్లి గ్రామ పంచాయితీకి అనుబంధంగా పరిగి పట్టణానికి 14 కి.మీ. దూరంలో, సామాజిక స్పృహకూ, చైతన్యానికి మరింత దూరంలో ఉంటూ - 'ఎవరో వస్తారని - ఏదో చేస్తారని' ఆ అభాగ్యులంతా అలా ఎదురు చూస్తున్న తరుణంలో...**

జనవరి 10వ తేది 2011వ సంవత్సరం, బొంపల్లి తాండలో ఓ నూతన అధ్యాయం మొదలైంది.!

జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం క్రింద, మహాత్మాగాంధీ గ్రామీణ వన నర్సరీలను పెంచే ప్రక్రియ అటవీ శాఖ చేపట్టింది. ప్రతి గ్రామ పంచాయితీ పరిధిలోనూ, అర్హులైన రైతు - లబ్దిదారులను గుర్తించి వారి పొలాల గట్ల మీద, వారికి నికరాదాయాన్నిచ్చే మొక్కలను నాటించి పర్యావరణానికి ఊపిరులూదే బాధ్యతను గ్రామీణాభివృద్ధి శాఖ భుజానకెత్తుకుంది! ఆ రెంటి శాఖల సమన్వయాన్ని, నిరుపేదలకు ఉపాధిని కల్పించే అభివృద్ధి పథకాలపై అటవీ శాఖ (సామాజిక వన విభాగం) ప్రజల్లో అవగాహన కలిగించింది. అంతే కాకుండా, జనవరి 10వ తేదీ నాడు జరిగిన జానపద "కళాజాత" ద్వారా తాండావాసులు చైతన్యవంతులైనారు. దారిద్ర్య రేఖ దిగువన జీవనం సాగిస్తున్న తాండా వాసులు మహాత్మాగాంధీ గ్రామీణ వన నర్సరీ పథకంవైపు అడుగులు వేసారు...

"ప్రారంభం శుభసూచికమైతే సగం పని పూర్తయినట్లే"నన్న చందాన తాండాలోని నిరుపేద రైతులు చర్చించుకొని తమకున్న సేద్యపు భూమిలో కొంత భాగాన్ని గ్రామీణ వన నర్సరీ పెంపకానికి కౌలుకిచ్చారు. కొద్దో గొప్పో చదువుకున్న ఉత్సాహవంతుడైన దేవ్లానాయక్ (26 సంవత్సరాలు) అనే యువకుడు గ్రామీణ వన నర్సరీ వన సేవకునిగా ముందుకు వచ్చాడు. తాను ఉపాధిని పొందటమేగాక, తనతోటి నిరుపేదలకు 'ఆలంబన' అయ్యాడు! తమ విధిరాతను తామే తిరగ





రాసుకొనేటందుకు వారంతా ఆనాడే అభివృద్ధికి "శ్రీకారం" చుట్టారు! అందరూ ఒక్కటై నడుం బిగించారు...

"కృషితో నాస్తి దుర్భిక్షం" అన్న స్ఫూర్తితో టేకు, కానుగ, సీతాఫలం, మునగ, ఉసిరి, గ్లైరిసీడియా వివిధ జాతులైన లక్ష మొక్కలను మొక్కవోని దీక్షతో పెంచిన వీరు, జీవనభృతిలో ఉపాధికూలీలు అయినప్పటికీ, కృషీవలురై చుట్టుప్రక్కల గ్రామాలకు ఆదర్శప్రాయులై నిలిచారు! "మహాత్మాగాంధీ బండ్ ప్లాంటేషన్" నిమిత్తం బొంపల్లి, శివారెడ్డి పల్లి, బాస్పల్లి, గూడూరు, దోర్నాలపల్లి గ్రామాలలోని ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్న కారు రైతుల కొరకు నాణ్యమైన మొక్కలను అనతి కాలంలోనే సంసిద్ధం చేయడం ఓ విశేషం!




రెక్కాడితే గాని డొక్కాడని దీనస్థితి ఒకప్పుడు వారిలో కొందరిది. తాండాలోని 5-6 కుటుంబాలు పొట్ట చేతబట్టుకొని మహారాష్ట్రలోని పూనా నగరానికి గతంలో వలసలు వెళ్ళేవి. అయితే, అటవీశాఖ చేపట్టిన గ్రామీణ వన నర్సరీ పథకం తమకు అన్ని విధాలా భద్రతను కల్గించి వలసలు వెళ్ళకుండా తమ గ్రామంలోనే కట్టిపడవేసిందని, శ్రీమతి పాట్లోతు భామినిబాయి ఇప్పుడు గర్వంగా చెపుతోంది. సంవత్సరంలో కనీస పని దినాలు 'వంద' రోజులు కాగా, దినసరి కూలీ రూ.100/- నుండి రూ.121/- వరకు పొందుతున్నామని హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒకరేమిటి, ఆబాలగోపాలం - అందరినోట ఇదేమాట. ఊరు ఊరంతా ఒక తాటి మీదే నడుస్తున్నారు ఈ సరిక్రొత్త బ్రతుకు బాటలో!!


వన నర్సరీ పథకం మొదలై అత్యల్ప కాలమే అయినప్పటికీ, దారిద్ర్య రేఖ దిగువన జీవనం సాగిస్తున్న ( 5-6) నిరుపేద కుటుంబాల అభివృద్ధికి అంకురార్పణ జరిగింది. మహాత్మాగాంధీ వన నర్సరీ పథకం మొదలైన తరువాత తాండాలోని నిరుపేద కుటుంబాలు మెరుగైన జీవనం సాగిస్తున్నారని అటవీ శాఖాధికారుల బృందం చేపట్టిన జూన్ 4వ తేదీ నాటి సర్వేలో తేలింది...!! బాపూజీ కలలు కన్న గ్రామీణాభివృద్ధియే లక్ష్యంగా, చేపట్టిన చిరు ప్రయత్నం మూడు పువ్వులు - ఆరు కాయలుగా ఫలించే రోజు ఇంకెంతో దూరంలో లేదని 'శస్త్రులు నిండిన సైనికుల్లా' అధికారులు కర్తవ్యోన్ముఖులై పురోగమిస్తున్నారు... పూటగడవని పేదోడికి పట్టెడన్నం పెట్టే అన్నదాతలైనారు - ఉపాధి హామీ పథకం చలవతో.

ఆత్మ సంతృప్తికి మించిన సంపద లేదన్న నానుడిని అక్షర సత్యం చేసిన వారంతా నేడు ఆస్తిపరులు. కూలీల జీవనోపాధికై అటవీ శాఖ (2086) పని దినాలను కల్పించగా, సద్వినియోగం చేసుకున్న 25 కుటుంబాలు, సరాసరి నెలకు 18 రోజులు పనిచేసుకుంటూ 'పౌష్టికాహారం' పై తమ అదనపు ఖర్చును నెలకు రూ. 400/- వరకు పెంచుకున్నారు. ఇంకా కాస్మటిక్స్, సెల్‌ఫోన్ లాంటి వినిమయ వస్తువులు వారి జీవన యానంలో చోటు చేసుకున్నాయి. వీటి కోసం నెలకు రూ. 200/- అదనంగా ఖర్చుచేసే స్థితికి ఎదిగారు. తమ రాబడిలో కొంత పొదుపు చేసుకొని తమ జీవనశైలిని మెరుగుపర్చుకున్నారు. ఉపాధి లేదన్న బాధపోయి ఉపశమనాన్ని పొందగల్గామని, అటవీశాఖ ద్వారా అమలు చేయబడిన ఉపాధి హామీ పథకం తమకు కొండంత అండగా ఉందని, బొంపల్లి తండా వాసులు గుండెల నిండా ఆనందం నింపుకొని, విజయ పథాన పురోగమిస్తున్నారు

**జి. నాగేశ్వరరావు**
**డి.ఎఫ్.ఓ., సోషల్ ఫారెస్ట్రీ, రంగారెడ్డి జిల్లా.**

# భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థతో గ్రామంలో రోగాలు మటుమాయం





**గ్రామాలను మురుగునీటి రహిత గ్రామాలుగా తీర్చి దిద్దడమే కాకుండా ప్రభుత్వానికి వేలకోట్ల రూపాయలు ఆదాచేయాలనే ఉద్దేశ్యంతో తక్కువ ఖర్చుతో భూగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థను (అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం) కరీంనగర్ జిల్లా ములకనూరు గ్రామ పంచాయితీలో సర్పంచ్ వడాల గౌతమ్ ప్రయోగాత్మకంగా చేపట్టారు. భూగర్భ మురుగునీటి వ్యవస్థ గ్రామంలో అందుబాటులోకి రావటంతో గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడటమేకాక, ప్రజల ఆరోగ్యం కూడా మెరుగయ్యింది.**

ప్రస్తుతం ప్రభుత్వం మురుగునీటి కాలువల నిర్మాణానికిగాను ఒక మీటరుకు రూ. 1333/- ఖర్చు చేస్తుండగా సర్పంచ్ పడాల గౌతమ్ అమలు చేసిన వినూత్న విధానంలో ఒక మీటరు భూగర్భ డ్రైనేజ్ నిర్మాణానికి రూ. 200/- ఖర్చు మాత్రమే అవుతుంది. ప్రభుత్వం ఓపెన్ డ్రెయిన్ గురించి ప్రస్తుతం చెల్లిస్తున్న ఒక మీటరు డబ్బులతోనే క్రొత్త పద్ధతిలో 6.66 మీటర్ల భూగర్భ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టవచ్చు.

**అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్ ద్వారా లాభాలు :**

1. మురుగునీరు భూమి లోపల పైపుల ద్వారా పారుదల అవుతుంది కాబట్టి మనకు బయటకు ఎలాంటి దుర్వాసన ఉండదు.
2. కాలువ భూమి లోపలనే ఉండటంతో ఈగలు, దోమల బెడద తగ్గిపోతుంది.
3. ఈగలు, దోమలు లేకపోవడంతో ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మనకు డాక్టర్లు, మందుల ఖర్చు కూడా ఆదా అవుతుంది.
4. భూగర్భ నీటి పారుదల పైపులు భూమి లోపలనే ఉండటంతో రోడ్ల వైశాల్యం తగ్గదు. రోడ్లు విశాలంగా ఉంటాయి.
5. పి.వి.సి. పైపుల ద్వారా కాలువ నిర్మాణం జరుపుతాము కాబట్టి తొందరగా కాలువల నిర్మాణం త్వరగా పూర్తి చేయవచ్చు.
6. సాధారణ మురుగు కాలువలలో కనీసం వారానికి ఒకసారైనా చెత్త తొలగించాల్సి వస్తుంది, చెత్త తొలగించిన మరునాడే తిరిగి చెత్తతో కాలువలు నిండిపోతాయి. పారిశుద్ధ్య పనివారికి చేసే వ్యయం ఎక్కువ.
7. భూగర్భ నీటి పారుదల పద్ధతిలో ప్రతి ఇంటి ముందు ఒక సిమెంటు డ్రమ్ము ఛాంబరుగా ఉంటుంది. కాబట్టి ప్రతి రెండు మూడు నెలలకు ఒక మారు సిమెంటు డ్రమ్ము నుండి (మట్టి చెత్త) తీస్తే సరిపోతుంది.
8. ఈ పద్ధతిలో పారిశుద్ధ్య పని వారికి పని భారం తగ్గుతుంది. ఓపెన్ కాలువలు ఉండవు కాబట్టి పారిశుద్ధ్య పని వారిని ఇతర పనులకు ఉపయోగించుకోవచ్చు.
9. పని దినాలు తగ్గటంతో గ్రామ పంచాయితీలకు లేబరుకు చెల్లించే డబ్బులు ఆదా అవుతాయి.

ఇట్టి సింపుల్ జనతా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టంను ప్రభుత్వం గుర్తించి గ్రామాలలో అనుమతించినట్లయితే గ్రామాలలో గ్రామ సర్పంచ్‌లు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టి గ్రామాలను మురికి వాడలు, వ్యాధులు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతారు.






200 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి సంబంధించిన ఖర్చులు ఈ క్రింది విధంగా ఉంటాయి.

| | |
|---|---|
| 1. 4" 100యం.యం. పి.వి. పైపులు ఏ 660 x 33 | 21780.00 |
| 2. 21 సిమెంటు డ్రమ్స్ ఏ 300 | 6300.00 |
| 3. 21 సిమెంటు డ్రమ్స్ మూతలు ఏ 100 | 2100.00 |
| 4. 200 మీటర్ల కందకం పైప్‌లైన్ గురించి ఏ 25 | 5000.00 |
| 5. 21 గుంతలు ఛాంబర్ గురించి ఏ 80/- | 1680.00 |
| 6. 2 బస్తాలు సిమెంట్ ఏ 200/- | 440.00 |
| 7. సుతార్ల కూలీలు | 2000.00 |
| 8. రవాణా ఛార్జీలు | 70.00 |

1. ప్రభుత్వం మురుగునీటి కాలువ నిర్మాణానికి మీటరుకు రూ. 1333/- చొప్పున 200 మీటర్లకు రూ. 2,66,600/- కేటాయించితే ఈ పద్ధతిలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ద్వారా మీటరకు రూ. 200/- చొప్పున 200 మీటర్లకు రూ. 40,000/- ఖర్చు అవుతున్నది. అంటే ఈ పద్ధతిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్ రూ. 2,26,600/- ఆదా అవుతుంది.
2. వాడలలో ఉండే ఇండ్ల సంఖ్యను బట్టి డ్రైనేజి పైపు సైజులో మార్పులు చేసుకోవచ్చు. సబ్ కాలువలకు తక్కువ వ్యాసం గల పైపులు మెయిన్ కాలువలకు ఎక్కువ వ్యాసం గల పైపులు వాడాల్సి ఉంటుంది. (పైప్ సైజు పెరిగినను నిర్మాణం వ్యయం తక్కువే ఉంటుంది)
3. కాలువ నిర్మాణం విలువ ఇండ్ల ముందు ఏర్పాటు చేసే సిమెంటు డ్రమ్ముల సంఖ్యను బట్టి హెచ్చు తగ్గులుంటుంది.




4. ప్రజల నివాసాల నుండి సిమెంటు డ్రమ్ములోనికి వచ్చు పి.వి.సి. పైప్ విలువను అంచనాలో చేర్చలేదు.

**గమనిక :** రెండు మూడు ఇండ్లకు కలిపి కూడా ఒక సిమెంటు డ్రమ్ ఏర్పాటు చేయవచ్చు. దీని ద్వారా నిర్మాణ వ్యయం ఇంకా తగ్గించవచ్చు.

## ముల్కనూర్ గ్రామంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేసిన విధానం

1. ముందుగా గృహ యజమాని ఇంటిలో మురుగునీరు బయటకు వచ్చు ప్రదేశంలో చిన్న ఛాంబర్ ( గల్లీ ట్రాప్) ఏర్పాటు చేసుకోవాలి.
2. గృహస్తులు వాడిన నీరు ముందుగా ఛాంబరులో చేరి అందులో నుండి జాలి బిగించిన 2" లేదా 2½" పి.వి.సి. పైపుల ద్వారా ఇంటి ముందు ఏర్పాటు చేసిన సిమెంటు డ్రమ్ములోనికి చేరుతుంది. తరువాత సిమెంటు డ్రమ్ములో ఏర్పాటు చేసిన 4" పి.వి.సి. పైపుల ద్వారా ఊరవతలికి చేరుతుంది.
3. పైపులు, సిమెంటు డ్రమ్ములు ఏర్పాటుకు ముందే గ్రామంలో మురుగునీరు బయటకు ఎక్కడకు చేరుస్తారో అక్కడ నుండి కాలువలు, సిమెంటు డ్రమ్ముల గురించి కందకాలు తీయించాలి.
4. వాటర్ లెవల్ పైప్ ద్వారా వీధుల ఎత్తు పల్లాలను గుర్తించుతూ మురుగునీరు పల్లంలోకి చేరే విధంగాపి.వి.సి. పైప్‌లు ఏర్పాటు చేయాలి.

సిమెంటు డ్రమ్ములు భూమిలో ఏర్పాటు చేసిన తరువాతనే పైప్‌లైన్ ఎత్తును బట్టి డ్రమ్‌లకు రంధ్రాలు ఏర్పాటు చేసుకోవాలి.

ఈ విధంగా భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నట్లయితే పారిశుద్ధ్య లేమి వల్ల సంక్రమించే కలరా, మలేరియా, డయేరియా, మెదడు వాపు వ్యాధి. రోగాల నుండి మన గ్రామాలు విముక్తి కాగల్గుతాయి.

**పడాల గౌతమ్**
**సర్పంచ్, ముల్కనూర్ గ్రామ పంచాయితీ**

# మానవత్వమా, ఏదీ నీ చిరునామా?

మురికి కాల్వలోనా?

చెత్త కుండీలోనా?

ముళ్ళ పొదలలోనా?

బస్టాండులోనా? రైల్వే స్టేషన్ లోనా?

అమ్మ తనాన్ని కమ్మగా హాయిగా ఆస్వాదించే మాతృమూర్తులందరికీ ఈ ప్రశ్నలు కోపాన్నీ, అసహ్యాన్నీ కలిగించవచ్చును. కాని ఈ మధ్య జరిగినటువంటి అనేక సంఘటనలను పరిశీలించినట్లయితే ఇది పచ్చి నిజమని ఒప్పుకొని తీరాలి. ఎందుకంటే ఆ మధ్య కాలంలో ఎక్కడ చూసినా పసి హృదయాల ఆక్రందనలే. తెల్లవారగానే మంచి కాఫీతో పాటు మనల్ని అనేక విషయాలు, వార్తలతో పలకరించే దినపత్రికలలో కూడా ఏదో ఒక మూల యింకా కళ్ళు కూడా సరిగా తెరవని పసికందుల దారుణ మరణాలు హృదయాలను కలిచి వేస్తున్నాయి. యిందులో ఎక్కువగా మన దృష్టికి వచ్చేవి ఆడశిశువుల మరణాలే! రోజూ ఏదో ఒక ప్రాంతంలో మురికి కాల్వల్లోనో, చెత్తకుండీల్లోనో, ముళ్ళ పొదల్లోనో లేదా బస్టాండుల్లోనో ఆడశిశువులు మృతదేహాలు గానో లేదా జంతువుల బారినపడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితుల్లోనో మనకు దర్శనమిస్తూ ఉన్నాయి. అదే పుట్టింది మగ శిశువు అయితే ఈ విధంగా ప్రవర్తించే వారా అనే ప్రశ్నకు సమాధానం అసలు వుంటుందా?

దీనికి కారణం ఎవరైనప్పటికీ, ప్రేరేపించిన పరిస్థితులు ఏవైననప్పటికీ ఒక మనిషిగా మరొక ప్రాణి ప్రాణాలను హరించే హక్కు ఎవరికీ లేదు. కనీసం మానవత్వం కూడా ఆ పసి ప్రాణాలను కాపాడటంలో విఫలమవుతున్నది. "ఆడదే ఆడదానికి శత్రువు" అనే నానుడిని వ్యతిరేకించే వారందరికీ ఇది గొడ్డలిపెట్టు. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలలో ఆడశిశువుల మరణాలను గురించి కనవించిన, వినిపించిన సంఘటనలు వారి వారి అభిప్రాయాలను మార్చుకొనే విధంగా వున్నాయి.

దేశంలో లేదా రాష్ట్రంలోని వివిధ గిరిజన తండాలలో పుట్టిన ఆడ శిశువులను విక్రయించే ఆచారం వుందంటే అది వారి అనాగరికతకు చిహ్నమనీ, వారిలో పరివర్తన తీసుకురావాల్సి వుందని భావించవచ్చును. కానీ నాగరిక సభ్య సమాజంలో పుట్టిన శిశువులను విసిరివేయటం, చంపి వేయటం ఏ నాగరికతకు చిహ్నంగా భావించాలి? ఇటువంటి సంఘటనలు వెనుకబడిన జిల్లాగా పేరుపొందిన మహబూబ్ నగర్ జిల్లాలో జరగటం మరింత బాధాకరం. ఆ జిల్లాలోని కల్వకుర్తి పరిసర ప్రాంతాలలో అయితే పుట్టిన ఆడపిల్లలను మురికి కాల్వల్లోకి, చెత్తకుండీల్లోకి విసిరి వేస్తున్న సంఘటనలు ఈ మధ్య చాలా వెలుగులోకి వచ్చాయి. అలా చేయడానికి ఏ పరిస్థితులు వారిని ప్రేరేపించాయో అనే అంశం మన ఊహకు అందనిది. ఇది అమ్మతనానికే మచ్చ. అదే పారవేసింది మగవారైతే, ఆ ఆడదే లేకపోతే తాను ఈ భూమి మీద జీవించి వుండే వాడుకాదనే విషయాన్నీ, ఒక అమ్మగా, భార్యగా, చెల్లిగా, అక్కగా తనకు తోడుండేది ఆడదే అనే విషయాన్నీ మరచిపోయి వుండాలి. వారు లేకుండా తన మనుగడ లేదనే విషయాన్నీ విస్మరించి వుండాలి. ఏది ఏమైనా బిడ్డ జన్మకు కారణమైనటువంటి స్త్రీ, పురుషులిరువురితోపాటు మానవాళి మొత్తం సిగ్గుతో తలదించుకోవాల్సిన అంశమిది.

వెన్నుపూసపై గడ్డతో, కాలు, చెయ్యి సరిగా పనిచేయని విధంగా జన్మించిన శిశువును నిర్లక్ష్యంగా ఆర్.టి.సి. బస్సులో వదిలి వెళ్ళిన ఉదంతం ఇటీవలి కాలంలో జరిగిన మరొక సంఘటన. సదరు బస్సు



శిశువును గాంధీ ఆసుపత్రికి తరలిస్తున్న కానిస్టేబుల్

### వైకల్యంతో పుట్టడమే పాపమా

రాంగోపాల్‌పేట: ముద్దుగా ఉన్న ఆ పాపను చూసి ఆ విధాతకు కూడా కన్నుకుట్టిందో ఏమో.. చేతికి, కాలికి వైకల్యం కల్పించాడు.. ఈ భారం మాకెందుకులే అని తల్లిదండ్రులు కన్న పేగు బంధాన్ని కాదనుకుని నిర్లక్ష్యంగా సిటీ బస్సులో విడిచిపెట్టారు. హృదయవిదారకమైన ఈఘటన శుక్రవారం రాణిగంజ్ డిపోలో చోటుచేసుకుంది. రాణిగంజ్-2 డిపోకు చెందిన సికింద్రాబాద్-ప్రశాంత్‌నగర్ రూటు 16డీ బస్సు మధ్యాహ్నం 2.30 డిపోనుంచి బయలుదేరింది. డ్రైవర్ సతీష్ బస్సును డిపో బయటకు తీసుకొచ్చి ఆపి డిపోలోకి వెళ్లాడు. కండక్టర్‌తో కలసి కాసేపటికి వచ్చిచూసేసరికి బస్సులో మూడ్రోజుల వయసు పసికందు కనిపించింది. పాపను రాంగోపాల్‌పేట పోలీసులకు అప్పగించారు. పోలీసులు గాంధీఆసుపత్రి వైద్యుల చేత పరీక్ష చేయించారు. అచిన్నారికి వెన్నుపై గడ్డ, చేతికి, కాలికి అంగవైకల్యం ఉందని వైద్యులు తెలిపారు. పాప న్యూరోఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంది.

డ్రైవరు, కండక్టరు ఆ శిశువును గమనించి పోలీసులకు తెలియజేయగా, పోలీసులు ఆ బిడ్డను (పాప) చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అదే మగబిడ్డ అయివుంటే ఆ విధంగా వదలివేసి వుండేవారా? ఎంత కష్టపడైనా సరే ఆ బిడ్డను బ్రతికించుకోవటానికి ప్రయత్నం చేసేవారు. కానీ ఆ బిడ్డ అమ్మాయి కాబట్టి విలువలేనిదని భావించి వదలివేసారు. మనుష్యుల ఆలోచనా తీరులో మార్పురానంత కాలం ఆడదాని విలువ ఇంతే!




## సంచిలో ఆడశిశువు

వరంగల్ జిల్లా కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్‌లో ఆది వారం ఆరు నెలల వయసున్న ఆడశిశువును సంచిలో పెట్టి వదిలి వెళ్లారు. ఏడుపు వినిపించడంతో సర్వేశం, రామరాజు అనే యువకులు గుర్తించి పోలీసులకు, 108కు సమాచారం అందించారు. వారు పాపను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఐసీడీఎస్‌కు చెందిన సిబ్బంది శిశువుకు చికిత్స చేయించి శిశు విహార్‌కు పంపడానికి ఏర్పాట్లు చేశారు. ఇటీవల కాజీపేట స్టేషన్‌లో ఐదేళ్ల పూజిత అనే బాలికను వదిలి పెట్టారు. ఇది మరిచిపోక ముందే ఈ సంఘటన జరగడం సంచలనం సృష్టించింది.

–న్యూస్‌టుడే, కాజీపేట

2011 జనాభా లెక్కల ప్రకారం స్త్రీ, పురుషుల నిష్పత్తిని పరిశీలించినట్లయితే 1000 మంది పురుషులకు 940 మంది మహిళలు మాత్రమే వున్నారు. ఈ మరణాలు మరికొంతకాలం ఇదే విధంగా కొనసాగినట్లయితే ప్రకృతి సమతుల్యం దెబ్బతినడమే కాకుండా నైతిక విలువలు సన్నగిల్లే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా మహిళలు, యువతులపట్ల జరిగే దౌర్జన్యాలు పెచ్చరిల్లి సమాజం అల్లకల్లోలం అయ్యే సూచనలు కూడా వున్నాయి. ఇప్పటికైనా ఈ పరిస్థితుల నుండి బయటపడి అభివృద్ధి దిశగా మరింత ముందుకు కొనసాగాలంటే ప్రభుత్వం చేసే కృషికి తోడు, ప్రజలు కూడా మహిళల రక్షణ కొరకై చేసిన చట్టాలు మరింత పటిష్టంగా అమలు జరిగేలా చూడాల్సిన అవసరం ఎంతైనా వుంది.

సభ్య సమాజంలో నివసించే ప్రతి ఒక్కరూ ఈ దురాచారాన్ని అరికట్టడానికి, తమవంతు కృషి చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావల్సిన అవసరం చాలా వుంది. ఇందుకు ఉదాహరణగా ఎక్కడైతే పుట్టిన ఆడశిశువులను అమానుషంగా చంపివేస్తున్నారో అదే జిల్లా అనగా 'మహబూబ్ నగర్' జిల్లా నుండే సమస్యకు పరిష్కారం కూడా వెదకబడింది. ఆ జిల్లాలో జరుగుతున్న అనేక శిశు మరణాల (ఆడ) ను గమనించి మహబూబ్‌నగర్ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖవారు ఆడ శిశువుల ప్రాణాలను కాపాడి వారికి జీవితాన్ని ప్రసాదించే దిశగా అడుగులు వేస్తూ "ఉయ్యాల" అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.




ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే తమకు పుట్టిన ఆడ శిశువులను పెంచటం ఇష్టంలేనివారు, పెంచి పోషించలేనివారు తమ శిశువులను స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన "ఉయ్యాల" లో వదలి వెళ్ళివచ్చును. ఈ విధంగా చేయటం ద్వారా కనీసం వారు జీవించి వుంటారు. ఈ విధంగా తమ వద్దకు చేరిన శిశువుల ఆలనాపాలనా చేసేందుకు ఆయాలను నియమించి, వారి సంరక్షణలో శిశువుల నవజీవితానికి బాట వేస్తున్నారు. అంతేకాకుండా బిడ్డలు లేని దంపతులెందరో యక్కడకు వచ్చి దరఖాస్తు చేసుకుని, శిశువులను దత్తత చేసుకుంటున్నారు. ఈ విధంగానైనా వారి జీవితం కొందరు మాతృమూర్తుల చేతుల్లో బంగారుమయమయ్యే అవకాశం వుంది.

ఇదే తరహాలో ప్రతి జిల్లాల్లోనూ ఈ విధమైన ఏర్పాట్లను చేసినట్లయితే ఎవరో ఒకరి దగ్గర ఆ శిశువులు ప్రతికి బట్టకట్టే అవకాశం వుంది. అంతే కాకుండా వారి హక్కులను, రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు "Right to Live" అనే హక్కును మనం కాపాడిన వారమవుతాం. కానీ వారిని హృదయ విదారకంగా చంపివేయటం అతి హేయం, మానవత్వమున్న ప్రతి ఒక్కరూ స్పందించవలసిన అంశం యిది. శిశువు జననానికి కారణమెవరైనా, కారణమేదైనా వారిని జీవించనివ్వటమే మన బాధ్యత. పుట్టిన పాపలను ఎక్కడో ఒక చోట పారవేసే ముందు లేదా వదలివేసే ముందు, తమతల్లిదండ్రులు కూడా తమ విషయంలో అలా ప్రవర్తించివుంటే ఏమయి ఉండేది అనే విషయాన్ని ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకోండి.....

**జి. సత్యవాణి**

ఫాకల్టీ, సి.డి.పి. & ఎ, ఎ.యమ్.ఆర్. - అపార్డ్.












# స్వయం సహాయక సంఘాల బ్యాంకింగ్ అవసరాల కోసం మహిళా ఆర్థిక సంస్థ - మహిళలకు రూ. వెయ్యికోట్ల రుణాలు

**కొత్తగా ఏర్పాటు చేస్తున్న మహిళా ఆర్థిక సంస్థ నుంచి తొలి సంవత్సరం రూ. వెయ్యి కోట్ల రుణాలను స్వయం సహాయక సంఘాల (ఎస్.ఎచ్.జీ.) మహిళలకు అందించే అవకాశ ముంది. పావలా వడ్డీకే అప్పులు అందించనున్నారు. రుణాలు అందచేయడంలో తొలి ప్రాధాన్యం అత్యంత పేదల (పీ.ఓపి) కే ఇవ్వాలన్న నిర్ణయానికి గ్రామీణాభివృద్ధి శాఖ వచ్చింది.**

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం ప్రతి జిల్లాలోను 20-30 వేల మంది పీఓపీ పరిధిలోకి వచ్చేవారు ఉన్నారు. ఇందులో బ్యాంకుల నుంచి ఇప్పటి దాకా కనీసం ఒక్క పైసా రుణం పొందని మహిళలు ఎందరో ఉండటంతో వీరికి ప్రత్యేక ఆర్థిక సంస్థ ద్వారా రుణాలు అందించి ఆర్థికంగా చేయూతనివ్వాలని గ్రామీణాభివృద్ధి సంకల్పించింది.

మహిళా ఆర్థిక సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం మూలధనం కింద రూ. 100 కోట్లు ఇస్తుంది. మండల మహిళా సమాఖ్యల ద్వారా రూ. 100 కోట్లను సేకరిస్తారు. దీంతో మూలధనం రూ. 200 కోట్లు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి మరో రూ. 100 కోట్లు మంజూరుకు ప్రయత్నం చేస్తానని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేష్ ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా హామీ ఇచ్చారు.

అయితే కేంద్రం ఇచ్చే మొత్తం కోసం ఎదురు చూడకుండా వివిధ సంస్థల నుంచి రూ. 800/- కోట్లు సమకూర్చుకునే ప్రయత్నాలను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే మొదలు పెట్టింది స్వయం సహాయక ఉద్యమానికి చేయూతనందించేందుకు జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధ బ్యాంకు (నాబార్డు) ముందుకు వచ్చింది. ఈ నేపధ్యంలోనే తొలి సంవత్సరమే రూ. వెయ్యి కోట్ల రుణం అందించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ■

# అదిగో పులి... ఇదిగో తోక...

సత్యాజీ

**ఏ ఇంట్లోనే గడియారం 'ఠంగ్... ఠంగ్...' మని మోగిన శబ్దానికి - ఉలిక్కిపడి లేచాడు చలపతి. వాచీ చూశాడు. ఒంటి గంట అయింది. చుట్టూ ఉన్నవాళ్లు గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. వాళ్లు వచ్చే టైం దగ్గరపడుతోంది. ఒక్కొక్కరినీ గట్టిగా పిలుస్తూ, తట్టిలేపాడు.**

**"ఎక్కడ? ఎక్కడ?" అని కంగారుపడుతూ, అందరినీ కంగారుపెడుతూ లేచాడు వీరభద్రం.**

**"వచ్చేశారా?" భయపడుతూ గుసగుసగా అడిగాడు చిట్టిబాబు.**

**"ఇంకా రాలేదు. వచ్చే టైమైయింది. అందరూ నిశ్శబ్దంగా ఉండండి. ఈ రోజు రహస్యమేమిటో తేలిపోతుంది. దెబ్బకి మన కాలనీకి, అసోసియేషన్‌కీ మంచిపేరు వచ్చేస్తోంది" అన్నాడు చలపతి.**

చలపతి ఆ కాలనీ ప్రెసిడెంటు. ఈ మధ్యనే ఎన్నికయ్యాడు. ఎన్నికైన దగ్గరనుంచి కాలనీ కోసం ఏదైనా చేసేయాలని తెగ తాపత్రయ పడిపోతున్నాడు. కానీ, కాలనీలో ఎవరి పని వారు చేసుకుంటున్నారు. ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. తననెవరూ రక్షించమనటం లేదు. సహాయం కోరటం లేదు. కాలనీ జనానికి ఏ మేలూ చేయకపోతే- ఎలా? అని తెగ చింతిస్తున్న సమయంలో చిట్టిబాబు నెమ్మదిగా మోసుకొచ్చాడు ఈ సంగతి!

తమ కాలనీలోనే, తాము ఉంటున్న అపార్టుమెంటుకి అవతలి వీధిలోనే - కొత్తగా ముగ్గురు కుర్రాళ్లు అద్దెకు దిగారు. వాళ్ల ప్రవర్తన, వాళ్ల రాకపోకలూ అన్నీ అనుమానాస్పదంగా ఉన్నాయి. టీవీల్లో వస్తున్న ప్రకటనలకూ, పత్రికల్లో వస్తున్న వార్తలకు లంకెపెట్టి చూస్తే - ఇదొక తేల్చుకోవల్సిన సంగతి అనిపించింది. ఆ రోజు నుంచి ఆ కుర్రాళ్ల రాకపోకల పై రెండు కళ్లూ పెట్టి గట్టి నిఘా ఉంచాడు. చిట్టిబాబు చెప్పినట్టే వాళ్ల తీరు అనుమానంగానే ఉంది. పగలంతా బయటికి కనిపించరు. తలుపులు బిడాయించుకొని ఉంటారు. మధ్యలో అరాకొరాగా కనిపించినా- వాళ్ల వ్యవహారమేమిటో అంతుపట్టటం లేదు.

విశాఖపట్నం వంటి నగరాలపైనా ఇటీవల కొన్ని ఉగ్రవాద సంస్థలు దృష్టి పెట్టాయని వార్తలొచ్చాయి. 'కొంపతీసి వీళ్లు అలాంటి వాళ్లు కాదు కదా! కాదు కదా అని వదిలేయడం ఎందుకు? ఈ రోజే లోగుట్టు బట్టబయలు చేసేయాలి' అనుకున్నాడు చలపతి.

వెంటనే తన కార్యవర్గంలోని మిగతావారిని రహస్యంగా సమావేశపర్చి, విషయం చెప్పాడు. ఈ రోజు రాత్రికే విషయం ఏమిటో తేల్చేద్దామని తీర్మానించుకున్నారు. అందరూ ఆ తీర్మానం ఫలితమే దాదాపు గంటన్నర నుంచి సెల్లారు కింద కాపలా.

"వాళ్లు వచ్చేసే టైమయింది. జాగ్రత్తగా ఉండండి. మనం గమనిస్తున్నట్టుగా తెలియకూడదు" అన్నాడు చలపతి. అందరూ అలర్టయి పోయారు. కాసేపట్లో బాంబు పేలబోతున్నట్టు బిగుసుకుపోయారు.

* * * * *

అప్పుడే ప్రింటయిన పత్రికను ఆత్రంగా తిరగేసి, తాము పెట్టిన వార్తలు, ఫొటోలూ ఎలా వచ్చాయో చూసుకున్నాడు గోపాల్. అతడు 'నేటి నిజం' పత్రికలో సీనియర్ సబ్ ఎడిటర్. జిల్లా పేజీలను తీర్చిదిద్దే బాధ్యత తనదే. ఆ రాత్రికి రాత్రి ప్రింటయిన పత్రికను కళ్లారా చూస్తే గానీ అతడికి సంతృప్తి ఉండదు. అందుకనే డ్యూటీ టైం అయిపోయాక కూడా గంట పాటు నిరీక్షించి, ప్రింటైన పేపరు చూస్తాడు. సబ్ ఎడిటర్ రామకృష్ణ అప్పటిదాకా కంప్యూటరు టేబుల్‌పై కునికిపాట్లు పడుతూ ఉంటాడు. ఈ ఇద్దరూ, టీవీ లెవెన్ విలేకరి భగవాన్ గురుద్వార్ దగ్గర్లోని శాంతినగర్‌లో ఒకే గదిలో ఉంటున్నారు. బ్యాచిలర్లు కావడం వల్ల, జర్నలిజమంటే అమితమైన ఆసక్తి ఉండడంవల్లా తినడం, పడుకోవడం తప్ప మిగిలినా టైమంతా వృత్తికే కేటాయిస్తారు.


గోపాల్ బైకను స్టార్టు చేశాడు. రామకృష్ణ నిద్రమత్తుతోనే వెనకన కూర్చున్నాడు.

ఇరవై నిమిషాల్లో గురుద్వార్ చేరి, శాంతినగర్ రెండో వీధిలోకి ప్రవేశించారు.

* * * * *

"అదిగో వచ్చేస్తున్నారు. జాగ్రత్త" అందర్నీ అలెర్ట్ చేశాడు చలపతి.

"ఒంటి గంటా 45 అయింది. ఇప్పటిదాకా ఏమేం చేసి వస్తున్నారో!"



కన్సొలేషన్ బహుమతి పొందిన హాస్య కథ



Sthanka_BW Sept.indd 20 02/09/11 3:19 PM

"ఏం చేసినా ఈ రోజుతో ఆటకట్టు".

"అదిగో వీధి చివరికి వెళ్లిపోయారు. మలుపు తిరిగారు. బండిని ఆపి దిగుతున్నట్టున్నారు" రన్నింగ్ కామెంటరీలా చెప్పుకుపోతున్నాడు చిట్టిబాబు.

"పదండి ముందుకు... పదండి తోసుకు..." పిలుపు నిచ్చాడు చలపతి.

అందరూ బయలు దేరారు. కొందరి చేతిలో కర్రలు ఉన్నాయి.

* * * * *

అప్పటికే ఆ ఇద్దరూ లోపలకి వెళ్లిపోయి, గదికి గడియపెట్టేశారు. లైటు వేశారు. లోపల పడుకొని ఉన్న టీవీ లెవెన్ విలేకరి భగవాన్ నిద్రలేశాడు.

గోపాల్ చేతిలోని పేపరు అందుకున్నాడు.

ఈలోగా చలపతి అండ్ టీమ్ అక్కడికి చేరుకుంది.

చిట్టిబాబు ఎందుకైనా మంచిదని ఆ గదికి బయట గడియపెట్టేశాడు

"ఎవరో, ఈ అర్ధరాత్రి రాకపోకలు ఏమిటో వివరాలు అడుగుదాం" అన్నాడు చలపతి గుసగుసగా.

"అలాగే కానిద్దాం" అన్నారు అందరూ. తలుపు తట్టబోయాడు వీరభద్రం. లోపలినుంచి మాటలు వినిపించి, ఆగిపోయాడు.

"ఇక ఈ లాడెన్ దొరకడు. ఇదిగో పట్టేశాం అంటాది అమెరికా. మళ్లీ అజాపజా ఉండదు" అన్నాడు భగవాన్. పేపర్లో ఓ వార్తను చూస్తూ.

"అందరికీ జోస్యం చెప్పే బల్లి కుడితిలో పడ్డట్టు ఉంది అమెరికా పరిస్థితి. ప్రపంచాన్నే రక్షించేస్తానంటాది. తన గుండెపై తన్నిన లాడెన్ జాడను కూడా కనిపెట్టలేదు.' అన్నాడు గోపాల్.

బయటికి ఆ మాటలు చాలా స్పష్టంగా వినబడుతున్నాయ్.

"అమ్మమ్మో... వీళ్లు సామాన్యమైన వాళ్లు కాదు. అంతర్జాతీయ స్థాయి ఉగ్రవాదుల్లా ఉన్నారు" అన్నాడు చిట్టిబాబు భయంగా.

"ఏ స్థాయో అడిగేద్దాం... పిలిచి..." అని తలుపు తట్టబోయాడు వీరభద్రం.

"నీకు తల పనిచేయడం లేదా? వాళ్ల దగ్గర తుపాకులూ, బాంబులూ ఉంటాయి" అన్నాడు చిట్టిబాబు.

అంతే! వెనక ఉన్నవారంతా ఒక్క క్షణంలో వీధిలోకి వెళ్లిపోయారు. ఏం చేయాలో తోచలేదు చలపతికి. పోలీసులకు, మీడియాకు సమాచారం ఇస్తే... మెరుపులా మెరిసింది ఆలోచన. దెబ్బకి కాలనీలోనే కాదు, నగరంలోనే తన పేరు మార్మోగిపోతుందనుకున్నాడు.

లోపల ఇంకా ఏం మాట్లాడుకుంటున్నారో విని రమ్మని చిట్టిబాబుని పురమాయించాడు. అతడు భయపడుతూనే తలుపు దగ్గరికి వెళ్లి, పెట్టి ఉన్న గడియను గట్టిగా పట్టుకొని చెవి అనించాడు.

ఛత్తీస్‌ఘడ్‌లో మందుపాతర పేలుడు గురించి మాట్లాడుతున్నాడు భగవాన్.

"నరమేధంతో వీళ్లేం సాధిస్తున్నారో అర్థం కావటం లేదు. అంతా ధ్వంసం చేసేస్తున్నారు" అంటున్నాడు ఆవేదనతో.

చిట్టిబాబుకి ఆ ఆవేదన గురించి పట్టలేదు. లోపల ఉన్నవాళ్లు ఉగ్రవాదులు అన్న ఆలోచనే అతడిని కమ్మేసి ఉంది. మందుపాతర, మావోయిస్టులు అన్న మాటలు మాత్రమే స్పష్టంగా చెవికెక్కి, మిగతా కథను అల్లుకున్నాడు.

పరుగెత్తుకొచ్చి, "వాళ్లు అంతర్జాతీయ విషయాలే కాదు, జాతీయ విషయాల్లోనూ తలదూర్చుతున్నారు" అని మందుపాతర సంగతి చిలువలు పలవలుగా చెప్పాడు.

ఈ లోగా వీధిలో కాలనీ ప్రెసిడెంటు గారూ, ఇతర సభ్యులూ ఉన్నారని ఎవరో గమనించి, ఇంకెవరికో చేరవేయడంతో... ఆ వార్త క్రమంగా అందరికీ పాకి, నెమ్మదినెమ్మదిగా జనం పోగవసాగారు. చలపతి నేరుగా పోలీసు కమీషనర్‌కి, మీడియా ప్రతినిధులకు ఫోను చేసి, విషయమంతా పూస గుచ్చినట్టు చెప్పాడు.

ఆ మరుక్షణం నుంచే టీవీ ఛానెళ్లలో స్క్రోలింగులు మొదలయ్యాయి. పోలీసు అధికారులకు విలేకరుల నుంచి వరుస పెట్టి ఫోన్లు వెళ్లాయి. ఆ అర్ధరాత్రి పూట మేల్కొని పాటలు తిలకిస్తున్న ఏ కొందరికో, 'నగరంలో ఉగ్రవాదుల స్థావరం' అన్న స్క్రోలింగు తారసపడడం, వాళ్లు పడుకున్న వాళ్లను నిద్రలేపి మరీ ఈ వార్త చెప్పటం జరిగిపోయింది.

నగరం హడావిడిగా మేల్కొవడం మొదలైంది. 'ఉగ్రవాద కోరల్లో విశాఖ', 'విశాఖకు అర్ధరాత్రి ఆపద', 'పేలుళ్లకు విశాఖ ప్రణాళిక', 'ఈ రాత్రి ఎలా గడుస్తుందో... విశాఖ ప్రజలు గజగజ' అన్ని శీర్షికలతో టీవీ ఛానెళ్లు వార్తలివ్వడం ప్రారంభించాయి.

శాంతినగర్ రెండో వీధి పూర్తిగా జనంతో నిండిపోయింది.

టీవీ ఛానెళ్ల ఓబి వ్యానులు ప్రత్యక్ష ప్రచారాలను సిద్ధమవుతున్నాయి.

సెల్ మోగడంతో దానివైపు చూసిన టీవీ లెవెన్ విలేకరి భగవాన్, ఆ చేస్తున్నది హైదరాబాద్ నుంచి తమ న్యూస్ హెడ్డు అని అర్థమై అలెర్టయ్యారు.

ఫోను ఎత్తేసరికి చీవాట్లు మొదలయ్యాయి.

"ఏం చేస్తున్నావయ్యా... మిగిలిన ఛానెళ్లు అంత హడివిడి చేస్తుంటే హాయిగా నిద్దరోతున్నావా? అరగంట నుంచి ట్రై చేస్తుంటే ఇప్పుడు దొరికావ్..." అని గయ్‌మన్నాడు.

"సార్... ఈ రూంలో సిగ్నల్స్ సరిగ్గా అందవు. విషయం ఇప్పుడే తెలిసింది. స్పాట్‌కి వెళుతున్నాను. దారిలో ఉన్నాను' అన్నాడు భగవాన్. అలా చెబితేనే గానీ, న్యూస్‌బాసులు శాంతించరని అతడికి అనుభవం.

"ఐదు నిమిషాల్లో రిలే ప్రారంభం కావాలి" అని హెచ్చరించి ఫోను పెట్టేశాడు హెడ్.

భగవాన్ రెడీ అవుతూనే టీవీ ఆన్ చేశాడు.

"ఏం జరిగింది?" అని మరో టీవీ ఛానెల్ మిత్రుడికి ఫోను చేశాడు.

టీవీ లెవెన్ తప్ప మిగతా టీవీల్లో ప్రత్యక్ష ప్రచారాలు మొదలయ్యాయి.

కాలనీ ప్రెసిడెంటు చలపతి, చిట్టిబాబు, వీరభద్రం తదితరులు అన్ని ఛానెళ్లలోనూ కనిపిస్తున్నారు. ఉగ్రవాదులను తాము ఎలా కనిపెట్టింది. తలుపు గొళ్లెం వేసి, పోలీసులకు, మీడియాకు ఎలా సమాచారం అందించింది వర్ణించి వివరిస్తున్నారు.

పోలీసులు అప్పటికే పెద్దఎత్తున చేరుకున్నారు. ముందుజాగ్రత్తగా



Sthanka_BW Sept.indd 21 02/09/11 3:19 PM

ఆ ఇంటికి చుట్టుపక్కల ఉన్నవారిని దూరంగా తరలించారు. ఆ ఇంటి చుట్టుపక్కలకు ఎవరూ వెళ్లరాదని నగర కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ దృశ్యాలన్నీ టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం అవుతున్నాయి.

ఇంతలో టీవీ 22 బ్రేకింగు న్యూస్ అంటూ చెప్పడం మొదలెట్టింది.

విలేకరి దేవదాస్ మాట్లాడుతున్నాడు : 'విశాఖ నగరానికి మహాముప్పు పొంచి ఉంది. ఉగ్రవాదులు ఏకంగా ఇక్కడే తిష్ట వేసి, విధ్వంస రచనకు ఉపక్రమించారు. ఉగ్రవాదులు  ఉన్న భవనాన్ని మీరిప్పుడు చూడబోతున్నారు. పోలీసులు చుట్టూ మోహరించి ఉన్న సమయంలో, సాధారణ మనుషులు ఏ ఒక్కరూ ఇక్కడికి రావటానికి సాహసించని తరుణంలో టీవీ 22 అన్ని వలయాలను ఛేదించుకొని ఇక్కడికి చేరుకుంది. ఇదిగో... ఇదే ఉగ్రవాదులు నివసిస్తున్న భవనం' అంటూ ఆ ఇంటిని చూపిస్తున్నారు.

టీవీలో ఈ దృశ్యాన్ని చూస్తున్న గోపాల్ గుండె గుభేలు మంది.

అది తాము ఉంటున్న భవనమే!

"ఇదేంటి... మనం ఉంటున్న వీధిలో ఉగ్రవాదులు ఉన్నారా? ఆశ్చర్యంగా ఉందే!" అన్నాడు.

అప్పటికే  కెమెరాతో సహా సిద్ధమైన టీవీ లెవెన్ విలేకరి భగవాన్‌కి ఆశ్చర్యం కొంచెం, మెరుపులాంటి ఆలోచన ఎక్కువగానూ కలిగాయి.

"తొలి వార్త ఇవ్వడం ఎలాగూ మిస్సయ్యాం.  ఉదయం రివ్యూలో చీవాట్లు తినకుండా ఉండాలంటే మిగిలిన ఛానెళ్లు అన్నింటినీ బ్రేక్ చేయాలి" అని ప్లాను చేయడం మొదలెట్టాడు.

"గోపాల్... మనం కాక ఈ ఇంట్లో ఇంకా ఎవరైనా బ్యాచిలర్స్ ఉంటున్నారా?" అని అడిగాడు.

"ఇది మూడు అంతస్తుల భవనం. పైన ఎవరైనా ఉంటున్నారేమో తెలియదు" అని చెబుతూనే "ఇంతకీ మనం ఇక్కడినుంచి బయటపడడం ఎలా?" అని అడిగాడు గోపాల్.

"సిపికి ఫోన్ చెయ్..." అన్నాడు రామకృష్ణ భయంగా.

టీవీలో వార్త విని, అతడి నిద్రమత్తు ఎప్పుడో వదిలిపోయింది. "సరే.. మీరు బయటికి వెళ్లిపోండి. నేను వాళ్లు ఉంటున్న పై అంతస్తుకు వెళతాను. వాళ్ల గదినీ, వీలైతే - వాళ్లను షూట్ చేస్తాను" అన్నాడు భగవాన్.

హెడ్మ నుంచి మళ్లీ ఫోనొచ్చింది.

అవతలినుంచి అక్షింతలు మొదలవ్వకముందే చెప్పాడు భగవాన్.

"సార్... కొద్దిసేపట్లో ఎక్స్‌క్లూజివ్ ఇవ్వబోతున్నాను. నేరుగా వాళ్లగదికే వెళుతున్నాను".

"వెరీ గుడ్..." అని హుషారుగా ఫోను పెట్టేశాడు హెడ్మ.

ఆ మరుక్షణం నుంచే టీవీ లెవెన్‌లో - 'కొద్దిసేపట్లో ఎక్స్‌క్లూజివ్ దృశ్యాలు చూస్తారు' అంటూ ప్రకటన ఇవ్వడం ప్రారంభించారు.

భగవాన్ ఆ గదికి ఉన్న వెనక తలుపు తీసి, బయటికి చూశాడు.

తుపాకులు ఎక్కుపెట్టి కమెండోల్లాంటి పదిమంది పోలీసులు కనిపించారు. ఎప్పుడూ లేనిదీ భయం వేసింది. 'పొరపాటున పోలీసులో, ఉగ్రవాదులో తనను...' అని మనసులో అనుకోగానే గుండె జలదరించింది. తిరిగి గదిలోకి వచ్చాడు. ఏమైనా తాను తలపెట్టిన సాహసం వదలకూడదని నిశ్చయించుకున్నాడు. అయితే, తాను ఆ పనిలో ఉన్నట్టుగా, ఇదే భవనంలో ఉన్నట్టుగా పోలీసులకు తెలిస్తే మంచిది అనుకున్నాడు.

పోలీస్ కమీషనర్ అరవింద్‌కు ఫోను చేస్తూ, తమ పోటీ ఛానెల్ 22ని పెట్టాడు.

"ఇప్పుడే ఒక ఉగ్రవాది గది వెనక నుంచి బయటికి వచ్చే ప్రయత్నం చేశాడు. బయట పోలీసులు పెద్దఎత్తున మోహరించి ఉండడంతో వెనకడుగు వేశాడు. ఎలాంటి దాడి చేయాలన్న దానిపై ఉగ్రవాదులు లోపల వ్యూహరచన చేస్తున్నట్టుగా పోలీసులు భావిస్తున్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవటానికి తాము సిద్ధంగా ఉన్నామని నగర పోలీసు కమీషనర్ అరవింద్ చెప్పారు. ఇంకొద్దిసేపట్లో భీకరమైన పోరాటం ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి' అంటూ ఒకే వార్తను పదే పదే ఇస్తోంది.

భగవాన్‌కి పరిస్థితి అర్థమైంది.

తననే ఉగ్రవాదిగా అనుమానించి, ఈ వార్త ఇచ్చారు. ఒళ్లంతా భయం కమ్ముకొంది.

ఒకవేళ కాల్పులు మొదలైతే...?

తాము ఎంత ప్రమాదంలో ఉన్నామో అర్థమైంది.

గోపాల్, రామకృష్ణ ఇంకా గదిలోనే ఉన్నారు. బయటకు ఎలా వెళ్లాలా? అని ఆలోచిస్తున్నారు. రామకృష్ణ గది కిటికీ కొద్ధిగా తెరిచి చూశాడు. చాలా దగ్గరగా పోలీసులు కనిపించారు. మామూలు సమయంలో అయితే భయం కలిగేది కాదు. కానీ, ఆ సమయంలో వాళ్ల చేతుల్లోని తుపాకులు తమవైపే ఎక్కుపెట్టినట్టు అనిపించి, వెంటనే మిత్రుల దగ్గరికి వచ్చేశాడు.

"భగవాన్... నాకు చాలా భయంగా ఉంది. అసలు ఉగ్రవాదులు పైన ఎవరైనా ఉన్నారో లేదో! నువ్వు వెంటనే సిపి గారికి ఫోను చెయ్" అని కంగారు పెట్టాడు.

భగవాన్ కూడా అదే ఆలోచనలో ఉన్నాడు. కాసేపు ట్రై చేస్తే సిపి దొరికారు.

తాము లోపల చిక్కుకొని ఉన్న సంగతి చెప్పాడు.

పోలీస్ కమీషనర్ అరవింద్‌కి విషయం నెమ్మదిగా అర్థమైంది. కాలనీ ప్రెసిడెంటు చలపతి అండ్ టీమ్‌ని పిలిచి మళ్లీ మాట్లాడారు. అప్పటికి ఏం జరిగిందో పూర్తిగా అవగతమైంది.

తానే స్వయంగా వెళ్లి గదిలోపల ఉన్న భగవాన్‌కి, గోపాల్, రామకృష్ణలను బయటికి తీసుకొచ్చారు. తరువాత ఎందుకైనా మంచిదని పోలీసులను పైకి పంపి భవనమంతా గాలించారు. ఎక్కడా ఉగ్రవాదుల జాడలేదు.

టీవీ ఛానెళ్లలో అప్పటికీ ఉగ్రవాదుల హోరు కొనసాగుతూనే ఉంది.

విలేకరులను సమావేశపరిచి, విషయం అంతా చెప్పేసరికి కొందరు నవ్వుకున్నారు.

ఇంకొందరు లోలోపల బాధపడ్డారు ఏదో జరగాల్సింది జరగలేదన్నట్టు.

ఇప్పుడు టీవీ చానెళ్లలో ముగింపుగా ఎవరు ఎలాంటి బ్రేకింగ్ న్యూస్ ఇస్తారోనని నగర పోలీస్ కమీషనర్ అరవింద్ ఆసక్తిగా చూస్తూ కూర్చున్నాడు. ◆



Sthanka_BW Sept.indd 22 02/09/11 3:19 PM

**'తిండి గలిగితె కండగలదోయ్. కండగలవాడేను మనిషోయ్'**

**అంటూ దేశ స్వాతంత్ర్య సంపాదన తర్వాత దానిని పదిలంగా పెంచేందుకు బలవంతులైన ప్రజలు కావాలని ఎలుగెత్తి చాటిన ప్రజాకవి గురజాడ అప్పారావు.**

జాతీయోద్యమ వైతాళికుడు లోకమాన్య బాలగంగాధర తిలక్, భారతీయులను స్వాతంత్ర్య సమరంలో చేరమని ఉద్బోధించేవారు. 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనే మంత్రోపదేశంతో యువతను ఉత్తేజపరిచేవారు. ఆ మహనీయుని ఆదేశాలను ఆచరణలో చూపాలని, అవిశ్రాంతంగా కృషి చేసిన ఆంధ్ర వీర కంఠీరవ కోడి రామమూర్తి నాయుడు.

# తిలక్, మాలవ్యాల ప్రశంసలు పొందిన 'కలియుగ భీముడు'

## కోడి రామమూర్తి నాయుడు



'కలియుగ భీమ' బిరుదు గల కోడి రామమూర్తినాయుడు విశాఖపట్నం జిల్లా వీరఘట్టంలో 1882, ఏప్రిల్‌లో జన్మించారు. తండ్రి కోడి వెంకన్న భూకామందు, ఆంగ్లేయుల పట్ల భక్తిశ్రద్ధలు కలవాడు. తన కుమారుడు ప్రభుత్వోద్యోగంలో చేరి, మంచి పదవినందుకోవాలని ఆశించాడు. కాని ఆయన అనుకున్నదొకటి, జరిగింది మరొకటి.


బాల్యంలోనే తల్లిని కోల్పోయిన కోడి రామమూర్తి అయిదేళ్ళ ప్రాయంలోనే ఇరుగు పొరుగు వారితో చిలిపి జగడాలాడేవాడు. తండ్రిగారు కుమారుని అల్లరి పనులు సహింపలేకపోయారు. వెంకన్నగారు, తన తమ్ముడు కోడి నారాయణస్వామి (పోలీస్ ఇన్‌స్పెక్టర్) వద్దకు కొడుకును, చదువు కోసం విజయనగరం పంపాడు.

రామమూర్తినాయుడు జాతీయోద్యమ నాయకుడు ద్వార బంధాల చంద్రయ్య నాయుడుగారి పట్ల ఆకర్షితుడయ్యాడు. చంద్రయ్య కోయ యువకుల దండును నెలకొల్పి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం సాగించాడు. చంద్రయ్యను పట్టి ఇచ్చిన వారికి వేలాది రూపాయలు బహుమతి ప్రకటించింది ప్రభుత్వం.

బలరామమూర్తినాయుడు చదువుల పట్ల శ్రద్ధ చూపలేకపోయాడు. తండ్రికి కోపం వచ్చి బాగా వాయించాడు. రామమూర్తి ఇల్లు వదలి అడవులు చేరాడు. వారం రోజుల తర్వాత ఒక పులి పిల్లను పట్టుకొని, విజయనగరం వీధుల్లో తిరుగుతున్న రామమూర్తి నాయుడును చూచి అందరూ ఆశ్చర్యచకితులయ్యారు. విజయనగరంలో ఉన్నపుడు తాలిమ్‌ఖాన్‌లో చేరి, శరీర వ్యాయామం అభ్యసించాడు. కుస్తీ పట్లన్నీ నేర్చాడు.

ఇక లాభంలేదని, పినతండ్రి కోడి నారాయణస్వామి, రామమూర్తిని సైదాపేట (మద్రాసు)లోని వ్యాయామ శిక్షణ కళాశాలకు పంపాడు. ఏడాది శిక్షణ తర్వాత వ్యాయామోపాధ్యాయుడుగా సర్టిఫికెట్ అందుకొని, విజయనగరంలో తాను చదివిన హైస్కూలులో వ్యాయామ శిక్షకుడుగా చేరాడు.

విజయనగరంలో పొట్టి పంతులు అనే మిత్రుని సహకారంతో సర్కస్ కంపెనీ నెలకొల్పాడు. తని రాజాగారి నుండి సంపూర్ణ సహకారం లభించింది. రామమూర్తి సర్కస్ సంస్థ పలుచోట్ల ప్రదర్శనలిచ్చి మంచిపేరు తెచ్చుకున్నది.




తెలుగు జిల్లాల్లో ప్రదర్శనల తర్వాత 1912లో మద్రాసు చేరాడు. పులులు, ఏనుగులు, గుర్రాలు, చైనా, జపాన్ కళాకారుల సహకారం ఆయనకు లభించాయి. రామమూర్తి ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. శరీరానికి కట్టిన ఉక్కు గొలుసును, ఊపిరితిత్తులలో గాలిని పూరించుకుని ముక్కలుగా తుంచి వేశాడు. రెండు కార్లను రెండు భుజాలకు ఇనుపగొలుసులతో కట్టించుకునేవాడు. కార్లను శరవేగంతో నడపమనేవాడు కార్లు కదలకుండా పోయేవి. రొమ్ముపై పెద్ద ఏనుగును ఎక్కించుకునేవాడు. 5 నిమిషాల పాటు, రొమ్ముపై ఏనుగును అలానే ఉంచుకునేవాడు. తండోప




Sthanka_BW Sept.indd 26 02/09/11 3:19 PM

తండాలుగా ప్రజలు వారి ప్రదర్శనలు చూచేవారు.

పూనాలో లోకమాన్యతిలక్ గారి కోరిక మేరకు ప్రదర్శనలిచ్చాడు. తిలక్ రామమూర్తిగారికి 'మల్లమార్తాండ', 'మల్లరాజ తిలక్' బిరుదులిచ్చారు. విదేశాలలో భారత ప్రతిభను ప్రదర్శించమని ప్రోత్సహించాడు తిలక్.

హైదరాబాద్‌లో ఆంధ్రభాషా నిలయం పెద్దలు ఘనసత్కారం చేసి 'జగదేకవీర' బిరుదు ఇచ్చారు.

అప్పటి వైస్రాయి లార్డ్ మింటో, రామ మూర్తి గారి ప్రదర్శనలను చూడాలని వచ్చాడు. రామమూర్తి అప్పట్లో ఆంజనేయ ఉపాసనలో ఉన్నందున వదినివిషాలు వేచాడు. రామ మూర్తి ప్రదర్శనలను చూచి ముగ్ధుడయ్యాడు. తానే పరీక్షించాలనుకుని తన కారును ఆపవలసిందని కోరాడు. కారులో కూర్చుని లార్డ్ మింటో కారును నడపసాగాడు. త్రాళ్ళతో కారును తన భుజాలకు కట్టుకున్నాడు. అంతే, కారు ఒక సెంటిమీటర్ కూడా కదలక పోయింది. ఈ సంఘటనతో వైస్రాయి ప్రశంసలను, దేశమంతటా గొప్ప పేరును సంపాదించాడు రామమూర్తినాయుడు.




అలహాబాదులో అఖిల భారత కాంగ్రెస్ సభ జరిగింది. రామ మూర్తి సర్కస్ అక్కడ ప్రదర్శనలిచ్చింది. జాతీయ నాయకులెందరో చూచి ఆనందించారు. పండిత మదనమోహన మాలవ్యా ఎంతగానో మెచ్చుకున్నారు. విదేశాలలో ప్రదర్శనలివ్వమని ప్రోత్సహించాడు.

సర్కస్ కంపెనీ బాగా పెరిగింది. రామమూర్తిగారు 1600 మంది గల తన బృందంతో లండన్ వెళ్ళి ప్రదర్శనలిచ్చారు. సుప్రసిద్ధ మల్లుడైన గామా పైల్వాన్ తమ్ముడు ఇమామ్‌బక్షో ఆ బృందంలో వుండేవాడు.

లండన్‌లో రాజదంపతులు జార్జిరాజు, రాణిమేరి, రామమూర్తిగారి ప్రదర్శనలను చూచి తన్మయులయ్యారు. రామమూర్తిగారిని తమ బక్కింగ్‌హోమ్ రాజభవనానికి ఆహ్వానించి, విందు ఇచ్చిన తర్వాత 'ఇండియన్ హెర్కులస్' బిరుదుతో సత్కరించారు. ఆ విధంగా బ్రిటిష్ రాజదంపతులచే, గౌరవింపబడిన భారతీయులలో మొదటివారు కోడి రామమూర్తి నాయుడు. రామమూర్తిగారు ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాలలో పలు ప్రదర్శనలిచ్చారు.

స్పెయిన్ దేశంలో 'కోడె పోరాటం' (బుల్ ఫైట్) చాలా ప్రసిద్ధమైంది. ఈ పోరాటం చాలా భీకరంగా ఉంటుంది. రామమూర్తిగారిని ఆ పోరులో పాల్గొనమన్నారు. అట్టి పోరాటంలో ఎలాంటి అనుభవంలేని రామ మూర్తిగారు 'సరే' అన్నారు. రామమూర్తిగారు రంగంలో దూకారు. దూసుకుని వస్తున్న కోడె కొమ్ములను పట్టుకొని క్షణాల్లో క్రింద పడవేశారు. కోడె చిత్తుగా పడిపోయింది. వేలాది స్పానిష్ ప్రేక్షకుల హర్షధ్వానాలతో స్టేడియం మార్మోగింది.

జపాన్, చైనా, బర్మాలలో రామమూర్తిగారు ఇచ్చిన ప్రదర్శనలు ఎంతో వైభవంగా సాగాయి.

బర్మాలో వున్నప్పుడు రంగూన్‌లో ప్రదర్శనలిచ్చారు. అసూయగ్రస్తులు కొందరు రామమూర్తిని చంపాలనుకున్నారు. ఎలాగో ఈ విషయం గ్రహించిన రామమూర్తి గారు ప్రదర్శనను ఆపి మరుసటి రోజే మాతృదేశం వచ్చారు. కోడి రామమూర్తిగారు కోట్లు గడించారు. అంతకంటే గొప్పగా దాన ధర్మాలకు, జాతీయోద్యమాలకు ఖర్చు చేశారు.

భారతదేశం అంతటా రామమూర్తిగారి పేరు ప్రతిధ్వనించింది. అమెరికా వెళ్ళాలనుకున్నారు. కాని వెళ్లలేదు. ప్రతిరోజూ పత్రికల్లో రామమూర్తిగారిపై ప్రశంసలుండేవి.

రామమూర్తి నాయుడుగారు పండిత మదన మోహన మాలవ్యాగారి అతిథిగా ఏడాదిపాటు బెనారస్‌లో వున్నారు.

ఆయన శాఖాహారి అని కొందరు అన్నారు. ఆచార్య రోణంకి అప్పల స్వామిగారు, రామమూర్తి గారి శిష్యుల నుండి సేకరించిన వివరాలను బట్టి రామమూర్తిగారు కోడిమాంసం సేవించేవారని తెలుస్తుంది.

భారతదేశంలో అతి విశిష్టమైన వ్యాయామ విద్యా సంస్థను ప్రారంభించాలనుకున్నారు. కాని ఆ ప్రయత్నం ఫలించలేదు.

కీ.శే. మేడేపల్లి వరాహ నరసింహస్వామిగారు రచించిన దానిని బట్టి రామమూర్తిగారి కాలిపై రాచపుండు లేచినందున కాలు తీసివేయవలసి వచ్చింది. సేకరించిన ధనం కరిగిపోయింది. శస్త్ర చికిత్స జరిగినప్పుడు ఎటువంటి మత్తుమందును (క్లోరోఫామ్) తీసుకోలేదు. ప్రాణాయామం చేసి నిబ్బరంగా వుండిపోయారు.

చివరిరోజులు బలంఘర్, పాట్నాలో కలవాండి (ఒరిస్సా) పరగాణా ప్రభువు పోషణలో వుండి 16-01-1942 తేదీన కన్నుమూశారు నాయుడుగారు.

తెలుగువారే కాక భారతీయులందరూ గర్వించదగిన మహనీయుడు, దేశభక్తుడు, కలియుగ భీమ కోడిరామమూర్తి నాయుడుగారు.

వరవిక్రయం, మధుసేవ వంటి గొప్ప సాంఘిక నాటకాలను రచించిన, విఖ్యాత నాటక కర్త కాళ్ళకూరి నారాయణరావుగారు, కోడి రామ మూర్తిగారి ఆప్త మిత్రులు. నాయుడుగారిని ప్రశంసిస్తూ 'సాధు పథవర్తి సన్మిత్ర చక్రవర్తి రమ్యతరకీర్తి శ్రీ కోడి రామమూర్తి" అన్నారు.

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి



Sthanka_BW Sept.indd 27 02/09/11 3:19 PM



# మానవ హక్కుల సాధనకు డా॥ అంబేడ్కర్ కృషి

**అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన 1948 లో వెలువడినప్పుడు ఐక్యరాజ్యసమితి, సభ్యదేశాలన్నీ ప్రపంచంలోని మానవులందరికీ సమాన హోదా, సమాన గౌరవం అనే హక్కుల్ని కల్పించడం, రక్షించడం అనే ఒప్పందాన్ని అంగీకరించాయి. అయితే ఈ ప్రకటన వెలువడటానికి దాదాపు రెండు దశాబ్దాలకు ముందే, మానవులందరికీ సమాన హోదా, సమాన గౌరవం, సమాన అవకాశాలు అనే నినాదాల్ని భారతదేశంలోను, వెలుపలా నినదించినవాడు డా॥ బి.ఆర్. అంబేడ్కర్. గొప్ప రాజనీతిజ్ఞునిగా, రాజకీయవేత్తగా, న్యాయశాస్త్ర కోవిదునిగా, ఆర్థికవేత్తగా, రాజ్యాంగ నిర్మాతగానే కాక, డా॥ బి.ఆర్. అంబేడ్కర్ సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు సంకేతం, స్ఫూర్తిదాతగా ఆధునిక భారతదేశ చరిత్రలో చిరస్మరణీయుడిగా మిగిలిపోతాడు.**

అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన, ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రకటించబడిన అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ప్రకటన, అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక మరియు సాంస్కృతిక హక్కుల వెలుగులో డా॥ బి.ఆర్. అంబేడ్కర్ కృషినీ, పోరాటాన్నీ పరిశీలించటం ద్వారా, భారతీయ సమాజంలోని నిర్లక్ష్యం చేయబడ్డ వర్గాలకై, వారి హక్కుల రక్షణకై, చిత్తశుద్ధితో, జీవితాంతం ఇంటా, బయటా ఆయన



సాగించిన మానవ హక్కుల పోరాటాన్ని అంచనా వేయటానికి ఆస్కారం కలుగుతుంది.

### జన్మత: అందరూ సమానులు

అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన ఆర్టికల్ (1) మానవులందరూ పుట్టుకతో స్వేచ్ఛా జీవులనీ, మానవులందరూ సమాన గౌరవానికీ, హక్కులకూ అర్హులనీ, కనుక అందరూ సోదర భావంతో మెలగాలని ప్రకటించింది. కానీ భారతీయ సమాజం, ప్రత్యేకించి హిందూ సమాజంలో మానవులందరూ సమానులు కాదు. అందరికీ స్వేచ్ఛ లేదు. కొందరు సేవలను పొందే హక్కులను కల్గి ఉంటే సమాజంలోని అత్యధికులు వారికి సేవలు చేసే బాధ్యతలు కల్గి ఉంటారు. ఇది సమానత్వ సూత్రానికి వ్యతిరేకం, పైగా ఈ అసమానత్వాన్ని 'అధికారిత సిద్ధాంతం' చేసి. "చేసే వృత్తిని, పనిని" ఎంచుకునే స్వేచ్ఛను కూడా హరించింది. ఇటువంటి అసమ సమాజంలో జన్మించిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వం కోసం. సమాన హక్కుల కోసం సాగించిన పోరాటాలను సామాజిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కుల విభాగాలుగా పరిశీలించటం సమంజసంగా ఉంటుంది.

### సామాజిక హక్కుల పోరాటం

భారతీయ ప్రాచీన సమాజం " చేసే పని - వారసత్వ" సూత్రాల ఆధారంగా సమాజాన్ని "బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర " అనే నాలుగు తరగతులుగా విభజించిన వర్ణ వ్యవస్థపై ఆధారపడింది. ఈ విధానంలో, వ్యవస్థీకరించబడిన హక్కులు, బాధ్యతలు ఆయా వర్ణాలకు ఆపాదించబడ్డాయి. ప్రతి ఒక్కరి వృత్తిని ముందే నిర్ణయించబడటం వల్ల, ఎవరికీ తమ వృత్తిని మార్చుకునే హక్కు లేదు. మాట్లాడేహక్కు, భావాలను ప్రకటించే హక్కు కొందరికే ఉంటుంది.

ఈ వర్ణ వ్యవస్థ కాలక్రమేణా కుల వ్యవస్థగా మారింది. ఆ వ్యవస్థ వలన కల్గిన కీడు గురించి, సమాజానికి చేసిన చెడు గురించి, జరిగిన దుష్పరిణామాల గురించి డా॥ బి.ఆర్. అంబేద్కర్ తన రచనలలో, ప్రసంగాలలో నిశితంగా, విస్తారంగా విమర్శలు చేశాడు, పోరాటాలు చేశాడు. సమాజంలో మానవులందరూ సమానులన్న సత్యాన్ని చాటటానికి, మానవులందరికీ సమాన గౌరవం, హోదా ఉండాలన్న అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన వెలువడడానికి దాదాపు రెండు దశాబ్దాల ముందే భారతదేశంలోను, అంతర్జాతీయ సమావేశాలలోనూ ఎలుగెత్తి చాటాడు.

జాతి,వర్ణ వ్యవస్థలో అస్పృశ్యులుగా చెప్పబడే కులం వారిని తాకినా, వారి నీడ సోకినా, వారి గొంతు విన్నా మైల పడిపోతామని అగ్ర వర్ణ హిందూ సమాజం భావించింది. అంటరానివారు ఊరి వెలుపల నివసించాలని ఆంక్షలు విధించిన హిందూమతం, వారికి మంచి నీటి బావుల నుండి నీరు తోడుకునే హక్కుని, దేవాలయాలలో ప్రవేశించే హక్కునీ, హోటళ్లలో అందరితో సమానంగా కూర్చునే హక్కునీ, చివరికి వారికి చాకలి, మంగలి వారి సేవలు పొందే అవకాశాన్ని లేకుండా చేసింది.

ఈ కుల వ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలలోని కుట్రలు, కుతంత్రాల్నీ, వివిధ జాతీయ, అంతర్జాతీయ చరిత్రకారులు, పురాతత్వ వేత్తలు, మేధావుల రచనలు, అంచనాలతో చేరిజు వేసిన అంబేద్కర్, ఈ హిందూ కుల వ్యవస్థలోని డొల్లతనాన్ని, అమానవీయకోణాల్ని ఆవిష్కరించాడు. "శూద్రులెవరు"మరియు "అస్పృశ్యులెవరు" అనే గ్రంథాల ద్వారా వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాల్ని వివరించాడు.

పురుష సూక్తంలోని వర్ణ వ్యవస్థ ఆవిర్భావాన్ని వివరించే 11,12 శ్లోకాలలోని విశ్వసనీయతను ప్రశ్నించాడు. "చాతుర్ వర్ణ వ్యవస్థ" సమాజాన్ని కృత్రిమంగా విభజించటమే కాక, శ్రామికుల విభజనకు కూడా దారితీస్తుంది. గౌరవ మర్యాదను, ప్రయోజనాన్ని చేకూర్చే ఏ వృత్తినైనా ఎంచుకునే స్వేచ్ఛ ప్రతి వ్యక్తికి ఉండాలనే అంశాన్ని అంబేద్కర్ నొక్కి చెప్పాడు. "చాతుర్ వర్ణ వ్యవస్థ కారణంగా భారతీయ సమాజంలోని నిమ్న కులాలు ప్రత్యక్షచర్య తీసుకోలేని విధంగా నిర్వీర్యమై పోయాయని కులనిర్మూలన గ్రంథంలో వాపోయాడు. "కోల్పోయిన హక్కుల్ని ప్రార్థనల ద్వారా, బిచ్చమెత్తుకోవటం ద్వారా సాధించలేము. నిరంతర పోరాటాల ద్వారా మాత్రమే సాధించగలం" అని ఎలుగెత్తి చాటాడు.

1927 లో మహద్ చెరువు నుండి మంచినీరు తెచ్చుకొనే హక్కు కోసం జరిపిన పోరాటం ఎంతో సంచలనాలను రేపింది. ముంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్, మహద్ మున్సిపాలిటీలు ఆ చెరువు నీరు పట్టణ ప్రజలందరికీ చెందాలని తీర్మానించినా, కొందరు బ్రాహ్మణ నాయకులు అంబేద్కర్‌ను సమర్థించినా, సహకరించినా మెజారిటీ అగ్రవర్ణాల వారు అంటరాని వారిని చెరువు నీటిని పొందటానికి అనుమతించలేదు. ఆ సందర్భంగా డా॥ అంబేద్కర్ ఆధ్వర్యంలో జరిపిన పోరాటం, అంతిమంగా అస్పృశ్య కులాల వారు చెరువులో దిగి, నీళ్ళు త్రాగటం జరిగినా, డా॥ అంబేద్కర్ వెళ్ళిపోయిన తర్వాత ఆ చెరువును గోమూత్రం, పేడ, పాలు, పెరుగు, నెయ్యి మొదలయిన " గోపంచకం లేదా పంచామృతం"తో అగ్రవర్ణాలు శుద్ధి చేశారు. ఈ సంగతి తెలుసుకున్న డా॥ అంబేద్కర్ పశువుల్ని పూజించి, మనుషుల్ని హీనంగా పరిగణించే సమాజానికి మనుగడ ఉండదని చెప్పాడు. "కులం పునాదులపై ఒక జాతిని గానీ, ఒక నీతిని గానీ నిర్మించలేర"ని చెప్పాడు.

కాలారామ్ దేవాలయ ప్రవేశ ఉద్యమం, గురువాయురు దేవాలయ ప్రవేశ ఉద్యమాల అనుభవం తర్వాత, దేవాలయ ప్రవేశం కంటే

మానవులుగా, సమాన హక్కుల కోసం పోరాటం సాగించాల్సిన అవశ్యకతను నొక్కి చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశాలలో భారతీయ నిమ్న జాతుల తరపున హజరైన డా॥ అంబేద్కర్ భారతదేశంలో నిమ్న జాతీయుల కష్టాలను, కడగండ్లను, ఎదుర్కొంటున్న సామాజిక వివక్షతను కళ్ళకు కట్టినట్లు వివరిస్తుంటే ప్రపంచం మొట్టమెదటి సారిగా భారతీయ సమాజం నిమ్న జాతులకు నిరాకరించిన మానవహక్కులేమిటో అర్థం చేసుకున్నారు. డా॥ అంబేద్కర్ ఈ వివక్షతా నిర్మూలన కోసం బ్రిటిష్ వారు కూడా తమ పాలనా కాలంలో ఏ విధమైన చర్యలు చేపట్టలేదని ఆ సమావేశంలోనే విమర్శించారు. "మీరు రాకముందు మా గూడేలు ఊరిబయట ఉండేవి. ఇప్పుడూ అలానే ఉన్నాయి. మీరు రాక ముందు మాకు విద్యావకాశాలు లేవు,మీరు వచ్చాకా లేవు. మీరు రాక ముందు మాకు దేవాలయ ప్రవేశం లేదు,ఇప్పుడూ లేదు.ఇటువంటప్పుడు నిమ్న జాతులు బ్రిటిష్ ప్రభుత్వానికి ఎందుకు మద్దతివ్వాలి ? అని ప్రశ్నించాడు.

హిందూ కోడ్ బిల్లును ఎంతో పురోగామి దృష్టితో రూపొందించిన డా॥ అంబేద్కర్ మహిళా హక్కులపై ఎలుగెత్తి చాటాడు. కానీ సంప్రదాయ వాదుల వాదనే నెగ్గి, బిల్లు భవితవ్యం ఎటూ తేలక వీగిపోవటంతో కేబినెట్ నుండే తొలగిపోయాడు.

## ఆర్థిక హక్కుల పోరాటం

డా॥ బి. ఆర్. అంబేద్కర్ ఆర్థిక ఆలోచనలు నిర్లక్ష్యం చేయబడ్డాయి. ఆయన ఆర్థిక సిద్ధాంతాలు నిర్లక్ష్య వర్గానికి సంబంధించిన సామాజిక,ఆర్థిక, సమస్యల పరిష్కారానికే కాక, భారత దేశ సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల్ని ఎత్తిచూపాయి.

డా॥ అంబేద్కర్ నిర్వహించిన అస్పృశ్యతా వ్యతిరేక పోరాటాలకు లభించిన ప్రాచుర్యం, ఆయన ప్రతిపాదించిన ఆర్థిక సిద్ధాంతాలకు లభించకపోవటానికి కారణం ఆర్థిక వ్యవస్థపై కుల ప్రభావం యొక్క ప్రాముఖ్యతను అంబేద్కర్ గుర్తించినట్లుగా భారతీయ ఆర్థికవేత్తలు గుర్తించలేక పోవటమే. అలాగే పాశ్చాత్య ఆర్థిక నమూనాలు భారత ఆర్థిక సమస్యల్ని పరిష్కరిస్తాయని కూడా వారు భావించటం కావచ్చు. "ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటిష్ ఇండియా" అనే అంశంపై రూపొందించిన థీసిస్‌కు యం.యస్.సి మరియు " ది ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ" అనే థీసిస్‌కు డి.యస్.సి డిగ్రీలు డా॥ అంబేద్కర్ పొందాడు. హిల్టన్ యంగ్ కమీషన్ ముందు ఇచ్చిన సాక్ష్యం. భారతదేశంలో కరెన్సీ సమస్యపై ప్రాముఖ్యతను సంతరించుకుంది.

భూమిలేని నిరుపేద కార్మికులు, ఖోటీ వ్యవస్థ రద్దు, చిన్న కమతాలు, మహద్ వతన్, సమిష్టి వ్యవసాయం, భూమి నుండి శిస్తు, భూస్వామ్య వ్యవస్థ రద్దు వంటి సమస్యలపై డా॥ అంబేద్కర్ దృష్టి సారించాడు.

1920-1930 మధ్య కాలంలో అంబేద్కర్ కార్మికులు, రైతుల కోసం పోరాడాడు. ఆయన స్థాపించిన ఇండిపెండెంటు లేబర్ పార్టీ ఆధ్వర్యంలో, సోషలిస్టు కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిష్టుల సహకారంతో కొంకణ ప్రాంతంలో నిర్వహించిన రైతు సదస్సుకు 20,000 మంది హజరైనారు. ముంబాయి ప్రాంతంలో ఆ కాలంలో ఆ స్థాయిలో జన సమీకరణ జరిపిన పెద్ద సభ అదే. అలాగే ముంబాయి టెక్స్‌టైల్ మిల్లు వర్కర్ల కోసం కమ్యూనిస్టుల సహకారంతో సమ్మె నిషేధించే బ్రిటిష్ వారి బిల్లును వ్యతిరేకిస్తూ చేసిన ఉద్యమం కూడా ఎంతో మహత్తరమైనది. డా॥ అంబేద్కర్ ఆ బిల్లును "నల్లబిల్లు" గా వర్ణిస్తూ, శాసనసభలో వాదించాడు. "సమ్మె హక్కు అనేది స్వేచ్ఛా స్వాతంత్ర్యాల హక్కుకు మారుపేరు, దానినెవ్వరూ నిషేధించజాలరు" అని పేర్కొన్నాడు.

## రాజకీయ హక్కుల పోరాటం

నిమ్న వర్గాలు దుర్భర జీవన స్థితిగతులు, అమానుష దుస్థితి నుండి విముక్తి పొందాలంటే రాజకీయాధికారం చేజిక్కించుకోవాలని డా॥ అంబేద్కర్ సూచించాడు. రాజకీయ అధికార వినియోగానికి నిర్దిష్ట పరిస్థితులుండాలనీ తద్వారానే దళితుల ప్రగతి సంక్షేమం సాధ్యమని ఆయన భావించాడు. "అధికార వినియోగానికి దేశ స్వాతంత్ర్య సాధనే తగిన షరతు కాదు, సంక్షేమ రాజ్యమే సమున్నత ఆశయం కావాలి" అని డా॥ అంబేద్కర్ 'మూక్ నాయక్' పత్రికలో రాశాడు. నిమ్న జాతి ప్రజల హక్కుల రక్షణ కోసం 1919 లో మాంటెగ్-చెమ్స్‌ఫర్డ్ కమిటీ ముందు వాదించాడు. రౌండ్ టేబుల్ సమావేశంలో సైతం నిమ్న జాతీయుల దుర్భర పరిస్థితుల్ని వివరించి, వారికి ప్రత్యేక నియోజక వర్గాలు పొందేలా కృషి చేశాడు. ఈ హక్కులు పూనా ఒప్పందంలో వీగిపోయినా, భారత రాజ్యాంగం రూపొందించే సమయంలో రాజ్యాంగ రచన కమిటీ అధ్యక్షునిగా, డ్రాఫ్టు రచనా బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకుని తను ఏ నిమ్న వర్గాల సంక్షేమం, అభివృద్ధికైతే ఇంతకాలంగా పోరాటం సాగిస్తున్నాడో, ఆయా వర్గాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టాలో రాజ్యాంగ ఆదేశాల రూపంలో పొందు పరిచాడు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల రూపంలో అవి పొందుపరచబడ్డాయి.

ప్రాథమిక హక్కుల్లో, ఆర్టికల్ 14 అందరికీ స్వేచ్ఛా సమానత్వాల హక్కు ప్రభోదిస్తే, ఆర్టికల్ 15 వివక్షతను నిర్మూలించే హక్కు, ఆర్టికల్ 16 సమాన విద్యా ఉద్యోగవకాశాల హక్కు, ఆర్టికల్ 17 అస్పృశ్యతా నిర్మూలనా హక్కు, ఆర్టికల్ 18 బిరుదుల్ని నిషేధించే హక్కు, ఆర్టికల్ -19 స్వేచ్ఛా స్వాంతత్ర్యాల్ని రక్షించే హక్కు, ఆర్టికల్ 21 జీవించే హక్కు,



21 (ఎ) విద్యా హక్కు, ఆర్టికల్ 22 అక్రమ అరెస్టుల్ని నిరోధించే హక్కు, ఆర్టికల్ 23-24 దోపిడీ నిరోధక హక్కు, ఆర్టికల్ 25-28 మత స్వేచ్ఛ హక్కు, ఆర్టికల్ 29-30 విద్య, సాంస్కృతిక హక్కులు మరియు అత్యంత ముఖ్యమైన రాజ్యాంగ పరిహార హక్కు, ఆర్టికల్ 32 లో పొందుపర్చబడింది. ఆదేశిక సూత్రాలు ఆర్టికల్ 36 నుండి 51 వరకు ఉన్నాయి. ఇవి ప్రభుత్వాలకు ఆదేశాలు. ప్రణాళికలు, చట్టాలు రూపొందించే క్రమంలో, ప్రజా సంక్షేమాల్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన చర్యలు, విలువలు ఈ ఆదేశిక సూత్రాలు.

ఆర్టికల్ 38 ప్రజా సంక్షేమాన్ని పరిరక్షించే క్రమంలో సామాజిక స్థితిగతులను పరిగణలోకి తీసుకోవాలనీ, ఆర్టికల్ 39(ఎ) అందరికీ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలనీ, అవసరమైన సందర్భంలో ఉచిత న్యాయాన్ని అందిచాలనీ ఆదేశిస్తున్నది. ఆర్టికల్ 40 గ్రామపంచాయితీల ఏర్పాటును ఆదేశిస్తుంది. పంచాయితీలు స్వతంత్ర పాలక రాజ్యాలుగా, స్థానిక ప్రభుత్వాలుగా, స్వతంత్ర్యంగా నిలబెట్టాలన్నది ఈ ఆదేశం.

రాజకీయ హక్కులు, రాజకీయ అధికారం లేకుండా బడుగు వర్గాల అభ్యున్నతి సాధ్యం కాదనీ, అంబేడ్కర్ భావించాడు. తన సహచరుల సామాజిక అభ్యున్నతికి, రాజకీయ విముక్తికి ఆయన అవిశ్రాంతం పోరాటం చేశాడు. మహిళలు, పురుషుల హక్కుల కోసం సమానంగా పోరాటం చేశాడు. మహిళలు విద్య నేర్చుకోవాలనీ, పరిశుభ్రంగా ఉండాలనీ, దురలవాట్లను విడనాడాలనీ, తమ పిల్లలకు చదువులు చెప్పించాలనీ, వారిలో ఆత్మన్యూనతా భావం తొలగించాలనీ, వారిలో లక్ష్యాన్ని పెంపొందింపజేయాలనీ, వివాహం విషయంలో మహిళలు తొందర పడరాదని ఉద్భోధించాడు. "అస్పృశ్యునిగా నిన్ను నువ్వు ఎన్నడూ భావించొద్దు" అని నొక్కి చెప్పాడు.

1955 లో చేసిన ప్రసంగాలలో డా॥ అంబేడ్కర్ తనకు మూడు లక్ష్యాలున్నాయని చెప్పాడు.

1. విద్యను వ్యాప్తి చేయటం
2. ప్రభుత్వోద్యోగాల్లో అస్పృశ్యులకు మరింత ప్రాతినిధ్యాన్ని కల్పించటం.
3. గ్రామాలలో అస్పృశ్యుల పరిస్థితిని మెరుగు పరచటం.

మొత్తం మానవ ఉనికికే ముప్పుగా పరిణమించి నైతిక, సామాజిక వ్యవస్థల పునాదులనే కదిలించే పొరపాటు సామాజిక సంబంధాల నుండి ఎదురయ్యే సవాళ్ళను ప్రతిఘటించటం అంబేడ్కర్ జీవితంలో ప్రధాన ఆలోచనగా ఉండేది. పురుషులు, మహిళల మధ్య సరైన సంబంధాలు నెలకొల్పటం కోసం ప్రాధాన్యతనిచ్చే క్రమంలో, ఊహజనిత అంశాల కంటే ఆచరణాత్మక విషయాలకీ ప్రాధాన్యత నిచ్చాడు. కులతత్వం, అస్పృశ్యత, అసమానతల నిలయమైన హిందూ మతం నుండి బౌద్ధమతం సరైన సమాధానం, శాంతి లభిస్తుందని డా॥ అంబేడ్కర్ భావించాడు. అస్పృశ్యుల రాజకీయ సమానత్వం, సామాజిక అన్యాయాలు, అక్రమాల నిర్మూలనకు మత మార్పిడి ఒక సాధనంగానూ, మానవ హక్కుల రక్షణకు సాధ్యమైన స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం మొదలైన భావనల సాధనకు బౌద్ధం ఆలంబన కాగలదని డా॥ అంబేడ్కర్ విశ్వశించాడు.



డా॥ అంబేడ్కర్ ప్రభుత్వం కంటే సమాజానికి అధిక ప్రాధాన్యత నిచ్చాడు. ప్రభుత్వం ప్రజలను అంతర్గత అశాంతి, బహిరంగ దురాక్రమణల నుండి కాపాడాల్సి ఉంది. ప్రభుత్వ అధికారం, వ్యక్తి స్వేచ్ఛల మధ్య సమతూకం సాధించేందుకు డా॥ అంబేడ్కర్ కృషి చేశాడు. అదే క్రమంలో వివిధ వర్గాల మధ్య సామాజిక శాంతి, న్యాయ పరిరక్షణలో చట్టం పోషించే ప్రధాన పాత్రను అంబేడ్కర్ నొక్కి చెప్పాడు. చట్టానికి న్యాయపరమైన బాధ్యత మాత్రమే ఉండాలనీ, అది మొత్తం సమాజం, దేశ జీవనాన్ని నియంత్రిస్తుందనీ అంబేడ్కర్ అన్నాడు. అన్యాయం, అణచివేత, నిరంకుశత్వాన్ని నిరోధించేందుకే ప్రభుత్వం ఉందని ఆయన అభిప్రాయ పడ్డాడు.

"హక్కులు, చట్టబద్ధంగా కాకుండా సమాజం రాజకీయ, నైతిక ప్రభోధాల ద్వారా పరిరక్షించబడతాయి. హక్కులను గుర్తించేందుకు సమాజం సిద్ధంగా ఉంటే ఆ హక్కులు భద్రంగా ఉంటాయి. దానినే చట్టం గుర్తించి శాసన రూపం కల్పిస్తుంది. వ్యక్తిగత హక్కులను సమాజం తిరస్కరిస్తే ఏ చట్టం, ఏ పార్లమెంటు, ఏ న్యాయ వ్యవస్థ దానిని కాపాడి ఆచరణలోనికి తీసుకురాలేవు".

డా॥ అంబేడ్కర్ ప్రభుత్వ సోషలిజాన్ని ప్రతిపాదించాడు. అందుకై క్రింది విధంగా ప్రతిపాదించాడు.

1. వ్యవసాయం ప్రభుత్వ పరిశ్రమ కావాలి.
2. భూమి ప్రభుత్వానికి చెందినదై ఉండాలి.
3. ఎటువంటి భూస్వామిగానీ, కౌలుదారుగానీ, వ్యవసాయ కార్మికుడు కానీ ఉండరాదు,
4. సమిష్టి వ్యవసాయ విధానం ఉండాలి.
5. ప్రభుత్వ పూర్తి నియంత్రణలో పారిశ్రామికీకరణ చేయాలి.
6. భీమాపై ప్రభుత్వానికీ గుత్తాధిపత్యం ఉండాలి.

## విద్యా హక్కుల పోరాటం

డా॥ అంబేడ్కర్ స్వతహగా విద్యావేత్త, ప్రొఫెసర్, ప్రిన్సిపాల్, పలు విద్యా సంస్థల వ్యవస్థాపకుడు. విద్యకు దూరం కావటం వల్లనే సమాజంలోని నిమ్న వర్గాలు నిర్లక్ష్యానికి గురైనారన్న విషయాన్ని గుర్తించిన అంబేడ్కర్, ఈ వర్గాల అభ్యున్నతికై ఎన్నో ఆచరణాత్మక



చర్యలు చేపట్టాడు. విద్యకు రెండు ప్రధాన లక్ష్యాలున్నాయని చెప్పాడు.

1. సత్యాన్వేషణ
2. మానవీయ విలువల పెంపుదల

దళితులు, మహిళల విద్యకై జ్యోతిరావు పూలే కృషికి కొనసాగింపుగా "పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ" ని ప్రారంభించినాడు. బొంబాయిలో సిద్ధార్థ కళాశాలను స్థాపించాడు. ఔరంగాబాదులో మిళింద కళాశాల, మహద్‌లోను, నాగపూర్‌లోను అంబేడ్కర్ కళాశాలలు స్థాపించబడ్డాయి. 1952 డిశంబరులో ఎల్ఫిన్‌స్టన్ కళాశాలలో యిచ్చిన ఉపన్యాసంలో "విద్య విజ్ఞాన వనరులను సృష్టిస్తూ, ఆధునిక జగత్తు అవసరాలు తీర్చాలి, సమస్యల్ని పరిష్కరించాలని" హితబోధ చేశాడు. విశ్వవిద్యాలయాలు జ్ఞాన నిలయాలుగా మెలగాలని, కార్మికుల పని కేంద్రాలుగా మారకూడదని హెచ్చరించాడు. 1928 లో సైమన్ కమీషన్‌కు యిచ్చిన వినతి పత్రంలో అణచివేతకు గురయ్యే వర్గాల పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య ఏర్పాట్లు ఉండాలని వాదించాడు. 1937 లో నిమ్న వర్గాల అభ్యున్నతికి దోహదం చేసే విద్యా విధానాన్ని రూపొందించి బ్రిటిష్ వారికి సమర్పించాడు. విశ్వవిద్యాలయాలను 1. టీచింగ్ 2. నాన్ టీచింగ్ విశ్వవిద్యాలయాలుగా విభజించాలని సలహ యిచ్చాడు.

### పత్రికాధినేతగా పోరాటం

బడుగు వర్గాల సమస్యలపై 'మూక్ నాయక్' పత్రిక ద్వారా నినదించాడు. 'బహిష్కృత భారత్', 'సమత' లలో వర్తమాన అంశాలపై, సమస్యలపై స్పందించాడు. 'జనత' పత్రిక 1930 లో ప్రారంభించినప్పుడు ఆ పత్రిక సంపాదకీయంలో "నువ్వు బానిసవని బానిసకు చెప్పండి, తన హక్కులేమిటో అతడు తెలుసుకుంటాడు" అని ఉద్భోధించాడు.



సంపాదకునిగా, పత్రికా రచయితగా, వ్యాసకర్తగా, డా॥ అంబేడ్కర్ తన ఆలోచనలను, భావాలను అత్యంత సరళంగా, హుందాగా వ్యక్తం చేశాడు. అవి నిమ్న వర్గాల, నిర్లక్ష్య వర్గాల హక్కులను సుసంపన్నం చేసేందుకు ఉద్దేశించబడేవి.

### ముగింపు

డా॥ అంబేడ్కర్ సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి గెలిచిన ధీరుడు. "దళితుల హక్కులే మానవ హక్కులు అన్న నినాదం ఈ నాడు దేశమంతటా మారు మోగుతున్నదంటే దానివెనుక దశాబ్దాల క్రిందట డా॥ అంబేడ్కర్ సాగించిన మానవ హక్కుల పోరాటాల చరిత్ర ఉంది. సాంఘికంగా వెనుకబడిన కులంలో పుట్టి, పాశ్చాత్య విద్యలను నేర్చి, హేతువాద దృక్కోణాన్ని అలవర్చుకొని, తిరుగుబాటు తత్వం కలిగిన డా॥ అంబేడ్కర్ సరియైన సమయంలో నిర్లక్ష్యం చేయబడ్డ వర్గాల వారికి నాయకత్వం వహించి వారి తరపున సామాజిక ఉద్యమాలలో, మానవ హక్కుల పోరాటాలలో, రాజ్యాంగ వ్యవహారాలలో వ్యూహాత్మకంగా పాల్గొన్నాడు. అణగారిన వర్గాల పట్ల నిర్లక్ష్య వైఖరి కనబరచినందుకు భారతీయ హిందూ సమాజాన్ని, రాజకీయ, ఆర్థిక వెనుకబాటుతనానికి బ్రిటిషు ఏలుబడిని దుయ్యబట్టాడు. తరతరతరాలుగా అణగారిన వర్గాల హక్కుల సాధనకై తన వాక్పటిమతో, తర్కంతో వాదించి సాధించాడు.

ఆధునిక భారత సమాజం ఎదుర్కొంటున్న విభిన్న సమస్యలపై డా॥ అంబేడ్కర్ సిద్ధాంతాల్ని తన తరవాత తరం వారు నిర్లక్ష్యం చేశారు. "బోధించు, సమీకరించు, పోరాడు" అన్న సూత్రాల్ని విస్మరించారు. డా॥ అంబేడ్కర్ చివరి రోజుల్లో తన అనుచరులతో ఈ విషయాల్ని పంచుకున్నాడు. "ఎన్నో వ్యయప్రయాలసకోర్చి నేను ఈ హక్కుల ఉద్యమ రథాన్ని ఇంత దూరం లాక్కొచ్చాను నా తరవాత తరం వాళ్ళు తమకు చేతనైతే ఈ రథాన్ని ముందుకు తీసుకెళ్ళండి లేదా ఇక్కడే వదిలెయ్యండి కానీ, వెనక్కి మాత్రం నెట్టకండి" అని ఉద్భోధించాడు. డా॥ అంబేడ్కర్ ఆశించినట్లుగా ఈ హక్కుల రథాన్ని ముందుకు తీసుకెళ్ళటం కోసం మరో మహత్తర పోరాటం అవసరమయ్యేలా ఉంది.

### ఆధార గ్రంథాలు


1. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ స్మారకోపన్యాసాలు - సంపుటం 1 : డా॥ బి.ఆర్. అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్
2. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ జీవిత చరిత్ర - డా॥ బి. విజయ భారతి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్
3. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ జీవిత చరిత్ర - డా॥ ఇ.వి. చిన్నయ్య -
4. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ విశ్లేషనాత్మక అధ్యయనం - డబ్ల్యు.ఎన్. కుబేర్: ప్రజాశక్తి బుక్ హౌస్.
5. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ యాజ్ హ్యూమన్‌రైట్సు లీడర్: - గెయిల్ ఓమ్‌వెట్ - ఇంటర్నెట్
6. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ మాన్ ఇండిఫేటిగబుల్ డిఫెండర్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ - జోసెఫ్ బెంజమిన్ - ఇంటర్నెట్



**అలవాల గవర్రాజు**

ఫ్యాకల్టీ, ఇ.టి.సి, రాజేంద్రనగర్

# వ్యవసాయ పరిశ్రమలతోనే గ్రామీణాభివృద్ధి

**భారతదేశంలో పండినన్ని ఆహారధాన్యాలు, కాయకూరలు, పండ్లు, సుగంధద్రవ్యాలు, అందుబాటులో వున్న ఖనిజ సంపద ప్రపంచంలో మరే దేశంలోను లభించవు. ఆంధ్రప్రదేశ్‌ను భారత ఆహార ధాన్యాగారంగా అభివర్ణిస్తారు. అలాగే ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేకత వుంది. జమ్ము-కాశ్మీరు విహార కేంద్రంగా, కేరళ సుగంధ ద్రవ్యాలకు పేరుగాంచినట్లే, ఇతర రాష్ట్రాలు ప్రత్యేకతలు సంతరించుకున్నాయి.**

భారతదేశంలోని గ్రామీణులకు దాదాపు 90 శాతం మంది వ్యవసాయంపైన ఆధారపడి జీవిస్తున్నారు. కనుక రైతులకు వ్యవసాయం ఒక లాభదాయకమైన జీవనధారంగా రూపొందించే చర్యలను భారత ప్రభుత్వం చేపట్టడం ద్వారా మాత్రమే గ్రామీణాభివృద్ధి జరుగుతుంది.

మనదేశంలో అకాల వర్షాలు, అతివృష్టి, అనావృష్టి వంటి వైపరీత్యాల మూలంగా పండించిన పంటలు ధ్వంసమై, వ్యవసాయ ఖర్చులు కూడా చేతి కందక, చేసిన అప్పులు తీరక, కుటుంబాలను పోషించలేక ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఆత్మహత్యతలకు పాల్పడుతున్నారు. ఈ పరిస్థితి నుండి వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను, రైతాంగాన్ని కాపాడవలసిన గురుతరమైన బాధ్యత ప్రభుత్వంపై వుంది.

అందువల్ల, వ్యవసాయంతో పాటు, ఈ క్రింద పేర్కొన్న వ్యవసాయ ఆధార పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం అత్యంత అవశ్యకం!

### ఫుడ్ ప్రాసెసింగ్

ఇతర దేశాలలో ఉత్పత్తి అవుతున్న పండ్లు, కాయకూరలను సాంకేతిక పరిజ్ఞానంతో నిలువ పదార్థాలుగా రూపొందించినట్లే, మన దేశంలోను, ప్రత్యేకంగా మన రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ విధానం ద్వారా, పండ్లు, కాయకూరలను నిలువ పదార్థాలుగా రూపొందిస్తే రైతులకు మంచి లాభసాటిగా వుంటుంది.

ఈ ఫుడ్ ప్రొసెస్డ్ ఆహార పదార్థాల మార్కెటు అభివృద్ధికి మూల స్థంభాలు మధ్య తరగతి, ఉన్నత వర్గాల వారు. పురుషులతో పాటు, ఉద్యోగాలు చేసే మహిళలు అధికం కావడంతో, వంటపనికి తగిన సమయాన్ని పొందడం కోసం ప్రొసెస్డ్ పదార్థాల వాడకం పెరగడం ఒక కారణమైతే, తలసరి ఆదాయం పెరగడం కూడా మరొక కారణంగా భావించవచ్చు.

ప్రొసెస్డ్ ఆహార పదార్థాలు, పానీయాలకు ఎగుమతి అవకాశాలు ఎక్కువ. అందువల్ల అధిక లాభార్జనను రైతులు, పారిశ్రామికులు పొందవచ్చు.

*ఫుడ్‌ప్రాసెసింగ్‌లో కొన్ని రకాలు-*

1) పండ్లు, కాయకూరలు ప్రాసెసింగ్

2) పాల ప్రాసెసింగ్

3) ధాన్యం ప్రాసెసింగ్

4) శీతల పానీయాల ప్రాసెసింగ్

5) ఫిష్ ప్రాసెసింగ్

6) మీట్ మరియు పౌల్ట్రీ ప్రాసెసింగ్

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ప్రోత్సహించే సదుద్దేశంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ క్రింద పేర్కొన్న విధంగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీ.ఓ. నెం. 53 పరిశ్రమలు, వాణిజ్యం శాఖ మార్చి 5, 2004 లో ఈ క్రింద పేర్కొన్న రాయితీలను అందించింది.

1) కేంద్రం అందించే 25 శాతం రాయితీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 10 శాతం లేదా గరిష్టంగా 5 లక్షల రూపాయల రాయితీ లభిస్తుంది.

2) ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు కొన్న భూమి రిజిస్ట్రేషన్‌లో 50 శాతం స్టాంపు డ్యూటీ రాయితీ లభిస్తుంది.

3) పరిశ్రమల పార్కులలో స్థాపించే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు మొత్తం వర్కింగ్ క్యాపిటల్‌పై 5 శాతం వడ్డీ రాయితీ, గరిష్టంగా రెండు లక్షల రూపాయలు కాగా, ఇతర ప్రాంతాలలో పరిశ్రమలు స్థాపించే వారికి మొత్తం వర్కింగ్ క్యాపిటల్‌పై 5 శాతం వడ్డీ రాయితీ, గరిష్టంగా ఒక లక్షరూపాయల రాయితీ ఒక్క సంవత్సర కాలానికి మాత్రమే లభిస్తుంది.

4) పరిశ్రమలో 50 శాతం ఉత్పత్తులను ఎగుమతి చేసిన పారిశ్రామిక వేత్తలకు, వారి వర్కింగ్ క్యాపిటల్ ఋణంపై 5 శాతం వడ్డీని, గరిష్టంగా రెండు లక్షల రూపాయలను రాయితీగా రెండు సంవత్సరాల కాలానికి లభిస్తుంది.

5) ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సంబంధించిన యంత్ర పరికరాల కొనుగోలు వ్యయాన్ని 50 శాతం, గరిష్టంగా మూడు లక్షల రూపాయల రాయితీ లభిస్తుంది.

6) ముడి పదార్థాలపై చేర్చిన అమ్మకం పన్నును, ఉత్పత్తుల అమ్మకాలపై చెల్లించాల్సిన అమ్మకం పన్ను నుండి మినహాయింపు జరుగుతుంది. ఎగుమతి చేసిన ఉత్పత్తుల ఇన్‌పుట్స్‌పై (పెట్టుబడుల పై) చెల్లించిన అమ్మకం పన్నును వాణిజ్య శాఖ తిరిగి చెల్లిస్తుంది.

7) విమానం ద్వారా ఎగుమతి చేసే ఉత్పత్తుల విమాన ఛార్జీలలో 25 శాతం, గరిష్టంగా రెండు లక్షల రూపాయల రాయితీ 25 సంవత్సరానికి లభిస్తుంది.

కనుక, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ, స్వదేశీ, విదేశీ విపణులను వృద్ధి చేసుకుంటూ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సంఘటితంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ద్వారా, 'నీవు జీవించు, మరికొందరికి ఉపాధి ద్వారా జీవితాన్ని ప్రసాదించు' అన్న చందాన తాము ఉపాధి పొందుతూ, మరికొందరికి జీవనాధారం కల్పించడంతో పాటు దేశానికి వెన్నెముక అయిన రైతులను ఆదుకొనడం ద్వారా గ్రామీణాభివృద్ధికి, తద్వారా దేశపురోగాభివృద్ధికి చేయూతనివ్వడం సదా హర్షదాయకం!

*- ఎ.వి.రాజా*

*ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ*



Sthanka_BW Sept.indd 32 02/09/11 3:19 PM



# 'గురి' కుదిరింది

**చీపురు పుల్లలతో బాణాలు ప్రయోగించని బాల్యం ఈ దేశంలో ఏ మూల వెతికినా కనిపించదు. చిన్నతనంలో చీపురుపుల్లలే బాణాలుగా చేసుకుని ఆడడం, అలాంటి వారిని చూపి పెద్దలు చిందులు వేయడం సర్వసాధారణం. పురాణాలు, ఇతిహాసాలు, చరిత్ర ఎక్కడ చూసినా విలువిద్య ప్రస్తావన లేని సందర్భం ఈ భారతదేశంలో ఎక్కడా కనిపించదు. తిరుగులేని రామబాణం, సవ్యసాచి మత్స్యయంత్ర ఛేదనం, కర్ణుని అసమాన ధనుర్విద్యా పాండిత్యం, ఏకలవ్యుని గురుభక్తి చిన్నారుల మనసులో సుస్థిరస్థానం సంపాదించుకున్నాయి.**

'తెలుగు వీర లేవరా' అంటూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు చేతిలో కేవలం వెదురుతో తయారుచేసిన విల్లు, అంబులు నేటికీ యువతరానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ఆదిమ మానవుడికి వేటలో తోడుగా నిలిచినా, నాగరికత నేర్చిన తరువాత ఆత్మరక్షణకు ఉపయోగించినా, విల్లంబులు నిత్యం మానవుడికి తోడుగా నిలుస్తూనే ఉన్నాయి.

ఆధునిక మానవుడు అనేక క్రీడాంశాలపై దేశవిదేశాల్లో ఒలింపిక్స్, ఏషియన్ స్థాయిలో పోటీలు నిర్వహించుకుంటూ ప్రతిభా సామర్థ్యాలను ప్రదర్శిస్తూనే ఉన్నాడు. చాలాకాలం విలువిద్యకు ఈ పోటీల్లో చోటు దక్కలేదు. బహుశా ఆ కారణంగానే కావచ్చు - మన దేశంలో యువతీయువకులు విలువిద్యపై అంతగా ఆసక్తి చూపించలేదు. అయితే, ఆలస్యంగానైనా మన దేశపు విలువిద్యా ప్రవీణులు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. భవిష్యత్తు విషయంలో పెద్ద ఎత్తున ఆశలు కల్పిస్తున్నారు.

ఇటీవల ఇటలీలోని ట్యూరిన్ పట్టణం ప్రపంచ విలువిద్యా పోటీలకు వేదికగా నిలిచింది. మన యువ మహిళా విలుకాండ్రు, గతంలో ఎన్నడూ లేని విధంగా, మొట్టమొదటిసారి ఫైనల్స్‌కు చేరుకున్నారు. అతి పిన్న వయస్కురాలు దీపికా కుమారి, చెక్రవోలు స్వోరో, లయిశ్రామ్ బొంబాయిలా దేవి రజత పతకం సాధించారు. ఫైనల్స్‌లో జరిగిన చివరి పోటీలో మాజీ ఛాంపియన్ ఇటలీపై పోటీ పడి, 207-210 స్కోరు తేడాతో ఓటమి పాలయ్యారు. అంతకుముందు సెమీ ఫైనల్స్‌లో ప్రస్తుత ఛాంపియన్‌లు కొరియాపై ఘన విజయం సాధించడం ప్రశంసనీయమైన విజయంగా చెప్పాలి.

ఈ పోటీల్లో విజయాల కారణంగా, కేడెట్ స్థాయిలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన దీపిక కుమారి, స్వోరో బొంబాయిలా దేవి వచ్చే ఏడాది లండన్‌లో జరగనున్న ఒలింపిక్ పోటీల్లో కోటా స్థానం దక్కించుకున్నారు. ఇదే విధంగా పురుషుల పోటీల్లో ప్రతిభ చూపించిన జయంత్ తాలూక్‌దార్ కూడా ఒలింపిక్ పోటీలకు అర్హత సంపాదించుకున్నాడు.

గత జూన్‌లో ఢాకాలో జరిగిన ఏషియన్ గ్రాండ్ ప్రిక్స్, ఆసియా స్థాయి విలుకాండ్ర పోటీల్లో భారత క్రీడాకారులు ఎనిమిది స్వర్ణ పతకాలు, మూడు రజితం, మూడు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో రెండో స్థానం సాధించిన సింగపూర్ జట్టు కేవలం ఒక సువర్ణ పతకం, రెండు వెండి, ఒక కాంస్యం సాధించింది. ఇంతటి ఘన విజయాల వెనుక ఆవేదన కలిగించే కఠోర సత్యాలే ఉన్నాయి. అవి తప్పకుండా ఔత్సాహికులకు చాలా ఆసక్తి కలిగిస్తాయి.



Sthanka_Septcolo.indd 31 02/09/11 3:21 PM

నలభై ఏళ్ల క్రితం, 1970 దశకంలో మ్యూనిచ్ (పశ్చిమ జర్మనీ) ఒలింపిక్ క్రీడల పోటీలు ప్రారంభం అయ్యే ముందు నుంచే ఆధునిక విలువిద్యా ప్రదర్శనలపై దేశంలో ఆసక్తి, ప్రోత్సాహం ప్రబలమయ్యాయి. అది ఆచరణ రూపంలో 1973లో న్యూఢిల్లీ కేంద్రంగా జాతీయ స్థాయిలో ఆర్చరీ అసోసియేషన్ ఏర్పాటైంది. అదే సంవత్సరంలో జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. ఆనాటి పోటీల్లో దేశంలోని నలుమూలల నుంచి 50 మంది పాల్గొన్నారు. వారంతా కూడా మేఘాలయ, పశ్చిమ బెంగాల్‌లో లభించే సాధారణ వెదురు కర్రలతో తయారుచేసిన విల్లులను ఉపయోగించారు. ఆ పోటీల్లో పశ్చిమ బెంగాల్ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు.

మన దేశంలో ధనుర్విద్యకు ప్రాచుర్యం కలిగించడంలో అప్పటి ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన ఢిల్లీలో ఇది ముఖ్యమంత్రి పదవిగా మారింది) ఉన్న విజయ్‌కుమార్ మల్హోత్రాకు గౌరవం దక్కుతుంది. మల్హోత్రా అధ్యక్షుడుగా, ఎ.ఎన్. ముఖర్జీ సెక్రటరీ జనరల్‌గా ఆసియన్ ఆర్చరీ ఫెడరేషన్ 1978లో ఏర్పడగా, 1980లో కోల్‌కతాలో ఆసియా స్థాయిలో ఆర్చరీ పోటీలు జరిగాయి.

1980వ దశకం మన దేశంలో ధనుర్విద్యకు అసాధారణమైన ఆదరణ లభించిందనే చెప్పాలి. ఈ సమయంలోనే లింబారామ్, కృష్ణ ఘటక్, శ్యామ్‌లాల్ వంటి అసాధారణ విలువిద్యా ప్రవీణులు దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు.

1992లో బార్సిలోనా (స్పెయిన్)లో జరిగిన ఒలింపిక్ గేమ్స్‌లో లింబారామ్ ప్రపంచ శ్రేణి విలుకాండ్రలో తొమ్మిదో స్థానం సంపాదించుకున్నాడు. అతని స్ఫూర్తితో దేశంలోని వివిధ శాఖలు- పోలీసులు, రైల్వేలు, బ్యాంకులు, పారా మిలిటరీ దళాలు- విలు విద్యా ప్రవీణులను ప్రోత్సహించడం ప్రారంభించాయి. భారత ప్రభుత్వం ప్రోత్సహించడానికి ఎంపిక చేసిన ఆరు క్రీడాంశాల్లో విలువిద్యకు కూడా చోటు దక్కింది.

1987లో కోల్‌కతాలో జరిగిన ఆసియా స్థాయి క్రీడల్లో లింబారామ్‌తో కూడిన పురుషుల జట్టు సభ్యులు కాంస్య పతకం సాధించడం అప్పట్లో దేశం గర్వించదగిన ఘనతగా గుర్తింపు పొందింది. లింబారామ్ వ్యక్తిగత స్థాయిలో ఛాంపియన్‌గా నిలిచాడు. ప్రపంచ రికార్డును సమం చేశాడు. జట్టు మొత్తం ప్రతిభ చూపించి, అప్పటి ఛాంపియన్ కొరియాను ఓడించింది.



తరువాత, 2003లో బర్మా (అప్పటి మయన్మార్)లోని యాంగూన్‌లో జరిగిన ఏషియన్ పోటీల్లో మరోసారి కాంస్య పతక విజేతగా ఈ దేశం నిలబడింది. ఫలితంగా 2004 (ఏథెన్స్, గ్రీస్) ఒలింపిక్ పోటీలకు మన దేశపు విలువిద్యా జట్టు అర్హత సంపాదించింది. మహిళల జట్టులో మొదటిసారి దోలా బెనర్జీ వ్యక్తిగతంగా స్వర్ణ పతకం సాధించింది. ఆమెతో పాటు పాల్గొన్న రీనా, రాను అంత్యాలా (టర్కీ) యూరోపియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో ఈ జట్టు గోల్డ్ సాధించింది. మాడ్రిడ్ పోటీల్లో పురుషుల జట్టు -జయంత్ తాలూక్‌దారు, తరుణ్‌దీప్, గౌతం సింగ్, రోబిన్ హన్స్‌డా రజత పతకం సాధించారు.

ఇప్పటివరకు మన దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డులను ఎనిమిది మంది - కృష్ణదాస్, శ్యాంలాల్, లింబారామ్, సంజీవ్ కుమార్ సింగ్, తరుణ్‌దీప్ రాయ్, దోలా బెనర్జీ, జయంత్ తాలూక్‌దార్, మంగల్ సింగ్ గెలుచుకున్నారు.

*- దాసు కేశవరావు*

*అనువాదం: రామశేషు*

## ఆంధ్రుల ప్రవేశం

**వ**రంగల్ జిల్లాలోని మారుమూల గ్రామం- కల్లెడ వాసి వర్ధినేని ప్రణీత 2008 బీజింగ్ ఒలింపిక్స్ పోటీల్లో భారత జట్టులో స్థానం సంపాదించి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. కల్లెడలో నెలకొల్పిన రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ వారి ఆర్చరీ స్కూలులో ప్రాథమిక శిక్షణ, జంషెడ్‌పూర్‌లోని టాటా ఆర్చరీ అకాడమీలో ఉన్నత స్థాయి శిక్షణ పొందిన ప్రణీత అప్పటికే ఈ రంగంలో పేరు పొందిన దోలా, బొంబాయిలా దేవిలతో పోలిస్తే ఉత్తమ ఫలితాలు ప్రదర్శించి తనకో స్థానాన్ని సంపాదించుకుంది.

2008 ఒలింపిక్స్‌లో ప్రపంచ శ్రేణి విలుకాండ్రతో పోటీ పడి రజతం సొంతం చేసుకుంది. అంతకుముందు మెక్సికో (2006) పోటీల్లో కొద్దిలో రజత పతకం సాధించింది. రెండు సందర్భాల్లోనూ ప్రణీత కొద్దిలో స్వర్ణం చేజార్చుకుంది.

ఇటీవల కాలంలో విజయవాడలోని వోల్గా ఆర్చరీ అకాడమీ ప్రతిభను గుర్తించడంలో ప్రముఖ పాత్ర వహించింది. అకాడమీ కోచ్‌గా 25 ఏళ్ల చెరుకూరి లెనిన్ ఆచార్యత్వంలో వెలుగులోకి వచ్చిన వారిలో చిట్టిబొమ్మ జిజ్ఞాస్, లిచ్చువల్, వనం జ్యోతి సురేఖా, సాయి వైష్ణవి, ఎం. చిరంజీవి ఫణిభూషణరావు ముఖ్యమైనవారు.

విషాదం కలిగించే సంఘటన ఏమిటంటే విజయవాడ అకాడమీ శిక్షకుడు లెనిన్ రోడ్డు ప్రమాదంలో మరణించడం రాష్ట్ర విలువిద్యా అభివృద్ధికి పెద్ద విఘాతం కలిగించిందని చెప్పవచ్చు.



Sthanka_Septcolo.indd 32 02/09/11 3:21 PM



# సంపూర్ణ అక్షరాస్యతను సాధించేది ఎలా....?

**"విద్య ఒక నిధి వంటిది. జీవితంలో ఎక్కడికెళ్లినా ఆ నిధి తన యజమానిని అనుసరిస్తూనే ఉంటుంది", అని ప్రాచీన చైనా సామెత పేర్కొన్నా; "అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య, దీనితో ప్రపంచాన్నే మార్చవచ్చు", అని నేటి దక్షిణాఫ్రికా జాతిపిత నెల్సన్ మండేలా చెప్పినా; "విద్యా విహీన: పశు:" అని మన భర్తృహరి ఈసడించుకున్నా ప్రతి మనిషి విద్యావంతులవ్వాల్సిన అవసరాన్ని వీరు ఉద్ఘాటించారు. ప్రజాస్వామిక వ్యవస్థలో విద్యార్జనపై పెట్టిన వ్యయం అంతకు పదిరెట్ల మేరకు ప్రజలకు ఫలితాన్నిస్తుందని స్వయంగా గాంధీ మహాత్ముడే పేర్కొన్నారు.**

అయినప్పటికీ, స్వాతంత్ర్యం వచ్చి 64 సంవత్సరాలు గడిచినా, అక్షరం ముక్క రాని ప్రజలు ఇంకా 30 కోట్ల మందికి పైగా ఉన్నారు. ఇది దాదాపు అమెరికా మొత్తం జనాభాకు సమానం. అసలు 1944 లోనే భారతదేశంలో 1984 నాటికల్లా, అంటే 40 సంవత్సరాలలో 100 శాతం అక్షరాస్యత సాధించడానికి బ్రిటీషిండియా ప్రభుత్వం 'సార్జంటు పథకం' అనే దాన్ని ప్రతిపాదించింది. 100 శాతం అక్షరాస్యత సాధించడానికి 40 సంవత్సరాలు అవసరమా అంటూ, మన స్వాతంత్ర్యోద్యమ నాయకులు ఆనాడు విమర్శించారు. ఆ 40 సంవత్సరాల కాలం గడిచి, మరో 27 సంవత్సరాలు అయినా 2011 నాటి జనాభా లెక్కల సేకరణ నాటికి ఇంకా అక్షరాస్యుల శాతం 74% వద్దనే ఉంది.

6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్కులైన బాలలందరికీ ఉచితంగా, తప్పనిసరిగా పదేళ్లలోపల విద్యనందించాలనే లక్ష్యాన్ని మన రాజ్యాంగంలోని 45వ అధికరణలో ఆదేశిక సూత్రం రూపంలో పొందుపరచుకున్నప్పటికీ, గడువు ముగిసి అనేక దశాబ్దాలు అయింది. గ్రామీణ ప్రజలకు అందుబాటులో పాఠశాలలు నెలకొల్పడానికి ప్రపంచబ్యాంకు అనేక పథకాలకు నిధులు ఇచ్చింది. 1990ల దశకం నాటి డిపెప్ (డిస్ట్రిక్ట్ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్), గత దశాబ్దం నాటి సర్వ శిక్షా అభియాన్ వంటి అనేక పథకాలు కొనసాగుతున్నా, బాలలందరికీ విద్యనందించటంలో నిధుల వ్యయానికి తగ్గట్లుగా పురోగతి లేదు. ఎన్ని పథకాలు చేపట్టినా, లక్ష్యసాధనకు సుదూరంగానే మిగిలిపోవటంతో, 2002లో 86వ రాజ్యాంగ సవరణ చేపట్టటం ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యను 'ప్రాథమిక హక్కుల్లో' ఒకటిగా పేర్కొంటూ, 21 ఎ అధికరణను రాజ్యాంగంలో చేర్చింది.

విద్యను ప్రాథమిక హక్కుగా అమలు చేయడానికి ప్రత్యేక చట్టం అవసరం కావటంతో, 2005 నాటికి ఒక ముసాయిదా బిల్లుకి రూపకల్పన జరిగింది. సుదీర్ఘంగా చర్చలు జరిగి, చివరికి 2009 నాటికి ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం, రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టంగా మారింది. "బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2009"గా వ్యవహరిస్తున్న ఈ చట్టం 2010, ఏప్రిల్ నుంచి జమ్ము-కాశ్మీర్ మినహా మిగిలిన దేశమంతటా అమల్లోకి వచ్చింది. దీనిద్వారా, 6 నుంచి 14



సంవత్సరాల మధ్య వయస్కులైన బాలలందరూ విద్యను ప్రాథమిక హక్కుగా పొందారు.

విద్య ప్రాధాన్యత తెలిసిన ధనిక, మధ్యతరగతి ప్రజలకు ఏ చట్టాలు, హక్కులు అవసరం లేదు. దిగువ మధ్యతరగతి ప్రజలు కూడా అష్టకష్టాలు పడి, తినో, తినకో, అప్పులు చేసో పిల్లలను బడులకు పంపి చదివించుకుంటున్నారు. పిల్లలను బడులకు పంపనిదీ, పంపినా మధ్యలో బడి మాన్పిస్తున్నదీ కూటికి కూడా గతి లేని నిరుపేద ప్రజలే.

2004, డిసెంబర్‌లో 5.5 శాతం ఉన్న మన దేశ జిడిపి పెరుగుదల రేటు 2006 సెప్టెంబర్ నాటికి అత్యధిక గరిష్ఠ స్థాయి 10.10 శాతానికి చేరుకున్నప్పటికీ, ఆర్థిక సంక్షోభపు కాలంతో సహా ఈ ఐదారు సంవత్సరాల సగటు పెరుగుదల రేటు కళ్లు చెదిరే స్థాయిలో 8.40 శాతం ఉన్నప్పటికీ, మన దేశంలో పేదరికం మాత్రం తగ్గలేదు. దేశ సంపద నానాటికీ పెరుగుతోంది. ఇటువైపు పేదల సంఖ్యా పెరుగుతోంది. ధనికులు, పేదల మధ్య అంతరమూ పెరుగుతోంది. దేశంలో పెద్ద ఎత్తున పెరుగుతున్న సంపద పేదరికాన్ని ఏమాత్రం నిర్మూలించటం లేదు. కొద్దిమంది చేతుల్లోకే వెళ్లిపోతోంది.

భారతదేశ జనాభా 121 కోట్లు. ఇందులో దాదాపు 41.6 శాతం ప్రజలు, అంటే 48 కోట్ల మంది ఇప్పటికీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు అంచనా. ఈ విషయంలో రకరకాల వివాదాస్పద అంచనాలు ఉన్నప్పటికీ, కొంత అటూ ఇటూగా పేదప్రజలు ఆ స్థాయిలోనే ఉన్నారు. దేశంలో పలు పేదరిక నిర్మూలన పథకాలు ఎడతెగకుండా చేపట్టినా, పేదరికం మాత్రం తగ్గుముఖం పట్టటం లేదు.

నిజానికి భారతదేశానికున్న వనరుల్లో మానవ వనరులు గొప్ప సంపద. కాని, అమూల్యమైన మానవ వనరులు నిరక్షరాస్యులుగా, అవిద్యావంతులుగా ఉన్న పరిస్థితుల్లో వీరు సంపద బదులుగా సమస్యగానే మారుతారు. దేశ జనాభాలో సుమారు 40 శాతం మంది 18 సంవత్సరాలలోపు పిల్లలే. వీరిని విద్యావంతులుగా చేస్తే, దేశానికి విలువైన మానవ వనరులు లభిస్తాయి. ఎందుకంటే, ఒక దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో, ఉత్పత్తి రంగంలో, పరిపాలనా రంగంలో, సేవల రంగంలో కొత్త పుంతలు తొక్కించేదీ, అభివృద్ధి బాట పట్టించేది విద్యావంతులైన, సుశిక్షితులైన మానవ వనరులే. అమెరికా, యూరప్ దేశాలు, జపాన్, చైనా, తైవాన్, సింగపూర్ వంటి దేశాలు మన కళ్లముందు ఉదాహరణలుగా నిలిచి ఉన్నాయి.


### పేదరికానికి తోబుట్టువు బాలకార్మిక వ్యవస్థ

అయితే, వాస్తవ పరిస్థితులు గమనిస్తే, లక్ష్యానికి మనం ఎంత దూరంగా ఉన్నామో అర్థం అవుతుంది. 6-14 సంవత్సరాల మధ్య వయస్కులైన బాలల్లో సగం మంది కూడా బడిలో లేరు. బడిలో చేరిన పిల్లల్లో మూడింట ఒక వంతు పిల్లలు కూడా కనీసం 8వ తరగతి వరకు కొనసాగటం లేదు. అసలు బడిలోనే చేరని, మధ్యలోనే బడి మానేసే బాలల పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో తెలుసుకోవాలి. ఒక వైపు కుటుంబంలో రెక్కాడితే కాని డొక్కాడని కటిక పేదరికం. చిన్నారి వయస్సులోని పిల్లలతో సహా ప్రతి ఒక్కరూ కష్టపడితే కాని మూడుపూటలా తినలేని దైన్యం. చదువుకుంటూ, ఆడిపాడి ఆనందించాల్సిన లేత వయస్సులో కుటుంబ పోషణ భారాన్ని నెత్తికెత్తుకుని ప్రమాదకరమైన పరిస్థితుల్లో బాలలు పనిచేయాల్సిన దారుణం.

ప్రపంచం మొత్తం మీద భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో బాలకార్మికులు ఉండటం మనందరికీ సిగ్గుచేటు. బడిలో ఉండడానికి బదులు పనిలో ఉంటున్న పిల్లల సంఖ్య దేశంలో 11.50 కోట్ల వరకు ఉందని అంచనా. వీరిలో 1 కోటి మంది చిన్నారులు ఇళ్లలో వెట్టిచాకిరీ చేస్తూ జీవితం వెళ్లబుచ్చుతున్నారు. ఇతర పరిశ్రమల్లో కూడా కోట్ల మంది వెట్టిచాకిరీ చేసే బాలలున్నారని అంచనా. 1976లో వెట్టిచాకిరీని నిషేధిస్తూ చట్టం తెచ్చినప్పటికీ, అత్యంత హేయమైన వెట్టిచాకిరీ వ్యవస్థ కొనసాగుతూనే ఉంది. మన దేశంలోని బాలకార్మికుల్లో గణనీయ సంఖ్యలో వ్యవసాయ పనులు చేస్తున్నారని ఐఎల్‌వో అంచనా వేసింది.

అవసరాలకు అప్పులు తెచ్చుకున్న గ్రామీణ పేదలు వాటిని తీర్చలేక,






అందుకు బదులుగా తమ పిల్లలను వెట్టిచాకిరీ చేసేందుకు భూస్వాములకు అప్పగిస్తున్నారు. ఇక వీధుల్లో పూలు, పండ్లు వంటి చిన్న చిన్న వస్తువులను అమ్ముకుంటూ, లేదా బిచ్చమెత్తుకుంటూ లక్షలాది మంది పిల్లలు హృదయవిదారకమైన పరిస్థితిలో కన్పిస్తున్నారు. గాజు ఫ్యాక్టరీలలో ప్రమాదకరమైన వేడి వాతావరణంలో 60,000 మంది, అగ్గిపెట్టెల పరిశ్రమల్లో 2,00,000 మంది, కార్పెట్ పరిశ్రమల్లో 4,20,000 మంది, ఇత్తడి, లక్క పరిశ్రమల్లో 1,00,000 పనిచేస్తున్నారని ఐఎల్‌వో అంచనా వేసింది. ఇంకా భవన నిర్మాణం, ఇటుకల బట్టీలు, పట్టు పరిశ్రమ, టపాకాయల పరిశ్రమలు వంటి చోట్ల కోట్లాది మంది బాలకార్మికులు ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనులు చేస్తున్నారు. ఇవికాక హెూటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, రిసార్టులు వంటివి కూడా బాలకార్మికులను నిబంధనలకు విరుద్ధంగా నియమించు కుంటున్నాయి. ఏ కార్మిక చట్టాల నిర్వచనంలోకి రాని 12 గంటల సుదీర్ఘ పనివేళల్లో ఈ బాలలను పనిచేయిస్తున్నారు.

బడిలో లేని బాల భారతానికి పేదరికమే కాకుండా ఇతర కారణాలు కూడా ఉన్నాయి. దాదాపు 47 శాతం ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలు





లేవు. 22 శాతం ఆవాస ప్రాంతాల్లో నివాస స్థలాలకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు ఉన్నచోట కూడా 60 శాతం పాఠశాలల్లో సగటున ఇద్దరి కంటే తక్కువ ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో సగటున ముగ్గురి కంటే తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక పాఠశాలల్లో కూడా మంచినీరు, టాయిలెట్లు వంటి సదుపాయాలు అరకొరగానే ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అమల్లోకి తెచ్చిన "బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం" పలు సమస్యలను విస్మరించింది. ఆవాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో పాఠశాలలను నెలకొల్పటం, ఉపాధ్యాయులను ఇతర పనుల నుండి తప్పించటం వంటివి ఈ చట్టంలో చేర్చినప్పటికీ, పిల్లలను బడికి పంపటంలో ప్రధాన అవరోధంగా ఉన్న పేదరికాన్ని పట్టించుకోలేదు. అంతేకాక, 14 సంవత్సరాలు పైబడిన పిల్లలను విస్మరించింది. బాలల హక్కులపై ఐక్యరాజ్య సమితి రూపొందించిన ఒప్పందంపై భారతదేశం సంతకం చేసింది. దీని ప్రకారం, 18 సంవత్సరాల లోపు పిల్లందరికీ ఉచితంగా విద్యనందించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

భారతదేశంలో విద్యను ప్రాథమిక హక్కుగా చేర్చినంత మాత్రాన సమస్య పరిష్కారమవుతుందనుకుంటే, అది భ్రమగా మిగలక తప్పదు. మిగిలిన ప్రాథమిక హక్కులైన సమానత్వపు హక్కు, స్వాతంత్ర్యపు హక్కు, పీడనను వ్యతిరేకించే హక్కు, మత స్వాతంత్ర్యపు హక్కు, సాంస్కృతిక హక్కు వంటి ప్రాథమిక హక్కుల మాదిరిగా విద్యాహక్కును ప్రజలు ఉపయోగించుకుంటారంటే, అది వట్టిమాటే. అసలు, సమాజంలోని ఏ వర్గపు ప్రజలకు ప్రయోజనం కలిగించాలని ఈ విద్యాహక్కు చట్టం తెచ్చారో, ఆ వర్గపు ప్రజలు ఆ హక్కును పొందాలని కోరుకోని పరిస్థితి ఉన్నప్పుడు; ఆ చైతన్యం, అవగాహన లేనప్పుడు విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా చేసినంత మాత్రాన ఒనగూరే ప్రయోజనం లేదు.

ఉదాహరణకు, రాజ్యాంగం మొదటి ముసాయిదాలోనే చేర్చిన ప్రాథమిక హక్కుల్లో పీడనను వ్యతిరేకించే హక్కు ఉంది. 23, 24 అధికరణల్లో దీన్ని పొందుపరిచారు. మనుషుల అక్రమ రవాణా,






వెట్టిచాకిరీ, బాలకార్మిక వ్యవస్థలను వ్యతిరేకించడాన్ని ఇందులో ప్రాథమిక హక్కుగా పేర్కొన్నారు. ప్రాథమిక హక్కుగా చేర్చినంత మాత్రాన ఇవేవీ 60 ఏళ్లుగా అంతం కాలేదు. పైపెచ్చు తీవ్రతరమవుతున్నాయి. బాలకార్మిక వ్యవస్థను వ్యతిరేకించే హక్కు ప్రాథమిక హక్కుగా ఉన్నంత మాత్రాన ఎవరు దీన్ని వ్యతిరేకించాలి? పిల్లలతో పనిచేయించనిదే పొట్ట గడవని పేదవారు దీన్ని ఎందుకు వ్యతిరేకిస్తారు? కారుచౌకగా పేద పిల్లలతో పనులు చేయించుకుంటూ, అతి తక్కువ వేతనాలిచ్చి వారి శ్రమ దోపిడీ చేస్తున్న ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఎందుకు వ్యతిరేకిస్తాయి? ఇట్లాంటి పరిస్థితుల్లో విద్యాహక్కుని ప్రాథమిక హక్కుగా తెచ్చినంతమాత్రాన దాన్ని వినియోగించుకునేదెవరు?

పిల్లలను పెంచడానికి, చదివించడానికి సంబంధించి పేదలకు ప్రధానంగా ఎదురయ్యే సమస్యలు కొన్ని ఉన్నాయి. పాఠశాలల ఫీజులు, వారి తిండి ఖర్చు, దూరంగా ఉన్న పాఠశాలలకు పంపడం వల్ల పడే భారం, పిల్లలతో పనిచేయించకుండా ఉంటే, అంతమేరకు ఆర్థిక లోటు ఎట్లా తీరాలనేవి వీరు ఎదుర్కొనే సమస్యలు. విద్యాహక్కు చట్టం వల్ల వీటిలో కొన్ని సమస్యలు పరిష్కారమయినప్పటికీ, ప్రధాన సమస్య అపరిష్కృతంగానే ఉండిపోతుంది. తమ రెక్కల కష్టానికి తోడు, పిల్లలు కూడా కష్టపడి ఇంతో, అంతో సంపాదించుకొస్తుంటే, వారిని ఆ పని మాన్పించి బడికి పంపవలసిన ఆవశ్యకత పేద ప్రజలకు కన్పించదు.





పిల్లలను పనికి పంపకుండా బడికి పంపడం వల్ల, పేద ప్రజలపై 'ఆపర్చునిటీ కాస్ట్' (Opportunity Cost) భారం పడుతుంది. ఆర్థిక శాస్త్ర నియమాల ప్రకారం, ఏ కొరత అయినా 'ట్రేడ్-ఆఫ్‌ల' (Trade-offs) కు కారణమవుతుంది. ఈ ట్రేడ్-ఆఫ్‌ల' ఫలితంగా 'ఆపర్చునిటీ కాస్ట్' వస్తుంది. బడికి పంపాలా, పనికి పంపాలా అనే వివేచనలో పనికి పంపకుండా బడికి పంపటం 'ట్రేడ్-ఆఫ్'(సరిపెట్టుకోవటం)కు దారితీస్తుంది. ఈ సరిపెట్టుకోవటం వల్ల, పిల్లలు పనిచేసి, సంపాదించే మొత్తాన్ని అంటే 1000 రూపాయలనో, 2000 రూపాయలనో ఆ పేద కుటుంబాలు కోల్పోతున్నాయి. ఆ మేరకు వారిపై భారం పడుతుంది. అదే 'ఆపర్చునిటీ కాస్ట్'. పిల్లలను పనికి కాకుండా బడికి పంపుతున్నప్పుడు ఇట్లా 'ఆపర్చునిటీ కాస్ట్' భారం పేదలపై ఎప్పుడు పడదో, అప్పుడు వారు తమ పిల్లలను బడికి పంపడానికే ప్రాధాన్యం ఇస్తారు.

పిల్లలకు ఉచిత విద్యావకాశాలు కల్పించటంతో పాటు, వారిని బడికి పంపినందుకు ఒక్కొక్క బిడ్డకు నిర్దిష్ట మొత్తంలో ఆ కుటుంబానికి నగదు అందజేసినప్పుడే పేదలకు 'ఆపర్చునిటీ కాస్ట్' భారం పడదు. ఎల్‌కెజి నుంచి పి.జి. వరకు ఈ విధానం అమలు చేసినప్పుడే పిల్లలను బడిలో చేర్పించటంలో పేద తల్లిదండ్రులకు ప్రోత్సాహకాలు అందుతాయి. పిల్లలను బడికి పంపటం ద్వారా కలిగే ఇతర ప్రయోజనాలకు కూడా పేదలు ఆకర్షితులవుతారు. భారతదేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించి, ప్రజలందరినీ ఉన్నత విద్యావంతులుగా చేయటానికి ఇదే మేలైన పరిష్కారం.

- గొట్టిపాటి సుజాత

# ఇక బ్యాంకు సేవలు గ్రామాల ముంగిట్లోకే !!

**భారతదేశం ముఖ్యంగా వ్యవసాయాధారిత దేశం. దాదాపు జనాభాలో 70 శాతం మంది ఇంకా గ్రామాల్లోనే జీవిస్తున్నారు. దేశంలో ఇంకా 48 శాతం బ్యాంకింగ్ సేవలకు ఆమడ దూరంలోనే వున్నాయి. వీటిలో ఎక్కువ సంఖ్య గ్రామీణ ప్రాంతాలకు చెందినవే. ఇంకా 26 శాతం దేశ జనాభా పేదరిక రేఖకు దిగువన నివసిస్తూవుంది. దేశంలో 21 శాతం గ్రామీణ గృహాలు మాత్రమే బ్యాంకు రుణాలు పొందగలిగినాయి. మన బ్యాంకింగ్ వ్యవస్థ ఇప్పటి వరకు కేవలం 20 శాతం మంది పేదలకు మాత్రమే రుణ అవసరాలను తీర్చగలిగింది.**

ఆశ్చర్యకరమేమంటే భారతదేశంలో 40 శాతం జనాభా మాత్రమే బ్యాంకు అకౌంట్లు కలిగివున్నారు. 10 శాతం జీవిత బీమా పరిధిలోనూ, 0.6 ఇతర బీమా పరిధిలో ఉండగా, 2 శాతం మంది క్రెడిట్ కార్డులు, 13 శాతం మంది డెబిట్ కార్డులు కలిగివున్నారు. దేశంలోని 6,50,000 గ్రామాల్లో కేవలం 5.2 శాతం గ్రామాలు మాత్రమే బ్యాంకు బ్రాంచ్‌ని కలిగివున్నాయి. దీనిని బట్టి బ్యాంకులు పని చేయవలసినది ఇంకా చాలా మిగిలివున్నదని అర్థమవుతోంది. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక సంస్థలు పేదలు, గ్రామీణులు బ్యాంకులకు మంచి ఆస్తులు అని భావిస్తున్నారు.



దేశంలో కోట్లాది మంది ప్రజానీకం బ్యాంకింగ్ సేవలకు ఆమడదూరంలో వున్నారు. డబ్బు దాచుకోవడానికి బ్యాంకులకు వెళ్ళే పరిస్థితి లేదు. ఆర్థిక అవసరాలకు, ఇతరత్రా రుణ సదుపాయాలకు స్థానిక వడ్డీ వ్యాపారుల్నే ఆశ్రయిస్తున్నారు. నాలుగు దశాబ్దాల జాతీయీకరణ అనంతరం ఇంకా అధిక శాతం పల్లెవాసులకు, వెనకబడిన ప్రాంతాల వారికి బ్యాంకింగ్ సేవలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. ఒక వైపు పట్టణ, నగరాల్లో ఆన్‌లైన్ సేవలతో పాటు టెలిబ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి ఆధునిక సేవలు అందుతుండగా, మరో వైపు కొన్ని ప్రాంతాలకు ప్రాథమిక బ్యాంకింగ్ సేవలు అందని పరిస్థితి నెలకొంది.

గతంలో ప్రభుత్వరంగ బ్యాంకులు వెనక బడ్డ, మౌలిక సదుపాయాలు లేని ప్రాంతాలకు సైతం బ్యాంకింగ్ సేవలందించే ప్రయత్నం చేసినప్పటికీ, ఇంకా దేశ వ్యాప్తంగా లక్షకు పైగా గ్రామాలకు (2 వేలకు పైగా జనాభా వున్నవి) బ్యాంకింగ్ సేవలందడం లేదు.

కొన్నేళ్ళుగా వాణిజ్య బ్యాంకుల మధ్య తీవ్రమైన పోటీ నెల కొంది. బ్యాంకులు వాటి వ్యాపారాభివృద్ధి లాభదాయకతలపైనే దృష్టి సారిస్తూ సామాజిక బాధ్యతను విస్మరిస్తున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకుల నుంచి వస్తున్న పోటీ కారణంగా ప్రభుత్వరంగ బ్యాంకులు లాభసాటికాని వ్యాపారాలకు, బ్యాంకింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు సామాజిక బాధ్యత ఉన్నప్పటికీ లాభదాయకతకే పెద్ద పీట వేయడంతో కొంతకాలంగా బ్యాంకింగ్ సేవలు అందని ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఆర్థిక సంఘటితం సాధించే దిశలో ప్రభుత్వం కొన్ని మార్గదర్శక సూత్రాలను జారీ చేసింది. అదే విధంగా బ్యాంకులు ఆర్థిక సంఘటిత లక్ష్యాలను చేరుకొనేందుకు వార్షిక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రిజర్వు బ్యాంకు సూచించిన నేపథ్యంలో బ్యాంకులు మళ్ళీ పల్లెబాట పట్టేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

ఆర్థిక సంఘటిత లక్ష్యాలను చేరే దిశలో బ్యాంకులు ఇటీవల ఒక కొత్త పొదుపు ఖాతాను ప్రవేశ పెట్టాయి. ఈ ఖాతా పేరే నో-ఫ్రిల్స్ పొదుపు ఖాతా. అతి తక్కువ లేదా సున్నా బ్యాలెన్స్‌తో ఈ ఖాతాలను ప్రారంభించేందుకు బ్యాంకులు వెసులుబాటు కల్పిస్తున్నాయి. ముఖ్యంగా కె.వై.సి. (నో యువర్ కస్టమర్) నిబంధనల నుంచి ఈ ఖాతాలకు మినహాయింపు వుంటుంది. సామాన్య ప్రజానీకానికి అందుబాటులో వుండే విధంగా ఈ పొదుపు ఖాతాను రూపొందించాయి.

దీని ద్వారా అసంఘటిత కార్మిక వర్గానికి, వెనక బడ్డ ప్రాంత ప్రజలకు, గ్రామీణ ప్రాంతాలవారికి ప్రాథమిక బ్యాంకింగ్ సేవలందించాలన్నది ముఖ్యోద్దేశం. కొంత కాలంగా ప్రభుత్వరంగ బ్యాంకులు వాడవాడలా మేళాలు నిర్వహిస్తూ, అసంఘటిత రంగ కార్మిక వర్గానికి, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, అట్టడుగు వర్గాలకు నో-ఫ్రిల్స్ ఖాతాలను ప్రారంభించాయి.

ఇప్పటి దాకా బ్యాంకింగ్, ఆర్థిక సేవలకు దూరంగా వున్న కోట్ల మంది దేశ ఆర్థిక స్రవంతిలో కలిసి ఆర్థిక సంఘటిత ప్రయోజనాలు పొందే దిశలో ఇదొక ముందడుగు. గతంలో బడుగు వర్గాలకు, అసంఘటిత రంగ కార్మికులకు, పల్లెప్రాంతాల వారికి బ్యాంకింగ్ సేవలు అందించడం లాభసాటి కాదని భావించిన బ్యాంకులు ఇప్పుడు వారి ముంగిటకే వెళ్ళి ఖాతాలు తెరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి.

కేవలం ఖాతాలను ప్రారంభించినంత మాత్రాన ఆర్థిక సంఘటిత లక్ష్యాలను చేరినట్లు కాదన్నది గ్రహించాలి. అట్టడుగు ప్రజానీకానికి పూర్తి స్థాయి బ్యాంకింగ్ సేవలందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడినప్పుడే ఆశించిన లక్ష్యాలు చేకూరుతాయి అనడం వాస్తవం. నిజానికి బ్యాంకులు ఇప్పటిదాకా ప్రారంభించిన నో-ఫ్రిల్స్ ఖాతాల్లో దాదాపు 30 నుంచి 40 శాతం ఎటువంటి లావాదేవీలు లేకుండా నామమాత్రంగా నిలిచిపోయాయి. సంఖ్యాపరంగా కోట్లకొద్దీ ఖాతాలను తెరిచినప్పటికీ సమీప భవిష్యత్తులో అధిక శాతం ఖాతాలు నిద్రాణ స్థితికి చేరే అవకాశంవుంది.

ఈ నేపథ్యంలో అయా బ్యాంకులు, ఇటు ప్రభుత్వం ఈ ఖాతాల్లో లావాదేవీలు జరిపేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలి.



Sthanka_Septcolo.indd 28 02/09/11 3:20 PM



పూర్తి స్థాయి బ్యాంకింగ్ సేవలందించాలి. స్వయంసహాయక బృందాలు, ప్రభుత్వేతర సంస్థల సమన్వయంతో బ్యాంకులు నో-ఫ్రిల్స్ ఖాతాదారులకు రుణ సదుపాయం కల్పించి వారి ఆర్థిక అవసరాలు తీర్చగలిగినపుడే నిజమైన ఆర్థిక సంఘటిత సాధ్యమవుతుంది. అదే విధంగా ప్రభుత్వం బడుగు వర్గాలకు వివిధ పథకాల ద్వారా అందించే నిధులను ఈ ఖాతాల ద్వారా ఇచ్చి వారి సమగ్రాభివృద్ధికి తోడ్పడే దిశలో చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరం.

దేశ వ్యాప్తంగా రెండు వేలకు పైగా జనాభా వున్న ప్రాంతాలకు వచ్చే రెండేళ్ళలో బ్యాంకింగ్, భీమా, ఇతరత్రా ఆర్థిక సేవలందించాలన్న బడ్జెట్ ప్రతిపాదన కార్యరూపం దాల్చాలంటే బ్యాంకులు ఇప్పటి దాకా బ్యాంకింగ్ సేవలు అందని ప్రాంతాలకు, మారుమూల గ్రామాలకు, అట్టడుగు వర్గాల వారికి సైతం బ్యాంకింగ్ సేవలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో చేపట్టి 2012 నాటికి దేశవ్యాప్తంగా ప్రతి నివాసానికి కనీసం ఒక బ్యాంకు ఖాతా వుండాలనే లక్ష్యంతో ముందుకెళ్ళాలి.

మొదట్లో ధనిక వర్గాలకే పరిమితమైన మొబైల్ ఫోన్ ఇప్పుడు అందరికి అవసరమైన వస్తువు అయిపోయింది. మరి అదే మొబైల్‌ను మరిన్ని సేవలను ఉపయోగించుకుంటే... ఇదే ఆలోచనలతో ఇప్పుడు వాటిని ఎ.టి.ఎమ్.లుగా వాడాలనే ఆలోచనలు ఊపందుకుంటున్నాయి.

గతంలో బ్యాంకులో వున్న డబ్బులు తీసుకోవటానికి బ్యాంకుకు వెళ్ళాల్సి వచ్చేది. ఎ.టి.ఎమ్.ల రాకతో అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు డబ్బులు డ్రా చేసుకునే అవకాశం వచ్చింది. కానీ నగరాల్లో అక్కడక్కడా మాత్రమే ఎ.టి.ఎమ్.లు వున్నాయి. కొన్ని ఊర్లలో ఎ.టి.ఎమ్‌ల ద్వారా వంద, అంతకు పైబడ్డ మొత్తాల్లోనే డబ్బులు తీసుకోవాలి. 100,500,1000 నోట్లే ఎ.టి.ఎమ్‌ల ద్వారా వస్తాయి. మొబైల్ రీచార్జ్ ఓచర్లలాగా 20,50,...... ఇలా ఎంత కావాలంటే అంత, ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకునే వెసులుబాటు వుంటే గ్రామీణులకు ఎంతో సౌకర్యంగా వుంటుంది. ఈ దిశగానే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

గతంలో మాదిరిగా బ్యాంకింగ్ సేవలు అందించడానికి బ్యాంకులకు తప్పనిసరిగా ఆయా ప్రాంతాల్లో శాఖలు వుండాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఎ.టి.ఎమ్‌లు విస్తృత నెట్‌వర్క్‌ల సాయంతో శాఖల రహిత బ్యాంకింగ్ సేవలు అందించడం సాధ్యమౌతుంది. మౌలిక సదుపాయాల్లేని మారుమూల ప్రాంతాల్లో సేవలు అందించడానికి బ్యాంకులకు పలు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి. ఇందుకోసం బ్యాంకుల వైఖరిలో కొంత మార్పు రావాలి. బ్యాంకింగ్ కార్యకలాపాలకు పల్లెప్రాంతాలు లాభదాయకం కాదన్న వైఖరిని మార్చుకోవాలి. గ్రామీణ శాఖల్ని లాభదాయకంగా మలచుకొనే ప్రయత్నం చేయాలి.

ఎ.టి.ఎమ్. నెట్‌వర్క్‌ను మరింత విస్తృతం చేయడానికి గత ఏడాది భారత్ రిజర్వుబ్యాంకు మార్గదర్శకాలు విడుదల చేసింది. వీటి ప్రకారం బ్యాంకు తరుపున బిజినెస్ కరెస్పాండెట్లుగా పనిచేయడానికి గ్రామాల్లో చిన్న చిన్న కిరాణా కొట్లకు, రిటైర్డ్ టీచర్లకు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు, యన్.జి.ఓ.లకు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు బ్యాంకులు అవకాశమిస్తాయి. ప్రాథమిక బ్యాంకింగ్ సేవలను మొబైల్ కనెక్టివిటీ వున్న హాండ్ హెల్డ్ పరికరంతో ఈ బిజినెస్ కరెస్పాండెంట్లు అందిస్తాయి. రానున్న కొద్ది సంవత్సరాలలో బ్యాంకులు 2 లక్షల మందికి పైగా ఇలాంటి కరెస్పాండెంట్లను నియమించనున్నాయి. బ్యాంకింగ్ రంగం దిగ్గజం యస్.బి.ఐ. కనీసం 40,000 మందిని నియమిస్తుందని, ఈ ఆర్థిక సంవత్సరానికి కనీసం 15,000 మందిని నియమిస్తుందని అంచనా.

ఖాతాదారుల వద్ద నుంచి డిపాజిట్లు తీసుకోవడం, నగదు విత్ డ్రా చేసుకోవడంలో వారికి సాయపడడం, జీవిత బీమా వంటి ఫైనాన్షియల్ ప్రొడక్టుల విషయం మొదలైనవి బిజినెస్ కరెస్పాండెంట్ల విధులు. ఈ వ్యాపార పద్ధతి అమల్లో ఎలాంటి అవరోధాలు ఎదురవ్వకుండా ఉండేందుకు బ్యాంకులు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. పైలట్ ప్రాజెక్టుల ద్వారా అనుభవాన్ని గడిస్తున్నాయి. ఇప్పటికే పలు బ్యాంకులు స్వయం సహాయక బృందాలను, ప్రభుత్వేతర సంస్థలను, ఇతరత్రా సహకార సంఘాలను వాటి ప్రతినిధులుగా నియమించి పల్లెల్లో బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నాయి. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్ని మరింత బలోపేతం చేసి వాటి ద్వారా పల్లెల్లో పూర్తి స్థాయిలో సేవలందించే దిశలో చర్యలు తీసుకోవలసివుంది. ప్రైవేటు బ్యాంకుల్నీ ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయడంతో పాటు బ్యాంకుల సేవల్ని పల్లె ప్రాంతాలను విస్తరింపజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఆర్థిక సంఘటితం లక్ష్యాలను చేరాలంటే బ్యాంకులు కేవలం లాభదాయకత అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కొంత సామాజిక స్ఫూర్తితో బాధ్యతతో ముందుకెళ్లాలి.

ఆంధ్రప్రదేశ్‌లో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీ మొత్తాన్ని, సామాజిక భద్రత పెన్షన్ల మొత్తాన్ని ప్రస్తుతం ప్రభుత్వం బయోమెట్రిక్ స్మార్ట్‌కార్డ్‌ను ఉపయోగించి పంపిణీ చేసే విధంగా బ్యాంకులకు అప్పజెప్పింది. బ్యాంకులు ఈ పనిని బయట సంస్థలైన (ఔట్ సోర్సింగ్) NO, ALW, ZEROMAS లాంటి వాటికి అప్పజెప్పి వాటికి సర్వీసు ఛార్జీగా కొంత మొత్తాన్ని చెల్లిస్తున్నాయి. ఇక్కడ గ్రామాల్లో కస్టమర్ సర్వీస్ ప్రొవైడర్స్‌గా స్వయం సహాయక సంఘ మహిళలే పనిచేస్తున్నారు.

ఇందిరాక్రాంతి పథం ద్వారా అమలు చేస్తున్న సంపూర్ణ ఆర్థిక చేకూర్పు పథకంలో స్వయం సహాయక సంఘం సభ్యులకు అకౌంట్లు ఓపన్ చేయడం, రుణాలు ఇవ్వడం వల్ల కొంతవరకు బ్యాంకులు తమ టార్గెట్లను పూర్తి చేయగలుగుతున్నాయి.

ఈ ఆర్థిక చేకూర్పు పథకం ద్వారా పేదలను ముఖ్యంగా గ్రామీణులను బ్యాంకింగ్ వ్యవస్థ ప్రధాన స్రవంతిలోకి తీసుకొస్తే, దేశంలో 58 శాతం మంది అభివృద్ధిలో మంచి మార్పు కన్పిస్తుంది. తద్వారా దేశ ఆర్థిక పరిస్థితికి శుభపరిణామం. గత దశాబ్ద కాలంగా గ్రామీణ భారత ప్రాంతాల్లో వచ్చిన చెలికం, సమాచార, సాంకేతిక, మహిళా స్వయం సహాయ సంఘాల విప్లవాల సరసన ఈ గ్రామీణ బ్యాంకింగ్ విప్లవం కూడా నిలబడుతుందని ఆశిద్దాం.

- ఎ. ప్రశాంతి
ఫ్యాకల్టీ, ఇ.టి.సి, శ్రీకాళహస్తి

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : **K. Chandra Mouli**



Sthanka_Septcolo.indd 29 02/09/11 3:20 PM






## కీ క్యాప్ గ్రామాలల

1. మత్తు లేదు : గ్రామాలలో
పదార్థాల అ

2. చెత్త లేదు : పరిసరాల పా
మలవిసర్జన
పారద్రోలి ఆరి

3. కత్తి లేదు : పర్యావరణా
చర్యలనూ అ
చర్యలు ఉండ

4. పగ లేదు : గ్రామంలో ఎ
ప్రజలంతా శా
విభేదాలు లేక
కల్పి గ్రామ అ

5. పొగ లేదు : ఆరోగ్యానికి
ఉత్పత్తులను
హాని కల్గించే
తగ్గించాలి.
వనరుల విని

**అవినీతి అంతం - అభివ**
**కీ క్యాప్ గ్రామాలలో భారత**
**ఈ రంగాలలో పురో**